# టిసిపార్డ్
# TSIPARD

# స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 7 సంచిక: 11&12

డిసెంబర్, 2015 – జనవరి, 2016



*ఎడిటర్*

**అనిత రామచంద్రన్**, ఐ.ఏ.ఎస్.
కమీషనర్, టిసిపార్డ్

*ఎడిటోరియల్ బోర్డు*

**కె. యాదయ్య**
**డా॥ కె. ఆసయ్య**
**ఎ. నాగేశ్వరరావు**

*కాన్సెప్ట్, ప్లానింగ్,*
*ఎడిటింగ్, డిజైనింగ్*

**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్, టిసిపార్డ్**
**కాక్స్టన్ ఆఫ్సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్



*ప్రచురణ*

**టిసిపార్డ్**
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
తెలంగాణ, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని, టిసిపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.


# విషయ సూచిక


సంపాదకీయం ..... 4
మానవహక్కుల పట్ల అవగాహన అవసరం ..... 5
స్థానిక ప్రభుత్వాలు – దళిత, గిరిజన ప్రజల ప్రతినిధులు ..... 7
సంక్రాంతి వేళ... ఆనందహేల ..... 9
ఎయిడ్స్ రహిత సమాజస్థాపన దిశగా ..... 11
వికలాంగుల శ్రమశక్తి సంఘాలు – పనితీరు ..... 13
గ్రామ పంచాయతీలో ఇంటిపన్నులో మినహాయింపు పద్ధతి ..... 14
మహిళల కోసం మరుగుదొడ్లపై ముంతాజ్ షేక్ ఉద్యమం ..... 15
నైపుణ్య అభివృద్ధితో కుశల భారత్ ..... 16
తగ్గుతున్న మానవ సంబంధాలు ..... 18
పిల్లల్లో సరైన దిశలో జిజ్ఞాస పెంచాలి ..... 19
స్థానిక సాధికారతతోనే ఆర్థిక ప్రగతి ..... 21
ఆడవాళకళకు అంటరాని వాళ్ళకు అక్షరాలు దిద్దించిన సావిత్రిబాయి పూలే ..... 23
ట్రైకోడెర్మా సేంద్రియకం మరియు జీవని యంత్రకము ..... 25
సహనం ..... 26
ట్రైనింగ్ నీడ్ ఎసెసెమెంట్ (టిఎన్ఎ)పై టిసిపార్డులో 2 రోజుల వర్క్‌షాప్ ..... 27
పేదల ఇంటికలను నెరవేరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ..... 28
తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవలు ..... 31
గ్రామీణ యువతకు ఉన్నత విద్య–ఆవశ్యకత ..... 33
సుబాబుల్ సాగు ..... 36
పాలీహౌజ్ విధానంలో కట్ పుష్పాల పెంపకం మెళకువలు ..... 38
వ్యవసాయరంగంలో నానో టెక్నాలజీ . . రెండవ హరిత విప్లవానికి నాంది ..... 40
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
మార్గదర్శకాలు, కొన్ని ప్రశ్నలు, సమాధానాలు ..... 42
అభివృద్ధి, సుస్థిరత కోసం శక్తి సంరక్షణ ..... 49
మహిళా సాధికారతకు కృషి ..... 53
బంజారాల జీవనశైలి – సంస్కృతీ సాంప్రదాయాలు ..... 55
పది చేతుల ఆత్మీయత ..... 57
యువతకు వివేకానంద సందేశం ..... 59
వాతావరణ మార్పులు – ప్రజల విధానం ..... 61

# సార్వత్రిక మానవ హక్కులు

మనిషికి సమానత్వం, హక్కులు, స్వేచ్ఛగా బ్రతకడానికి అవసరం. కాని నాగరిక సమాజంలో ఇంకా కొంత మందికి స్వేచ్ఛా హక్కులు లభించలేదు. వారు బానిసలుగా, వెట్టి చాకిరికి గురై జీవనం చీకటిలో గడుపుతున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం వివిధ చట్టాలు, పథకాల ద్వారా నేనున్నానని భరోసానిచ్చింది. ఆ భరోసాతోనే జీవించాలనే కోరికతో తమ బ్రతుకులు సాగిస్తున్నారు. సమాజంలో బలహీనుల మీద బలవంతులు పెత్తనం చెలాయించడం అనాది కాలం నుంచి ఉంది. మన దేశం అర్థభూస్వామ్యం, అర్థ వాణిజ్యస్థితిలో కొనసాగినా కూడా సంస్కరణలు ఆహ్వానించింది. ఆ సంస్కరణలు గ్రామీణుల జీవితాలలో మంచి ఫలితాలను ఇస్తున్నాయి.

వ్యవసాయరంగంలో సంస్కరణల వలన పంట ఒక ఎకరానికి 40 బస్తాల నుండి 60 బస్తాలు పెరిగింది. ఆధునిక, సాంకేతిక స్థితి వలన ఉత్పత్తి బాగా పెరిగి మరిన్ని ఫలితాలు దగ్గరైనాయి. వాణిజ్య పంటలు వేసి లాభాలను పెంచుకొంటున్నారు. అదేవిధంగా గ్రామాలలో సామాన్యులకు కూడా నూతన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. పరిశుభ్రత, ఆరోగ్యం, రక్షిత త్రాగునీరు లభ్యత అందుబాటులోకి వచ్చి ఎంతోమందికి పైగా అన్ని సదుపాయాలు లభ్యమయ్యాయి.

మహిళలు, బడుగువర్గాలవారు తమ హోదాను మెరుగుపరచుకునేందుకు ముందుకొస్తున్నారు. అంటే స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకొని అన్ని రంగాలలోకి ప్రవేశించి తమ సత్తాను నిరూపించుకొంటున్నారు. స్థానిక ప్రభుత్వాలలో 50% రిజర్వేషన్లను తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది. అందువలన పలువురు మహిళలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శిక్షణ పొందుతున్నారు. పంచాయితీరాజ్ వ్యవస్థతో, ప్రజల భాగసామ్యంతో భాగంపంచుకొని ముందుకు నడిపిస్తున్నారు.

గ్రామస్థాయి, మండల స్థాయిల్లో, జిల్లా స్థాయి స్థానిక ప్రభుత్వాలతో, ప్రతినిధులుగా ఎన్నికయి గ్రామాభివృద్ధిలో భాగం పంచుకుంటున్నారు. జిల్లా స్థాయిలో సైతం తమకు కల్పించిన వాటా ప్రకారం మహిళలు, బలహీన వర్గాల వారు మరింత ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మహిళలు తమ సామర్థ్యంతో వ్యవసాయేతర రంగాలలో పురుషులతో సమానంగా పాల్గొంటూ దూసుకుపోతున్నారు. తద్వారా సమాజాన్ని ఉత్తేజంతో ముందుకు నడిపిస్తున్నారు. చిన్నతరహా మహిళలు ఒకరి కొకరు సహాయన్నందించుకుంటూ ముందుకుపోతున్నారు. ఇతర రంగాలు బ్యాంకింగ్, పరిశ్రమలలో కూడా తమ సత్తా చూపుతున్నారు. మహిళలు తమ గుర్తింపును తమ ఆశయాలు, విజయాల ద్వారా చాటి చెప్పుకుంటున్నారు.

గ్రామీణులకు వసతులు, సౌకర్యాలు మెరుగుపరుచుకొనుటకు మానవహక్కులు తోడ్పడుతున్నాయి. గ్రామ ప్రజలు తమ గ్రామాలకు కనీస అవసరాలను తీర్చుకోవటానికి అవకాశాలను హక్కుల ద్వారా పొందుతున్నారు. ఇంకా ఇనుమడించిన దీక్షతో మానవహక్కులను అమలు చేయాల్సిన అవసరముంది. మానవ హక్కులు మన సమాజ పురోగతికి ఒక మార్గం చూపుతూ మనలను ఉత్తేజపరుస్తాయి.సమాజాలు వివిధ వర్గాల వారు మానవ హక్కుల ఉద్యమానికి ప్రోత్సాహం ఇస్తాయని ఆశిద్దాం .

( అనిత రామచంద్రన్ )

# మానవ హక్కుల పట్ల అవగాహన అవసరం

**వ్యక్తి జాతి కులమతవర్ణ ప్రాంత విచక్షణతో సంబంధం లేకుండా అతని పుట్టుకతో సహజసిద్ధంగా లభించే కనీస ప్రాథమిక హక్కులే మానవహక్కులుగా భావించాలి. మానవహక్కులు విశ్వజనీనమైనవి. నిరోధింపతగనివిగా ఉంటాయి. పరస్పర ఆధారితంగా అవిభాజ్యమైనవిగా ఉంటాయి. అందరికీ సమానంగా వర్తింపబడేవిగా ఉంటాయి. 1948లో విడుదలైన విశ్వజనీన మానవ హక్కుల ప్రకటన చారిత్రాత్మకమైనదిగా, పవిత్రమైనవిగా సభ్యదేశాలన్నీ గుర్తించాయి.**




ప్రపంచశాంతి, శ్రేయస్సు ఉండాలంటే మానవులందరికీ ఆర్థిక న్యాయం, రాజకీయస్వేచ్ఛ అవసరం. మానవజాతి కలలు కంటున్న స్వేచ్ఛ సమానత్వాలకు రూపకల్పన చేసి వాటిని అందరికీ అందుబాటులో ఉంచడమే మానవ హక్కుల ప్రకటన ముఖ్య ఉద్దేశం. అన్ని దేశాలు ప్రజలందరికీ ప్రత్యేకంగా బలహీనవర్గాలకు, రాజకీయ స్వేచ్ఛ ఆర్థికసమానత్వం, సామాజికన్యాయం కల్పిస్తూ రాజ్యాంగపరంగా శాసనపరంగా, పరిపాలనాపరంగా అనేక చర్యలు తీసుకున్నాయి.

నేటి ప్రపంచ మానవుల స్వేచ్ఛా జీవనానికి నాటి విశ్వజనీన మానవ హక్కుల ప్రకటన ఆధారం. ఎంతోకష్టంతో సాధించుకున్న హక్కులను రక్షించుట మనధర్మం. మానవ అభివృద్ధి సూచికకు, మానవ హక్కుల స్థాయికి సంబంధం ఉంది. అలాగే పాలనా పరమైన నాణ్యతను, అలాంటి హక్కుల పరిరక్షణకు విడదీయరాని బంధం ఉంది.

మానవహక్కుల పరిరక్షణ ప్రోద్బలమే సంక్షేమ రాజ్యాల పాలనకు కేంద్ర బిందువు కావాలి. మానవహక్కుల పరిరక్షణ విషయంలో కేంద్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవహక్కుల కమిషన్లు కేవలం సలహాలిచ్చే కమిషన్‌లుగా వ్యవహరిస్తున్నాయన్నాయి. వీటికి క్వాసీ జుడీషియల్ అధికారాలు లేకపోవడం వలన అవి ప్రభుత్వాలపై నైతిక ఒత్తిడి మాత్రమే తీసుకురావటం జరుగుతున్నది. పోలీసు వ్యవస్థలో నేడు వస్తున్న మార్పులకు ఎన్‌హెచ్‌ఆర్‌సి సిఫారసులు కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.

1993 మానవహక్కుల పరిరక్షణ చట్టానికి 2006లో కొన్ని మార్పులు చేర్పులు చేసి సవరణతో దానిని ఆమోదించి అమలు చేయడం జరుగుతోంది. ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు పౌరులు ప్రత్యక్షంగా ఉన్నత న్యాయస్థానాలను రక్షించమని కోరవచ్చు.

పౌరులకు ప్రాథమిక హక్కులే గాక ప్రాథమిక విధులు కూడా ఉన్నాయి. పౌరుల హక్కులు, విధులు పరస్పర ఆధారాలు ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటుంది. హక్కులు లేని విధులు, విధులు లేని హక్కులు అరాచకానికి దారితీస్తాయి. ప్రాథమిక హక్కులకు విధులకు పోషకాలు ఆదేశసూత్రాలు.

మానవహక్కులు విశ్వజనీమైనవి. విశ్వ వ్యాప్తమైనవి. ప్రతి ఒక్కరికి సంబంధించినవి. జాతి, మత, విద్య, భాష, లింగపరంగా వ్యత్యాసాలు నిరోధించడం మానవహక్కులు ప్రధానంగా మానవుల ప్రాథమిక అవసరాలైన తిండి, బట్ట, నివాసం, విద్యకు సంబంధించినవి. సర్వమానవ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం శాంతికోసం గట్టిపునాదులు వేయడం, హింసకు, దోపిడీకి సరైన వారికి చట్టపరంగా రక్షణ కల్పించడం, అన్నివర్గాల వారు గౌరవంగా జీవించడానికి అవకాశాలు కల్పించడం, ప్రజలకు రాజకీయ భాగస్వామ్యం కల్పించడం, ప్రభుత్వ ప్రమేయం తగ్గించడం, ప్రపంచవ్యాప్తంగా ప్రతిఒక్కరు మానవ హక్కులను గౌరవించి ఆచరించేలా చేయడం.

మానవహక్కులను రక్షించి పెంపొందించవలసిన బాధ్యత ప్రభుత్వాలదే అయినా ఆయా ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకొనే ప్రజల్లో మానవహక్కుల ప్రాధాన్యత పట్ల గాఢ విశ్వాసం తీవ్రచైతన్యం పరిణీతి, స్ఫూర్తి కలగాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వీటిస్థాయి ఎక్కువగా లేకపోవడంతో మానవహక్కులకు భంగం వాటిల్లుతుంది.

మానవహక్కుల పరిరక్షణలో భాగంగా వాటి రక్షణ బాధ్యతను రాజ్యాంగబద్ధంగా అత్యున్నత న్యాయస్థానాలైన సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టులపై ఉంచటం జరిగింది. మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడిన వ్యక్తులను, సంస్థలను విచారించి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అట్టడుగు వర్గాలు, వెనుకబడిన జాతులు అల్పసంఖ్యాక వర్గాల హక్కులను పరిరక్షించటం కోసం వారి ప్రయోజనాలు కాపాడటం కోసం భారత ప్రభుత్వం జాతీయస్థాయిలో ఎస్సీ,ఎస్టీ జాతీయ కమిషన్, అల్పసంఖ్యాక వర్గాల కమిషన్, మహిళా జాతీయ కమిషన్‌లను ఏర్పాటు చేసింది.

యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌లో 30 ఆర్టికల్స్ ఉన్నాయి. ఈ డిక్లరేషన్‌లోని అంశాలు, ప్రపంచంలోని మానవులందరూ పుట్టుకతో స్వేచ్ఛా జీవులు. మానవులందరికీ జీవించే హక్కు ఉంది. బానిసత్వం నుండి వేధింపుల నుండి బలవంతపు నిర్బంధం నుండి రక్షణ నిష్పాక్షతమైన న్యాయాన్ని పొందడానికి నేరం రుజువు అయ్యేవరకు నిరపరాధిగా ఉండడానికి ఒక చోటు నుండి మరో చోటుకు స్వేచ్ఛగా వెళ్లడానికి పూర్తి స్వాతంత్ర్యం ఉంది.

విద్యావకాశాలలో వివక్షత లేకపోవడం స్త్రీ పురుషులకు సమానవేతం, స్త్రీలకు సంబంధించిన విషయాల్లో విచక్షణ చూపకపోవడం, నిర్బంధ పనిని రద్దుపర్చడం, ఆకలి, పౌష్టికాహారలోపాన్ని నివారించడం, పిల్లల హక్కులను కాపాడటం ముఖ్యమైనవి.

మనదేశంలో మానవహక్కుల పరిరక్షణలో భాగంగా అక్టోబర్ 12,1993లో జాతీయ మానవహక్కుల సంఘాన్ని జస్టిస్ రంగనాథ మిశ్ర ఛైర్మన్‌గా ఏర్పాటు చేశారు. మానవహక్కుల సంఘాన్ని హక్కుల ఉల్లంఘనకు సరైన వారి ఫిర్యాదు మేరకు కేసుల విచారణ చేపడుతుంది. లేదా సుమోటోగా కేసులు స్వీకరించవచ్చు.

మన రాజ్యాంగంలో 19 నుంచి 30 వరకు గల ప్రకరణలు జీవితం, స్వేచ్ఛ, సమానత్వం, వ్యక్తిహోదాకు సంబంధించినవి. ఇవి మానవహక్కులుగా రాజ్యాంగం పేర్కొంది.

ప్రకరణ 19 ప్రకారం వాక్‌స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛతో సహా ప్రాథమిక హక్కులనూ అనుభవించవచ్చు. దేశంలో ఎక్కడైనా స్థిరపడవచ్చు. తనకిష్టమైన వృత్తిని చేపట్టవచ్చు.



ప్రకరణ 20 వ్యక్తిగత జీవితానికి, స్వేచ్ఛకూ రక్షణ కల్పిస్తుంది.

ప్రకటన 21 శాసనప్రకారం ఏర్పడిన విధానం ప్రకారం తప్ప ఏ వ్యక్తికీ గత జీవితానికీ, స్వేచ్ఛకూ భంగం కలిగించకూడదని ప్రేరణ పేర్కొంటుంది.

ప్రకరణ 22 కొన్ని కేసుల్లో అరెస్టు, నిర్భంధం నుంచి రక్షణ కల్పిస్తుంది. ప్రకరణ 23 వెట్టిచాకిరి, మానవ వ్యాపారాన్ని నిషేధిస్తుంది.

ప్రకరణ 24,14 సంవత్సరాలలోపు పిల్లలతో పనిచేయించుకోవటాన్ని నిషేధిస్తుంది. ప్రకరణ 25 నుండి 35 వరకు మత, స్వేచ్ఛ హక్కును కల్పించాయి.

రాజ్యాంగంలోని మూడవభాగంలో పొందుపర్చిన న్యాయబద్ధమైన హక్కులుగా ప్రాథమిక హక్కులను చెప్పటం మానవహక్కుల ను పునరుద్ఘాటిస్తుంది. రాజ్యాంగంలోని 4వ భాగంలో పొందుపర్చిన నిర్దేశిక నియమాలు న్యాయబద్ధమైన హక్కులుకానప్పటికీ రాష్ట్రాలు తమ విధాన ప్రకటనలో వాటిని విస్తరించజాలవు అనేది 37వ అధికరణం తెలియజేయడం జరిగింది. దీనినిబట్టి పౌరుల సామాజిక ఆర్థిక, సాంస్కృతిక హక్కులు పరిరక్షణ కోసం ప్రభుత్వం చట్టాలు చేయడం, సుపరిపాలనా విధానాలు అమలు చేయడం రాజ్యాంగపరంగా తప్పనిసరి. హక్కుల పరిరక్షణ జ్యుడిషియల్ రివ్యూ ద్వారా పరిరక్షించబడుతున్నాయి.

ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశ సూత్రాలు అంతర్జాతీయ మానవహక్కులకు ప్రాతిపదికగా భారతరాజ్యాంగంలోని పీఠికలో పొందుపర్చినట్లుగా ఆర్థికరాజకీయ సామాజిక న్యాయం, భావస్వేచ్ఛ వాక్‌స్వాతంత్ర్యం, మతస్వేచ్ఛ సమానహోదా, అవకాశాలు ప్రజలందరిలో వ్యక్తిగౌరవాన్ని పెంపొందించేందుకు సామరస్య పూర్వక వాతావరణాన్ని నెలకొల్పటమే లక్ష్యం. మానవహక్కుల పరిరక్షణకు చట్టాలను ఇంకా పటిష్టవంతం చేయాలి.

*– ఆర్.వి. సత్యం, విశ్రాంత ఉపాధ్యాయుడు*

# స్థానిక ప్రభుత్వాలు - దళిత, గిరిజన ప్రజా ప్రతినిధులు

**73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా భారత దేశంలో స్థానిక స్వపరిపాలనకు రాజ్యాంగ ప్రతిపత్తి లభించింది. ఈ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీరాజ్ సంస్థలలో సభ్యులుగా, అధ్యక్షులుగా పదవుల అలంకరించడానికి దళితులకు, గిరిజనులకు, మహిళలకు అవకాశం కలిగింది. మొత్తం దేశవ్యాప్తంగా ఎంతో మంది దళిత, గిరిజనులకు స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యం లభించింది. ముఖ్యంగా యస్.సి., యస్.టి.లు మరియు మహిళలు ప్రజా ప్రతినిధులుగా అధికారం చేపట్టిన తర్వాత వారి అనుభవాలు, విజయగాథలు స్థానిక ప్రభుత్వాల్లోని మిగతా ప్రతినిధులకు స్ఫూర్తిదాయకం అవుతున్నాయి.**

భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ రచనలో దళిత, గిరిజన, బహుజనులకు ప్రజాస్వామ్యంలో సరైన ప్రాతినిధ్యం ద్వారా స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందుబాటులోకి రావాలని కోరుకున్నారు.

73, 74వ రాజ్యాంగ సవరణలకు ముందు పంచాయితీరాజ్ సంస్థలలో మహిళలకు, బలహీన వర్గాల వారికి, షెడ్యూల్డు కులాలు, తెగల వారికి ప్రాతినిధ్యం కల్పించడానికి కొంత ప్రయత్నం జరిగింది. కానీ అది సఫలం కాలేదు. 73, 74 రాజ్యాంగం సవరణననుసరించి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలో ప్రస్తుతం మహిళలకు సగం స్థానాలు రిజర్వు చేయబడ్డాయి. అలాగే వెనుకబడిన వర్గాలకు 34%, షెడ్యూల్డు కులాలు, తెగల వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించబడ్డాయి.

ఈ రిజర్వేషన్లు కల్పించిన తరువాత పంచాయతీరాజ్ సంస్థలలో అన్ని వర్గాలకు ఇప్పుడు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం ఏర్పడింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రస్తుతం ఈ వర్గాల ప్రజలు పంచాయతీ పాలనలో చక్కటి ప్రతిభను కనబరుస్తున్నారనడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఊరి ప్రజలందరు తమ సమస్యలను తామే చర్చించుకొని అందరి ఆమోదంతో నిర్ణయాలు తీసుకోవడానికి ప్రజలకు అతి చేరువలో ఉన్న సంస్థలు పంచాయితీరాజ్ సంస్థలు. ఈ ప్రజా సంస్థలలో ఊరి ప్రజలందరు పాల్గొని అధికారాన్ని పంచుకునే వీలుంటుంది. అప్పుడే ఈ సంస్థలు ఆర్థిక ప్రగతికి, సామాజిక న్యాయానికి సాధనాలుగా ఉంటాయి. అయితే అక్కడక్కడా అనేక కారణాల వల్ల కొన్ని వర్గాలకు ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు తగినంత చోటు లభించలేదు. గ్రామంలో కొందరు పెద్దల ఆధిపత్యంతో ఈ సంస్థలు నడుస్తున్నాయని ఒక అపవాదు ఉంది. పంచాయితీరాజ్ సంస్థలు ఆశించిన మేరకు నిజమైన ప్రజా సంస్థలుగా రూపుదిద్దుకోలేకపోవడానికి ఇది ఒక ప్రధాన కారణం అని అంటారు.

వారి సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం వల్ల దళితులు, గిరిజనులు, మహిళా ప్రజా ప్రతినిధులపై కొనసాగుతున్న వివక్ష కారణంగా రిజర్వేషన్ల స్ఫూర్తిని అక్కడక్కడ కొన్ని చోట్ల గండి కొడుతున్నారు. భార్య స్థానంలో భర్త పెత్తనం చేయడం, వెనుకబడిన షెడ్యూల్డు వర్గాల ప్రజా ప్రతినిధులు ఉన్నచోట్ల ఇతరులు పెత్తనం చేస్తున్నారనే వాదన ఉంది. రిజర్వేషన్లు కల్పించబడిన స్థానాలలో ఉపాధ్యక్ష పదవులు ఉన్నత వర్గాల వారు చేజిక్కించుకొని, పరోక్షంగా ఆయా సంస్థల కార్యకలాపాలను నడుపుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

ఇలాంటి సమస్యలు తాత్కాలికమే. కాలక్రమేణా అవి సమసిపోతున్నాయి. కానీ అక్కడక్కడ కొంత మేరకు ఇబ్బందులు ఉన్నప్పటికీ బలహీన వర్గాలకు, మహిళలకు అవకాశం వస్తే అద్వితీయమైన ప్రతిభ కనపరచగలరని, ప్రజలను కలుపుకొని అభివృద్ధి సాధించగలరని గత పది సంవత్సరాల అనుభవం చెబుతుంది. ఈ నేపథ్యంలో అనేక విజయగాథలు ఉన్నాయి. కొన్ని సందర్భాలలో జనరల్ (రిజర్వు కాని) స్థానాలలో సైతం ఎన్నిక కాబడి, ప్రజలకు సేవలందించడంలో ప్రముఖ పాత్ర పోషించి పలువురి ప్రశంసలు పొందుతున్నారు.

## వెంకుడోతు బుజ్జి



శ్రీమతి వెంకుడోతు బుజ్జి గిరిజన మహిళ, నల్లగొండ జిల్లా నారాయణపురం మండల అధ్యక్షురాలుగా 2014 నుండి పనిచేస్తున్నారు. ఈమె బి.ఎ. వరకు చదువుకున్నారు. 1995-2000 వరకు వాయిల్‌పల్లి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయి 5 సంవత్సరాలురాలు పూర్తి చేశారు.

2001 నుండి 2003 వరకు సాంఘిక సంక్షేమశాఖలో డైరెక్టర్‌గా (నామినేటెడ్ పదవిలో) పనిచేశారు. 2006 నుండి 2011 వరకు నారాయణపురం (జడ్పీటీసీ) జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యురాలిగా పనిచేశారు.. అనంతరం వెంకుడోత్ బుజ్జి నారాయణపురం మండల పరిషత్ అధ్యక్షురాలుగా సమర్థవంతంగా పనిచేస్తున్నారు. స్థానిక ప్రభుత్వాల్లోని వివిధ స్థాయిల్లో ప్రజాప్రతినిధిగా విశేష సేవలందించి, అన్ని వర్గాల ప్రజలు, అధికారులు మన్ననలను పొందారు.

# వనజ జనార్ధన్



కలెక్టరు గారి నుండి 'మార్పు' కార్యక్రమానికి సంబంధించిన అవార్డును అందుకున్నారు. పైగా మండలస్థాయిలో మహిళా సర్పంచుల శిక్షణా కార్యక్రమాలకు శిక్షకురాలిగా కూడా వ్యవహరించారు. జిల్లాలోనే కాకుండా, రాష్ట్రస్థాయిలో అందరి మన్ననలు పొందారు.

మెదక్ జిల్లా కలబ్‌గూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎస్.సి. వర్గానికి చెందిన శ్రీమతి వనజ జనార్ధన్ బి.ఎస్సి, బి.ఇడి. చేశారు. ఈమె 2013 లో ఎన్నికైనప్పటి నుండి గ్రామాభివృద్ధిపై దృష్టి సారించి పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, పాఠశాల, మరుగుదొడ్ల విషయంలో తన చొరవతో, పట్టుదలతో సంబంధిత శాఖలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు మరియు గ్రామస్థుల సహకారాన్ని తీసికొని విశేష అభివృద్ధిని సాధించటం జరిగింది.

మాతాశిశు సంరక్షణా కార్యక్రమాలలో కలబ్‌గూర్ పంచాయతీలో ఉత్తమ ఫలితాలు వచ్చినందున శ్రీమతి వనజకు ఆప్పటి జిల్లా

## టి.సిపార్డు పాత్ర

దళిత, గిరిజన ప్రజా ప్రతినిధుల శక్తి సామర్థ్యాలను పెంచుకునే విధంగా వారిని ప్రోత్సహించడానికి, చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి, వారు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవడం లాంటి అనేక రకాల అంశాల మీద శిక్షణా కార్యక్రమాలు తెలంగాణ పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శిక్షణాసంస్థ (టిసిపార్డ్) ద్వారా ఇవ్వడం జరుగుతుంది. ఈ శిక్షణా కార్యక్రమాల ప్రభావంతో చాలామంది ప్రతినిధులు ప్రజలు తమకిచ్చిన అధికారాన్ని వినియోగించుకుని ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేకుండా ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నిరూపిస్తున్నారు. అధికార సమావేశాలలో, చర్చలలో ఇతర వర్గాల వారికి, పెత్తనం చలాయించే అవకాశం ఇస్తే తమను తాము అవమానించుకున్నట్లే అని భావిస్తున్నారు.

దళిత, గిరిజన, ప్రజా ప్రతినిధులు 'రిజర్వేషన్ ఉంది కాబట్టి రాజకీయాల్లోకి వచ్చాం, కాని ఈ రాజకీయాలు ఈ పరిపాలన మాకేం తెలుసు' అనే భావన నుండి బయటకు వస్తున్నారు. విభిన్న వ్యక్తులతో, సంస్థలతో, అధికారులతో హుందాగా వ్యవహరిస్తున్నారు. గ్రామసభను నిర్వహించడం, వివిధ అంశాలను కూలంకశంగా చర్చించడం, గ్రామసభ ద్వారా నిర్ణయించిన ప్రణాళికలను అమలు చేయడంతో చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు.

ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు దళిత, గిరిజన, మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చే బాధ్యతలను నెరవేర్చడానికి తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ (టిసిపార్డ్) వంటి ప్రభుత్వ సంస్థ వారి నైపుణ్యాలను వృద్ధి చేయడానికి ఎప్పటికప్పుడు కార్యాచరణ రూపొందించుకుంటోంది.

ఈ సంస్థ పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసే అధికారులకు, సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు ఇతర శాఖల అధికారులకు తమ తమ సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు అవసరమైన శిక్షణను ఒక ప్రత్యేకమైన కేంద్రం ద్వారా శిక్షణ అందజేస్తుంది. వనరుల సమీకరణ, చట్టాలు, శాసనాలు, ప్రభుత్వ పథకాలు, పరిపాలనా వ్యవస్థ పెట్టుబడుల యాజమాన్యం, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, వికేంద్రీకరణ ప్రణాళిక, నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇస్తుంది.

ప్రస్తుతం దళిత ప్రజా ప్రతినిధులు అభివృద్ధి అంశాలలో స్వేచ్ఛగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాము పొందిన శిక్షణలు సద్వినియోగం చేసుకుంటున్నారు. వివిధ వర్గాలను కలుపుకుని వారి, వారి అనుభవాలను, సలహాలను, సహకారాలను వాడుకుంటున్నారు. టి.సిపార్డ్ సలహా కేంద్రం ద్వారా సమస్యలకు తగిన పరిష్కారాలు తెలుసుకుంటున్నారు. పేదల పట్ల బడుగు, బలహీన వర్గాల పట్ల ఎంతో ప్రేమతో వ్యవహరిస్తున్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం కోసం అడుగులు ముందుకు వేస్తున్నారు.

అవకాశాన్ని అందిపుచ్చుకుని, ఆత్మవిశ్వాసంతో అట్టడుగు స్థాయి నుండి అందరినీ కలుపుకుని అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. బహుముఖ అభివృద్ధిని సాధించడంలో కృతకృత్యుల వుతున్నారు. బాధ్యతాయుతమైన చైతన్యవంతమయిన నాయకత్వంతో ముందుకుపోతున్నారు.

అంతేకాక స్థానిక సంస్థల్లో ఎన్నికైన దళిత, గిరిజన ప్రజా ప్రతినిధులకు క్షేత్ర సందర్శన, అవగాహన పర్యటనల ద్వారా కూడా ప్రత్యేకంగా టి.సిపార్డ్ శిక్షణ ఇస్తుంది. ఇటువంటి అవకాశాన్ని దళిత, గిరిజన ప్రజా ప్రతినిధులు ఉపయోగించుకుని స్థానిక సంస్థల్లో పరిపాలన సాగించడంలో మరింత ముందుకెళ్ళాలని ఆశిద్దాం.

భారతదేశంలో అట్టడుగున ఉన్న వ్యక్తి కూడా దేశంలోని అత్యున్నత వ్యక్తితో సమానంగా దేశానికి పాలకుడు కావాలన్నదే జాతిపిత మహాత్మాగాంధీ ఆశయం.

*– కె. యాదయ్య గౌడ్, సంయుక్త సంచాలకులు (పరిపాలన), టి.సిపార్డ్*

# సంక్రాంతి వేళ...
# ఆనందహేల



**ప్రతి జాతి జీవనానికీ పండుగలు ఎంతో విశిష్టమైనవి. సంస్కృతిలో భాగంగా సంప్రదాయాలకు భూమికగా 'పండుగ' ఆలరారుతూ ఉంటుంది. వ్యక్తుల మధ్య, సంస్కృతుల మధ్య, మతాల మధ్య వైవిధ్యం ఉండవచ్చు. కానీ కొన్ని కొన్ని కాలాలలో పర్వదినాలను జరుపుకోవటం అందరిలోనూ కన్పిస్తుంది. ఇవన్నీ మానవ వికాసం కోసమే. వ్యక్తిత్వాన్ని, జీవనాన్ని సుఖప్రదం, శాంతిమయం చేసుకోవడానికే. అటువంటి సుఖశాంతులనూ, సంపదలనూ కలిగించేదీ, ఆధ్యాత్మిక విశేషాలు, ప్రకృతి రహస్యాలు కల విశిష్టమైన పండుగ సంక్రాంతి. ఒక్క తెలుగు దేశంలోనే కాదు వివిధ ప్రాంతాలలో విశిష్టంగా జరుపుకొనే పండుగే సంక్రాంతి.**

ఈ పర్వదినం నాడు తెలుగునాట ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ప్రతి ఒక్కరి ముంగిటా సిరిసంపదలు నాట్యమాడే వేళ వెల్లివిరుస్తుంది ఆనందహేల.

మనకి 12 తెలుగు నెలలు ఉన్నాయి. వాటిలో పుష్యమాసం ఒకటి. ఈ మాసంలోనే సంక్రాంతి వస్తుంది. ఇది డిసెంబరు మధ్యలో వచ్చి జనవరి మధ్యలో పుష్యమాసం వెళ్ళిపోతుంది. ఈ నెలరోజులూ మహిళలు ముఖ్యంగా ఇళ్ళముందు రథం, ముత్యాలముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. ఆడపిల్లలు ఈ ముగ్గుల చుట్టూ కోలాటం చేస్తారు.

## మకర సంక్రమణం

సూర్య ప్రయాణానికి సంబంధించిన పండుగే సంక్రాంతి. సూర్యుడు ధనూరాశిని విడిచి మకరరాశిలోనికి ప్రవేశించి ఉత్తరాభిముఖుడైన రోజున ఉత్తరాయణం వస్తుంది. ఈ కాలం ప్రాకృతికంగా నూతన శోభతో అలరారుతూ ఉంటుంది. లోకబాంధవుడైన సూర్యభగవానుడు రాశిని మార్చుకొని అదే విధంగా జనజీవన స్థితిగతుల్ని కూడా మార్చే శుభకాలం ఇది. ఇలా మారడాన్నే సంక్రమణం అంటారు. మొత్తం 12 రాశులలోనికీ 12 సార్లు సూర్యుడు ప్రవేశించినప్పుడు మనకి 12 సంక్రాంతులు వస్తాయి. సంవత్సరాన్ని రెండుగా విభజించి 1. ఉత్తరాయణం 2. దక్షిణాయనంగా చెప్తారు.

ఉత్తరాయణ పుణ్యకాలం సంక్రాంతితో ప్రారంభమవుతుంది. అందుకే మకర సంక్రాంతి ఎంతో విశిష్టమయినది. పంట చేతికి అందిన ఆనందంతో 'మకర సంక్రాంతి'ని అందరూ జరుపుకొంటూ ఉంటే, దేశవిదేశాలలో అన్నిచోట్లా ఇదే సందర్భంలో ఉత్సవం చేసుకొంటూ ఉంటారు. ఉత్తర భారతదేశంలో భోగిని 'టాడి' అని పిలుస్తారు. తమిళంలో పోగు, పొంగు అనే పదాలతో భోగి, పొంగల్ పండుగలుగా పిలుస్తారు. ఈ అర్థంలోనే పొంగల్, పొంగళ్ అనే పదాలు బాగా వ్యాప్తిలోనికి వచ్చాయి. ధనుర్మాసం మొదటి రోజున ప్రధాన దేవాలయాలలో 'నెలగంట' పెడతారు. ప్రతిరోజూ పూజలు చేస్తారు. గృహాలన్నింటినీ శుభ్రంగా కడిగి, రంగులు వేస్తారు.



## ఆధ్యాత్మిక సంక్రాంతి

సూర్యుడు విష్ణువే. అందుకే సూర్యనారాయణుడంటాం. సూర్యుడే త్రిమూర్త్యాత్మకుడు. వైదిక లైకిక వాఙ్మయాలూ సూర్య ప్రాధాన్యాన్ని వివరించాయి. ఋగ్వేదం సూర్యమండలమనీ, అందులోని జ్వాలలే సామవేదమనీ ఛాందోగ్యోపనిషత్తు పేర్కొంది. మానవ లోకానికి జీవశక్తి ప్రదాత సూర్యుడే. అందుకే అత్యంత ప్రాచీన సంస్కృతులలోనూ (ఈజిప్టు, మెసపటోమియా, మెక్సికో, జపాన్, పెరూ) సూర్యారాధన ఉంది. రాజులలో సూర్యవంశ రాజులకు ఎంతో విలువ, గౌరవం ఉంది. సూర్యుడు తన ప్రయాణాన్ని సప్తాశ్వాలతో, 360 ఆకులున్న ఒకే ఒక్క చక్రంతో, 24 అంచులు, 12 కాడిపోలులు ఆరుముఖాలు (పర్వాలు, రాశులు, ఋతువులు) కలిగి సాగిస్తాడని వేదప్రమాణం. ప్రకృతి శక్తుల్ని



చక్కగా ఉపయోగించుకొన్న నాడే మానవజాతి సౌభాగ్యమని సంక్రాంతి సందేశం. ఈ పండుగ 4 రోజులు జరుగుతుంది.

### భోగి

మొదటిరోజున భోగి. గోదాదేవి నెలరోజులు ప్రార్థిస్తే రంగనాథుడు స్వయంగా వచ్చి ఎన్నో భోగాలు ఇచ్చాడట. ఈ రోజు 'భోగిమంట' వేస్తారు. మంచువల్ల ఏర్పడే క్రిమికీటకాదులన్నీ ఈ మంటల్లో పడి మాడిపోతాయి. ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. పాత వస్తువుల్ని మంటల్లో వేస్తారు. ఇది సంస్కార చిహ్నం. భోగి రోజున తలస్నానం చేసి కొత్తబట్టలు ధరిస్తారు. గొబ్బిగౌరివ్రతం చేస్తారు. ఆవుపేడతో గొబ్బెమ్మలు చేసి ముంగిళ్ళను అలంకరిస్తారు. భోగిపళ్ళు పోయటం, బొమ్మల కొలువులు పెట్టటం భోగి ప్రత్యేకత.

### సంక్రాంతి

ఇది మొక్కుల పండుగ. పంట చేతికందే కాలంలో పితృదేవతలను స్మరించటం, వారికి 'బలిప్రదానం' చేయటం సంప్రదాయం. కొత్త బియ్యంతో పొంగళ్ళు, పులగాలు వండుతారు. సంక్రాంతి నుండి సూర్యకిరణాలలో వేడి పెరుగుతుంది. కాబట్టి ఈ రోజు తెలగపిండి ఒంటికి పట్టించి స్నానం చేస్తారు. జ్యోతిషం ప్రకారం మకరరాశికి అధిపతి శనీశ్వరుడు. శని సూర్యపుత్రుడు. వాతాన్ని కలిగించే గ్రహం. అందువల్ల ఈ వాతాన్ని పోగొట్టడానికి నువ్వుల నూనెనూ వంటికి పట్టించి స్నానం చేయటం, గుమ్మడి మొదలగు కూరలను వాడటం ఆచారంగా పెట్టారు. అందరూ తమకు పుణ్యలోకాలు ప్రాప్తించాలని దానధర్మాలు చేస్తారు.

### కనుము

ఇది మూడో రోజు పండుగ. ఇది పూర్తిగా రైతుల పండుగ. తమ కష్టంలో పాలుపంచుకొన్న పశువులను గౌరవించి పూజిస్తారు. పశువుల శాలలో వేకువనే పొంగళ్ళు వండుతారు. ఈ సమయంలో 'పాల పొంగలి', 'పశువుల్‌పొంగలి' అని అరుస్తారు. దీనిని దేవతలకు నైవేద్యం పెట్టి, ఆ మెతుకులను పొలాల్లో చల్లుతారు. ఇలా చేస్తే పంటలు బాగా పండుతాయని నమ్మిక.



## సంక్రాంతి శోభ



ఒకప్పటి జ్ఞాపకంలా
మధురంగా..
హృదయాలలో కదలాడే మకరసంక్రాంతి శోభ
సంస్కృతికి కేతనమై నిలుస్తుంది
పల్లెలన్నీ
పౌష్యలక్ష్మి ఒడిలో సేదదీరేవేళ
చెప్పలేని అనుభూతి విచ్చుకొంటుంది
పెద్దలు తీర్చుకొనే మొక్కుబళ్ళు..
స్వేదం పంచుకొని బతుకు పండించిన పశువులతో
కలిసి కలివిడిగా చేసుకొనే సంబరాలు..
అరవిరిసిన గొబ్బెమ్మలు..
రథాలను వీధీవీధీ తిప్పే ముగ్గులూ..
హరిదాసుల సందళ్ళూ
డూడూబసవన్నల హడావిళ్ళూ
పెద్దలపండుగను పెద్ద పండుగ చేశాయి
జానపదుల గళాల్లో విచ్చుకున్న పాటలపిట్టలు వలసపోయి
ఎన్ని తీరాలలో వాలాయోకదా..
ప్రపంచం మొత్తం ఒక్కటిగా ముకుళించుకొన్న
వర్తమానంలో కూడా
సంక్రాంతి శోభ
నిత్యమూ నూతనంగా అలరారుతూనే ఉంటుంది
మనిషి సాంకేతికంగా ఎంత ఎదిగినా
మూలాల్ని విడిచి ఎక్కడికీ పోలేదన్న సత్యాన్ని
చరిత్ర నిరూపిస్తూనే ఉంటుంది

*- యస్.ఎ.టి. రాజ్యలక్ష్మి, తెలుగు అకాడమి*

### ముక్కనుము

ఇది నాలుగో రోజు పండుగ. ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకొనే పండుగ ఇది. ఊరి దేవతలను విశేషంగా పూజిస్తారు. కోడిపందాలు, ఎడ్లపందాలు జరుగుతాయి. ఈ రోజు అయిన తరువాతే ప్రయాణాలు మొదలవుతాయి. పశువుల్ని శుభ్రంగా అలంకరించటం, ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టటం ఈ పండుగ ప్రత్యేకత.

గంగిరెద్దులాటలు, బుడబుక్కల వేషాలు, జంగం దేవరలు, పగటి వేషగాళ్ళు సంక్రాంతి రోజులలో మన ముంగిళ్ళకు వచ్చి సంక్రాంతి శోభను ఊరంతా వెదజల్లుతారు. చేతికి పంట అందిరావటంతో ఈ పండుగ రోజుల్లో భోగభోగ్యాలతో ఇళ్ళన్నీ కళకళలాడతాయి.

*- డా॥ అద్దంకి శ్రీనివాస్*

# ఎయిడ్స్ రహిత సమాజస్థాపన దిశగా...

**హెచ్.ఐ.వి. అనేది ఎయిడ్స్ వ్యాధిని కలుగజేసే ఒక క్రిమి మాత్రమే. ఎవరికైనా హెచ్.ఐ.వి సోకిన వెంటనే ఎయిడ్స్‌రాదు. హెచ్.ఐ.వి. దశ నుండి ఎయిడ్స్ దశకు చేరడానికి దాదాపు ఎనిమిది నుంచి పది సంవత్సరాల కాలం పడుతుంది. ఈ కాలంలో చాలా మంది హెచ్.ఐ.వి. పాజిటివ్ గల వ్యక్తులలో పైకి ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనబడవుకాని వారి ప్రమాదకర ప్రవర్తన వలన ఇతరులకు చాపకింద నీరులా ఈ వ్యాధి వ్యాపిస్తుంది.**

ఎయిడ్స్ వ్యాధి 1983 ప్రారంభంలో ప్రపంచదేశాలకు ప్రధాన శత్రువుగా పరిచయమైంది. డబ్ల్యుహెచ్ఓ వేదికగా ఆనాడు పడిన బీజం నేడు 131 దేశాల్లో ఎయిడ్స్‌వ్యాధిని పారద్రోలేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చురుగ్గా సాగతుండటానికి కారణమైంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ 1988లో డిసెంబరు 1 ని ప్రపంచ ఎయిడ్స్ దినంగా ప్రకటించి నిర్వహించడం ప్రారంభించింది. 'మలినమైన మీ రక్తం, స్వేదం, కన్నీళ్లు ఈ ప్రపంచాన్ని మారుస్తాయి' అనే నినాదంతో ఎయిడ్స్ బారినపడిన వారినుద్దేశించి ప్రపంచ ప్రజల ఆరోగ్యం కోసం డిసెంబర్ 1ని ఎయిడ్స్ దినంగా ఏర్పాటు చేసింది డబ్ల్యుహెచ్‌వో.



భయానక ఎయిడ్స్‌వ్యాధి సంక్రమణపై విస్తృతమైన అవగాహన కలిగించడం, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల జీవనప్రమాణ కాలాన్ని పెంచి మృతులసంఖ్యను క్రమేణా తగ్గించేందుకు ఇంగ్లీషు మందుల వినియోగం వంటి కార్యక్రమాల నిర్వహణకు ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అయిన డబ్ల్యుహెచ్‌వోతోపాటు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాలు ఏటా 2200 ల కోట్ల డాలర్లను అల్ప మధ్యతరహా ఆదాయ దేశాలలో ఎయిడ్స్ నియంత్రణ కొరకు నిధులు వెచ్చిస్తున్నాయి.

1970-2000 ల మధ్యకాలంలో ఎయిడ్స్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా 21.8 కోట్లమంది మరణించడంతో డబ్ల్యుహెచ్‌వో అప్రమత్తమైంది. మృతుల సంఖ్యను మరింత తగ్గించేందుకు ధనిక దేశాల సహకారంతో ప్రణాళికబద్ధమైన చర్యలతో సేవలను విస్తృత పరిచింది. ఒక 2001వ సంవత్సరంలోనే 3 కోట్ల మంది ఎయిడ్స్ భూతానికి బలయ్యారు. అందులో సబ్‌సహారా ఆఫ్రికా దేశాల్లోనే అత్యధికంగా 2.3 కోట్ల మంది మరణించారు. అప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా 40 కోట్లమంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులుండగా అందులో 16 కోట్ల మంది సబ్‌సహారా ఆఫ్రికా దేశస్తులే. దాంతో బాధిత దేశాల్లో యాక్షన్‌ప్లాన్‌లను మరింత వేగవంతం చేసింది ప్రపంచ ఆరోగ్య సంస్థ. 2001 వరకు ఏటా 3 కోట్లు పైగా జరుగుతున్న ఎయిడ్స్ మృతుల సంఖ్యను 2004 నాటికి 2 కోట్లకే పరిమితం చేసింది.

2005లో 40.3 కోట్ల హెచ్.ఐ.వి బాధితులున్నట్లు డబ్ల్యుహెచ్‌వో గుర్తించింది. అయితే అదే ఏడాది ముగిసే సరికి 1.3 కోట్లమంది మాత్రమే ఎయిడ్స్ వలన మరణించారు. తాజాగా 2012 ముగిసే సరికి ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్ వలన మరణించినవారు 1.6 కోట్లని యుఎన్‌ఎయిడ్స్ ఈ ఏడాది ఆగస్టులో ప్రకటించింది. మొత్తం మీద ఎయిడ్స్ మృతుల సంఖ్య అయితే తగ్గుముఖం పట్టిందికానీ వ్యాధిగ్రస్థులు మాత్రం ఏ ఏటికాఏడు పెరుగుతూనే వున్నారు. ఎయిడ్స్‌పై అవగాహన, మందుల వాడకం పెరగడంతోనే వ్యాధిపట్ల వ్యయం క్రమేపీ తగ్గుతుందని తెలుస్తోంది. 2012 సంవత్సరం చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 9.7 కోట్ల ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు తమతమ జీవన ప్రమాణాకాలాన్ని పెంపొందించుకునేందుకు చికిత్స చేయించుకుంటూ మందులు వినియోగిస్తున్నట్లు యుఎన్ తెలిపింది.

2011 నాటికి భారతదేశంలో 2.9 కోట్ల మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులున్నట్లు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) తన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2009-10, 2010-11 వరకు డబ్ల్యుహెచ్‌వోకు దేశీయ ఎయిడ్స్ వివరాలపై నివేదికలు సమర్పించిన నాకో గత రెండేళ్ల నుండి ఎయిడ్స్‌వ్యాధిగ్రస్థులు, మృతుల వివరాల

ను డబ్ల్యుహెచ్‌వోకు నివేదించడంలేదని యుఎన్ఎయిడ్స్ 2013 రిపోర్ట్‌లో వివరించింది.

అదేవిధంగా చైనా కూడా. 2012 ముగిసే నాటికి దేశంలో మూడుకోట్లకు పైగా హెచ్ఐవీ బాధితులున్నట్లు వివిధ సర్వేలు అంచనా వేస్తున్నాయి. ప్రపంచ జనాభాలో భారత్ జనాభా ఐదింట ఒకటో వంతు ఉంటే ప్రపంచ ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల్లో ఇండియా పన్నెండింట ఒకటో వంతు ఉంది. దేశంలో ఎయిడ్స్ నియంత్రణ నివారణకు 1997-2007 వరకు రూ. 2064 కోట్లు నాకోకి అందాయి. అందులో ప్రపంచబ్యాంకు రూ.959 కోట్లు యునైటెడ్ స్టేట్స్ రూ.230.589 కోట్లు సమకూర్చింది. ఫేజ్ 3లో నాకో రూ. 7,009 కోట్లతో దేశంలో ఎయిడ్స్ నియంత్రణ కొరకు వివిధ కార్యకలాపాలు చేపట్టింది.

హెచ్ఐవీ-1,2 వైరస్‌ల సంక్రమణతో ప్రబలే అంటరాని ఎయిడ్స్ వ్యాధుల బారినుండి ప్రపంచ యువత ఎంతో అప్రమత్తంగా ఉంది. 2005లో ప్రపంచ ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల్లో 60 శాతంగా ఉన్న యువత నేడు 40 శాతానికి పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ 2400 మంది యువతీయువకులు హెచ్ఐవీ బారిన పడతున్నట్లు యుఎన్ఎయిడ్స్ వెల్లడించింది.

2012 గణాంకాల ప్రకారం ప్రపంచంలో అత్యధికంగా నేపాల్ దేశంలో 2001-2011 మధ్యకాలంలో హెచ్ఐవీ బారిన పడుతున్నవారి శాతం 0.9 నుండి 0.01కి పడిపోవడం హర్షించదగ్గ పరిణామం. అదేవిధంగా అర్జెంటీనా, బ్రెజిల్, చిలీ, ఈక్వెడార్, ఎల్‌సాలిడార్, నికరాగువా, పరాగ్వే, వెనిజులా దేశాల్లో 60-79 శాతం మేర మరణాలు పెరిగాయి. గడిచిన మూడేళ్లతో పోలిస్తే హెచ్ఐవీ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నవారి శాతం 63 మేర పెరిగినందునే ఏటేటా వ్యాధిగ్రస్థుల సంఖ్య కూడా పెరుగుతున్నట్లు స్పష్టమవుతుంది. డబ్ల్యుహెచ్‌తో తీసుకున్న చర్యల ఫలితంగా 1995 నుండి నేటివరకు మధ్యతరహా, అల్పాదాయ దేశాల్లో 14 కోట్ల మందిని రక్షించగలిగారు.

## ఎయిడ్స్ నియంత్రణకు కృషి

భారతప్రభుత్వం నుండి ప్రపంచ బ్యాంకు వరకు మొత్తం 8 అంతర్జాతీయ అధికార సంస్థలతోపాటు మరో రెండుదేశీయ అధికార సంస్థలు 1999 నుంచి నేటి వరకు రూ.10 వేల కోట్లు ఎయిడ్స్ నియంత్రణకు నిధులు విడుదల చేసాయి. భారతదేశంలో 2.39 కోట్లకు పైగా హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులున్నారని చెప్తున్న నాకో తమ తమ ఆర్ట్‌సెంటర్‌లలో కేవలం 4,86,173 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు మాత్రమే సేవలందిస్తుండటం గమనార్హం.

దేశంలోని మొత్తం ఆర్ట్ సెంటర్‌లలోని పేషెంట్లలో 45 శాతం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రథమస్థానంలో ఉండగా, 20 శాతంతో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో నిలిచింది. 2001లో దేశంలో 2.4 కోట్లు హెచ్ఐవీ వ్యాధిగ్రస్థుల సంఖ్య 2012 నాటికి 2.1 కోట్లకు తగ్గిందని యుఎన్ తన 2013 రిపోర్ట్‌లో వివరిస్తుంటే, నాకో మాత్రం దాదాపు మూడుకోట్లని లెక్కలు చూపిస్తోంది. పోనీ ఆ మేరకే సేవలందిస్తుందా? అంటే అదీలేదు. కేవలం నాలుగు లక్షల మందికి మాత్రమే ఆర్ట్‌సెంటర్‌లలో సేవలందిస్తుంది.

2012లో దేశంలో 14 లక్షల మంది ఎయిడ్స్ సంబంధిత వ్యాధులతో మరణించారని యుఎన్ ఎయిడ్స్ ప్రకటించింది. నాకో మాత్రం 4 లక్షల మందికి మాత్రమే ఆర్ట్‌సెంటర్‌లలో సేవలందిస్తుండటం విడ్డూరమైన విషయమే. ప్రపంచ అగ్రదేశాలు, సంస్థలు భారతదేశంలో ఎయిడ్స్ నియంత్రణకు వేలాదికోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా నాకో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు పైగ ణాంకాలే తేటతెల్లం చేస్తున్నాయి. దేశంలో ఎయిడ్స్ మరణాలను తగ్గించి ప్రజలు వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు డబ్ల్యుహెచ్‌వో వంటి సంస్థల మార్గదర్శకాలతో పనిచేయాలి. అప్పుడే ఎయిడ్స్ మరణాలు, తీవ్రత తగ్గుముఖం పట్టగలిగేది.

నిత్యజీవితంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు శారీరక, వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి. మానసిక ఒత్తిడి, దిగులు పడకూడదు. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి. యోగా, ధ్యానం చేయాలి. వీలైనంత ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలి. పరిశుభ్రమైన పరిసరాల్లో నివసించాలి. రోజుకి కాచి చల్లార్చిన మంచినీటిని కనీసం తొమ్మిది నుంచి పదకొండు గ్లాసుల మంచినీరు తాగాలి. ఎండాకాలంలో మంచినీటిని మరీ ఎక్కువగా తాగాలి.

ఆహారం తీసుకొనే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. సాధ్యమైనంత వరకు ఏ పూట వండిన ఆహారం ఆ పూటనే తినాలి. వంటకాల్లో అయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలి. ఉప్పును ఎంత తక్కువగా వాడితే అంత మంచిది. ఇంజక్షన్ ద్వారా మాదక ద్రవ్యాలు తీసుకునేవారు. సూదులను, సిరంజీలను వాడాల్సినవారు ఆటో డిజేబుల్ సిరంజీలను లేదా ఒక్కసారి మాత్రమే ఉపయోగించే డిస్పోజబుల్ సిరంజీలను మాత్రమే వాడాలి. ఒకవేళ కలుషితమైన సూదులను సిరంజీలను తప్పనిసరిగా వాడాల్సి వస్తే సిరంజీలను నీటిలో ఇరవైనిమిషాలు బాగా మరుగుబెట్టాలి.

అంటే క్యాన్సర్ హిమోఫీలియా, థాలసీమియా రోగులు, ప్రమాద సమయంలో ప్రసవ సమయాల్లో రక్తస్రావం జరిగినప్పుడు మొలలు ఆపరేషన్ సమయంలో రక్తం ఎక్కించుకునేవారు శరీరం విపరీతంగా కాలినప్పుడు ప్రభుత్వ గుర్తింపుపొందిన రక్తనిధి నుంచే రక్తం ఎక్కించుకోవాలి. పిపిటిసిటి కేంద్రాలలో హెచ్.ఐ.వి సోకిన గర్భిణి స్త్రీకి కాన్పునొప్పులు ప్రారంభం కాగానే నెవిరపిన్ 200 మి. గ్రాముల మాత్ర ఒకటి ఇచ్చి శిశువుపుట్టిన 72 గంటల్లో శిశువుకి కేజీ బరువుకి 0.2 మిల్లీగ్రాముల నెవిరపిన్ సిరప్ ఒక్కడోసు మాత్రమే ఇవ్వాలి. దీని వలన శిశువుకి హెచ్.ఐ.వి ఇన్ఫెక్షన్ సోకకుండా ఉంటుంది. ఎయిడ్స్ రోగులకు సేవలందించే వైద్యసిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

*- ఎం. పాండురంగారావు, విశ్రాంత ఉపన్యాసకులు*

# వికలాంగుల శ్రమ శక్తి సంఘాలు – పనితీరు

**తెలంగాణ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ  ఉపాధి హామీ పథకం  క్రింద గ్రామీణ నిరుపేద వర్గాలైన వికలాంగుల శ్రమ శక్తిసంఘాల కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించడం, సామాజిక ఆస్తులను పెంపొందించడం జరుగుతోంది.**

సకలాంగులతో సమానంగా, వికలాంగుల శ్రమ శక్తి సంఘాలను 2010 నుండి కొన్ని ప్రత్యేక సదుపాయాలతో 150 రోజుల జీవన భృతి కల్పించడమే కాకుండా వారి ఆత్మ విశ్వాసాన్ని, సంకల్ప బుద్ధి తీర్చే ఒక ఆదర్శప్రాయమైన పథకమే ఉపాధి హామీ పథకముగా వర్ధిల్లుతున్నది. నేడు ఉపాధి కూలీ కుటుంబాలు బేరమాడే శక్తితో పాటు కొనుగోలు శక్తి పెరిగి ప్రాథమిక అవసరాలను తీర్చుకోగలుగుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని 9 జిల్లాల్లో మొత్తం 8591 వికలాంగుల శ్రమ శక్తిసంఘాలను గుర్తించి మండల కంప్యూటర్ సెంటర్ ద్వారా నమోదు చేయడం జరిగింది. 54,448 కుటుంబాలకు గాను 57,893 ఉపాధి కూలీలు ఉన్నారు. 2014–15 ఆర్థిక సంవత్సరంలో 19.49 లక్షల పని దినాలు (మ్యాన్ డేస్) వివిధ ప్రోగ్రామ్‌ల ద్వారా కల్పించడం జరుగుతుంది. 24.91 కోట్లు ఆయా కుటుంబాల శ్రామిక శక్తికి వేతన రూపంలో చెల్లింపులు జరుపబడినవి. పురుషులు 39,193, స్త్రీలు 27,995, షెడ్యూల్డ్ కులాలు 17,414 మరియు షెడ్యూల్డ్ తెగలు 8,710 ఉపాధి కూలీలుగా ఈ పథకంలో భాగస్తులైనారు.

ప్రపంచ వికలాంగుల సంబరాల సందర్భంగా, గంగాధర మండలంలో వికలాంగుల శ్రమ శక్తి సంఘాలు – అవగాహన సదస్సును తేది 10–12–2015 రోజున నిర్వహించడం జరిగింది.



అత్యధిక పనిదినాలు పూర్తి చేసుకున్న (100కు పైగా) వికలాంగుల శ్రమ శక్తి సంఘాల సభ్యులను శాలువా, పూల మాలలతో సత్కరించి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే విధంగా సదస్సును నిర్వహించడం జరిగింది. సన్మాన గ్రహీతులైన ర్యాలపల్లి గ్రామపంచాయితీ నుండి కట్ట శంకరయ్య శంకరయ్య గ్రూపు, జాబ్‌కార్డు నెం. 10443 మరియు మల్లాపూర్ గ్రామ పంచాయితీ నుండి వడ్లకొండ ముత్తయ్య, సునిత గ్రూపు, జాబ్ కార్డు నుం. 10407 మాట్లాడుతూ, ఈ స్వాగత సత్కారాలు మా కుటుంబాలకు చాలా ఆనందాన్నిచ్చాయని సంతోషాన్ని వ్యక్తపరిచారు.

**ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనటువంటి పథకాలతో వికలాంగుల సంక్షేమాన్ని అమలు చేస్తున్నది. అర్హులైన వికలాంగులందరికి ఆసరా పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నది. నెలకు 1500 రూపాయల ఆసరాను అందిస్తూ వారి వికాసానికి తోడ్పాటునందిస్తున్నది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 4,38,526 మంది వికలాంగులు లబ్ధిపొందుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది.**

గంగధర గ్రామపంచాయతీ గౌరవ సర్పంచ్ వైద రామానుజం మాట్లాడుతూ కరువులాంటి విపత్కర పరిస్థితుల్లో గ్రామీణ కదు పేదరిక బదుగు, బలహీన వర్గాలకు రెండు పుటలా భోజనం పెట్టి అక్కున చేర్చుకొని, ఇముడ్చుకునే శక్తి ఈ కార్యక్రమానికి ఉందన్నారు. ప్రపంచ బ్యాంక్ ఈ పథకం అమలు తీరుకు జై జై లు పలుకుతున్న సందర్భంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజానీకంలో మరెన్నో ఆశలు రేకెత్తిస్తుంది.

ఈ పథకము అమలులో ఒక ఆర్థిక కొలమానమే కాకుండా మానవీయ కోణంలో, సామాజిక భద్రత, ఆర్థిక స్వావలంబన దృష్ట్యా చూసినపుడు మాత్రమే పథక లక్ష్యాలు నెరవేరుతుంటాయి, రాబోయే కాలంలో మరిన్ని ప్రోగ్రాంలను అనుసంధానం చేసి, ఆర్థిక పరిపుష్టికి, సుస్థిర ఆస్తుల పెంపుదలకు గ్రామీణాభివృద్ధి శాఖ దోహదపడాలి.

కె. కృష్ణమూర్తి ప్రోగ్రామ్ మేనేజర్ వికలాంగుల శ్రమ శక్తి సంఘాలు, హైదరాబాద్ గారి సూచనల, సలహాలతో ఎక్కువ కుటుంబాలకు పనులు కల్పించి, తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానం ఉండే విధంగా కృషి చేద్దాం.

***– శ్రీనివాస్ దుర్గం,*** *అదనపు ప్రాజెక్టు అధికారి,*
*ఎం.జి.ఎన్.ఆర్.ఇ.ఓ.ఎస్, కరీంనగర్*

# గ్రామపంచాయతీలో ఇంటిపన్నులో మినహాయింపు పద్ధతి

**పట్టణాలలో పనుల కోసం గాని తమ పిల్లల విద్యాభ్యాసం కోసం కాని గ్రామాలలో గల తమ ఇండ్లను ఖాళీగా వదలి పట్టణాలకు వలస వెళ్తుంటారు. కొంతమంది సంవత్సరాల తరబడి తమ స్వగ్రామాలకు రాని వారు చాలా మంది ఉంటారు. మరికొంత మంది పండుగలకో, పబ్బాల కో తమ సొంత ఇంటిలో చేసుకోవాలని తమ గ్రామాలకు వస్తుంటారు.**

అలా వలస వెళ్ళిన వారికి గ్రామాలలో గల తమకు చెందిన నివాస గృహాలకు సంబంధించి గ్రామపంచాయతీకి తాము చెల్లించవలసిన ఇంటి పన్ను గురించి చట్టంలో మంచి వెసులుబాటు కలదు. ఈ వెసులుబాటు గురించి తెలియని పంచాయతీ కార్యదర్శులు గాని, పంచాయతీ సిబ్బందిగానీ పంచాయతీలకు రావలసిన ఇంటిపన్ను డిమాండు రిజిష్టర్లలో వారి పేరున డిమాండు వేసి, పట్టణాలకు వెళ్ళిన వారికి డిమాండు నోటీసులను ఇవ్వడానికి వారు సమయానికి అందుబాటులో లేకపోవడం వలన వారికి డిమాండు నోటీసులను ఇవ్వలేక తద్వారా వారు ఇంటి పన్ను చెల్లించక పోవడం మూలాన పంచాయతీలలో ఇంటిపన్ను బకాయిలు ఈ రకంగా కూడా పేరుకుపోవడం చాలా అరుదు.

గ్రామాలలో ఉన్న తమ ఇంటిపన్ను గురించి సరైన సమాచారం పట్టణాలలో ఉన్న వారికి తెలియక వారు సకాలంలో ఇంటిపన్ను చెల్లించలేక, వారికి పంచాయతీ నుండి ఏదేని ధృవీకరణ పత్రం అవసరమనుకున్నప్పుడు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించగా వారు పేరుకుపోయిన బకాయిలను చెల్లిస్తేనే తప్ప పంచాయతీ వారు ధృవీకరణ పత్రము ఇవ్వలేమని తెల్పినప్పుడు పన్ను చెల్లించడం తమకు కూడా చాలా భారమనిపిస్తుంది. ఈ సమస్యలను దూరం చేయడానికి పంచాయతీరాజ్ చట్టంలో అవకాశం కలదు. దానినే 'వేకెన్సీ రెమిషన్' అని అంటారు. ఈ రాయితీని ఎలా ఉపయోగించుకోవాలో చూద్దాం.

ప్రభుత్వ ఉత్తర్వు నెం.282, పంచాయతీరాజ్ శాఖ, తేదీ: 12-03-1965 ద్వారా జారీ చేయబడిన ఇంటిపన్ను విధింపు నియమాలలోని నియమం 10(1) ప్రకారం ఒక ఆర్థిక సంవత్సరంలో వరుసగా 120 రోజులు గాని అంతకంటే ఎక్కువ రోజులు గాని ఆ ఇల్లు ఖాళీగా ఉంటే, దానికి విధించబడిన పన్నులో సగాని కంటే ఎక్కువగా గాకుండా రాయితీ (మినహాయింపు) పొందవచ్చును. ఒక వేళ ఆ ఆర్థిక సంవత్సరంలో ఇంటి యజమాని ముందుగానే పన్ను చెల్లించియున్న యెడల, చెల్లించిన దానిలో కూడా సగానికంటే ఎక్కువగాకుండా మినహాయింపును ఇంటి యజమాని కోరవచ్చును.

ఉపనియమం (1) ప్రకారం మినహాయింపును కోరేవారు ఆ సంవత్సరంలో మాత్రమే దరఖాస్తు చేయాలి. సంవత్సరం ముగిసిన తరువాత చేసే దరఖాస్తులను అంగీకరించరు. ఉపనియమం (3) ఏ ప్రకారం యజమానిగాని అతని ఏజెంటు గాని, తమ ఇల్లును ఖాళీగా ఉంచబోతున్నట్లు ముందుగానే పంచాయతీ కార్యాలయానికి లిఖితపూర్వకంగా తెలిపినచో, అలా తెలియజేసిన తేదీ నుండి మినహాయింపు కొరకు లెక్కలోకి తీసుకుంటారు.

అలా ఇవ్వబడిన ప్రతి లేఖ లేక నోటీసు ఏ సంవత్సరములో అయితే కార్యాలయమునకు అందజేయబడినదో ఆ సంవత్సరానికి మాత్రమే పనిచేస్తుంది. తదుపరి సంవత్సరానికి పనిచేయదు. కావున ఇంటి యజమాని తాను నిజంగా ఖాళీ ఉంచబోతున్న ఇంటి వివరాలు మరియు ఎప్పటినుండి ఖాళీగా ఉంచుతున్నట్లు ప్రతి సంవత్సరం పంచాయతీ కార్యాలయానికి తప్పకుండా తెలియజేయాలి. అప్పుడే అతను ఇంటిపన్ను నుండి మినహాయింపును పొందగలడు. లేనిచో అతని పేరున మొత్తం ఇంటిపన్నును బకాయిగా చూపించి తదుపరి సంవత్సరము మొత్తం పంచాయతీవారు డిమాండు చేయటానికి అవకాశం కలదు.

అలాగే ప్రతి పంచాయతీలో కూడా కార్యదర్శి ప్రతి సంవత్సరము ఆ పంచాయతీ పరిధిలో ఎన్ని ఇండ్లు ఖాళీగా ఉన్నాయి అని ఒకసారి పరిశీలన చేసి ఆ ఇండ్ల యజమానులను సంప్రందించి ఈ నియమం ప్రకారం వారి నుండి దరఖాస్తులను సేకరించి వారికి చట్ట ప్రకారం తగినంత మినహాయింపు ఇవ్వడం ద్వారా పంచాయతీలో వసూలు కాని బకాయిలు పేరుకుపోకుండా ఏ సంవత్సరానికి సంబంధించినవి ఆ సంవత్సర&లోనే వారికి మినహాయింపు ఇవ్వటం ద్వారా మిగతా పన్నును వారి నుండి వసూలు చేయడం వలన బకాయిలు పేరుకుపోకుండా చూసి పంచాయతీల ఆర్థికాభివృద్ధికి పాటుపడిన వారు కాగలరు.

*– ఎస్. శంకరయ్య, ఫ్యాకల్టీ, టి.సిపార్డ్*

# మహిళల కోసం మరుగుదొడ్లపై ముంతాజ్ షేక్ ఉద్యమం

**ఆ మహిళ పేరు ముంతాజ్ షేక్. శానిటేషన్ యాక్టివిస్టు. ముంబయిలో మహిళలకు ఉచితంగా టాయిలెట్ సౌకర్యం ఏర్పాటు చేయడంలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆమె కృషిని గుర్తించి వందమంది ప్రముఖ మహిళల్లో ఒకరిగా ముంతాజ్‌ను బిబిసి గుర్తించింది. స్త్రీలకున్న 'రైట్ టు పీ' అంశంపై ముంతాజ్ దీర్ఘకాలంగా పోరాడుతున్నారు.**

ముంతాజ్ షేక్ ముంబయి వాసి. బిబిసి గుర్తించిన వందమంది ప్రముఖ మహిళల జాబితాలో పేరు కూడా ఉంది. శానిటేషన్ యాక్టివిస్టు అయిన ముంతాజ్ తనకు లభించిన గౌరవం వ్యక్తిగతం కాదని సాధించిన విజయమని అభిప్రాయపడ్డారు. పబ్లిక్ టాయ్‌లెట్లలో మూత్ర విసర్జన .. స్త్రీలకున్న హక్కును ముంతాజ్ 'రైటు టు పీ' ద్వారా లేవనెత్తారు. ఆడవాళ్లకు పబ్లిక్ టాయ్‌లెట్ల అవసరాన్ని నొక్కిచెప్పారు.

### ఆడవాళ్లకు ఉచితంగా...

రైట్ టు పీ నెట్‌వర్క్ ద్వారా దీర్ఘకాలంగా ఈ హక్కు కోసం ఫైర్‌బ్రాండ్ ముంతాజ్ పోరాడుతున్నారు. ముంబయి నగరంలోని పబ్లిక్ టాయ్‌లెట్‌లలో ఈ హక్కును ఆడవాళ్లు ఉచితంగా వినియోగించుకోగలగాలన్నారు. ఆమె చేసిన పోరాటం. కృషి ఫలితంగా ముంబయి నగరంలో ఆడవాళ్ల కోసం 96 టాయ్‌లెట్లు నిర్మించారు. వీటిని మహిళలు ఉచితంగా వినియోగించుకోవచ్చు. అంతేకాదు ప్రభుత్వం 50 మిలియన్ రూపాయలను కేవలం 'ఫీమేల్ ఓన్లీ యూరినల్స్' కట్టడానికి కేటాయించింది కూడా. బిబిసి తమ పోరాటాన్ని గుర్తించినందుకు ముంతాజ్ ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు బిబిసి గుర్తింపు తమకెంతగానో సహాయపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. తాము చేపట్టిన రైట్ టు పీ ప్రచారం ముంబాయికే పరిమితం కాదని విదర్భ, సాంగ్లి వంటి ప్రాంతాలకు కూడా దీన్ని విస్తరించనున్నామని తెలిపారు. ఈ ప్రచారం ఇతర రాష్ట్రాలవారిపై కూడా ప్రభావం చూపడం మరో విశేషం. ఈ సమస్యకు దిశ నిర్దేశం ఇవ్వడంతోపాటు అన్ని వర్గాలతో కలిసికట్టుగా పనిచేయాలని భావిస్తున్నట్లు ముంతాజ్ చెప్పారు. ఇటీవల ముంతాజ్ మరో ప్రచారానికి కూడా నాంది పలికారు. అదే రైట్ టు సిటీ. ప్రతి మహిళకు నగరంలో తనదైన స్పేస్ ఉండాలని, వారికి తగిన గౌరవం, రక్షణ ఉండాలని తెలియజెప్పడమే ఈ ప్రచార ఉద్దేశం. తొందరలోనే ఈ ప్రచారాన్ని కూడా దేశమంతా చేపడుతున్నట్టు ఆమె తెలిపారు.

రైట్ టు పీ ప్రచారాన్ని మొదలెట్టినపుడు తనను చూసి ఎందరో నవ్వారని ముంతాజ్ గుర్తుచేసుకున్నారు. "2011, మే 5న ఈ ప్రచారానికి మేం శ్రీకారం చుట్టాం. మా ప్రచారాంశం విన్న కొందరు ముఖ్యంగా మగవాళ్లు నవ్వారు. మమ్మల్ని చూసి ఎగతాళి చేశారు. అయితే మేం విషయాన్ని వారికి వివరించడం మొదలెట్టిన తర్వాత వారంతా మాకు మద్దతు తెలిపారు. అండగా నిలబడ్డారు. ఈ అంశం ప్రాధాన్యాన్ని గ్రహించారు. అప్పటినుంచి మగవాళ్లు కూడా మాకు మద్దతు తెలపడంతోబాటు మేం నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలో కూడా పాల్గొనడం ప్రారంభించారు' అని ముంతాజ్ చెప్పారు. తమ విజయం గురించి ఆనందం వ్యక్తంచేస్తూ ఇది ప్రారంభమేనని సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందని అన్నారు.




### చేతల్లో చూపాలి

ఆడవాళ్లు ఇప్పటికీ రైల్వే స్టేషన్లు, పలు పబ్లిక్ ప్లేసుల్లో డబ్బులు చెల్లించి టాయ్‌లెట్లు వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉంటోందని ముంతాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధోరణి పూర్తిగా పోవాలన్నారు. 'బ్రిహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఈ దిశగా ఒక సర్క్యులర్‌ని కూడా జారీ చేసింది. బడ్జెట్‌లో ఇందుకోసం విడిగా ఒక ప్రొవిజన్‌ను కేటాయించింది.

గత నాలుగు సంవత్సరాలుగా మొత్తం 32 స్వచ్ఛంద సంస్థలు స్త్రీలకు ఉచిత యూరినల్ ఫెసిలిటీస్ కల్పించాలంటూ పోరాటం సాగిస్తున్నాయి. చాలా పబ్లిక్ టాయిలెట్లలో ఈ సౌకర్యం మగవాళ్లకు ఉచితంగా లభిస్తోంది కానీ స్త్రీలు మాత్రం డబ్బులు చెల్లించి తమ అవసరం తీర్చుకోవాల్సి వస్తోంది. అంతేకాదు సిటీలో పబ్లిక్ టాయిలెట్ల కొరత కూడా తీవ్రంగానే ఉంది. స్త్రీల పబ్లిక్ టాయ్‌లెట్ల సంఖ్య పెంచాలని కూడా ఈ పోరాటం చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి' అని ముంతాజ్ చెప్పారు.

ఈ సమస్యపై ప్రభుత్వం ఇప్పుడిప్పుడే సీరియస్‌గా స్పందిస్తోందన్నారు. మగవాళ్లకు ఈ సౌకర్యం ఉచితంగా ఇస్తూ ఆడవారి నుంచి డబ్బులు వసూలు చేయడం ఎంత వరకు సబబని ముంతాజ్ ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రస్తుతం తమకు మాట మాత్రమే ఇచ్చిందని చేతల్లో పని ఇంకా మొదలెట్టాలని ముంతాజ్ అన్నారు.

'ఈ పోరాటంలో బయటవారితో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు అందిస్తున్న అండదండలు ఎంతో రాజకీయ మార్గం ద్వారానే నా లక్ష్యం సాధించాలనుకుంటున్నాను. ప్రజల అవసరాలను తీర్చడానికే రాజకీయంలో సైతం ప్రవేశించాలనకుంటున్నాను' అని ముంతాజ్ చెప్పారు.

*(మీడియా రిపోర్టు)*

**దేశాభివృద్ధిలో మానవవనరుల పాత్ర వెలకట్టలేనిది. మానవవనరులు ఎంత నైపుణ్యవంతముగా అభివృద్ధి చెందితే అంతే శీఘ్రగతిన అభివృద్ధికి బంగారు బాటలు పడతాయి. కానీ దేశంలో నైపుణ్యవంతమైన వనరుల కొరత వేధిస్తున్నది. ప్రభుత్వాలు విద్య పట్ల అనుసరిస్తున్న శ్రద్ధతో పాటు, నైపుణ్య వనరుల తయారీపై అంతగా దృష్టి పెట్టకపోవడంతో నైపుణ్యం కొరతగా మారింది.**

2011 లెక్కల ప్రకారం దేశజనాభా 121.02 కోట్లు. అందులో సుమారు 64 శాతం జనాభా ఉత్పాదక సామర్థ్యం గల వారు కావడం విశేషం. అధికమొత్తంలో ఉన్న ఉత్పాదక వనరులకు పని చూపడంతోపాటు, తగిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించ వలసిన అవసరం ప్రభుత్వాలపైన ఉంటుంది.

అన్ని దేశాల ఉత్పాదక జనాభా తగ్గుముఖం పడుతుండగా మనదేశంలో మాత్రం పెరుగుతూ ఉండటం ఆర్థికవృద్ధికి శుభ సూచకం. కాగా వారందరినీ ఏ రకంగా ఉత్పాదక కార్యకలాపాలలో పాలుపంచుకొనేలా సద్వినియోగం చేసుకుంటామనే దానిపైననే దేశ అభివృద్ధి ఆధారపడి ఉన్నది. దేశంలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న యువతీ, యువకులు 470 మిలియన్ల మంది ఉన్నారు.

2014 ఆర్థికసర్వే ప్రకారం ప్రతి సంవత్సరం మనదేశంలో పనిచేసే వయస్సు గలవారు 63 మిలియన్ల మంది కొత్తగా చేరుతున్నారు. ఇలా పెరుగుతున్న ఉత్పాదక సామర్థ్యం గల మానవవనరులను ఆర్థిక పురోగతి వనరులుగా మలచడం పైననే ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.

దేశ జనాభాలో ఉత్పాదక సామర్థ్యం గల 15-60 సంవత్సరాల మధ్యగల వయసు వారు అధికంగా ఉన్నారు. తాజా గణాంకాల ప్రకారం 2040 నాటికి మనదేశ కార్మికుల సంఖ్య చైనా దేశ కార్మికశక్తిని దాటిపోతుందని అంచనా. అది గమనించిన చైనా ప్రభుత్వం ఇటీవల ఒక్కరు లేదా అసలే వద్దు అనే జనాభా నియంత్రణ విధానానికి స్వస్తి పలికింది.

# నైపుణ్యాభివృద్ధితో కుశల భారత్

ఉత్పాదక వనరులు విరివిగా లభ్యమవుతున్నా సరైన నైపుణ్యం గలవారు లేక కొట్టుమిట్టాడుతున్నది. మన దేశ కార్మికశక్తిలో నైపుణ్యం గలవారు రెండు శాతం మాత్రమే ఉన్నారని లేబర్ బ్యూరో నివేదిక-2014 తెలుపుతున్నది. ఇంతటి తీవ్రస్థాయిలో నైపుణ్యలేమి ఉంటే ఏటేటా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే సామాజిక అశాంతి పెరిగే ప్రమాదం పొంచి ఉంటుంది.

జాతీయ ఆర్థిక గణాంకాల అంచనాల నూతన విధానం ప్రకారం దేశ ఆర్థిక వృద్ధిరేటు ఏడు శాతంతో చైనా ఆర్థికవృద్ధి రేటును దాటి ముందుకుపోతున్నది. భారతీయ రిజర్వుబ్యాంకు వార్షిక నివేదిక 2014-15 ప్రకారం స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో వృద్ధి రేటు 7.6గా నమోదయింది. ఇలా వృద్ధిరేటు పెరుగుతున్నా.. జనాభాకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు మందగిస్తున్నాయి. దానికి తోడు తగిన సామర్థ్యంగల వారిని తయారుచేయడంలో విద్యావిధానాలు దోహదపడటం లేదు.

2022 నాటికి ప్రపంచ కార్మికశక్తిలో 15 నుంచి 17 శాతం మంది భారతీయ కార్మికులే ఉంటారని అంచనా. కానీ ఇంతగా కార్మికలోకం అధికంగా ఉన్నా ప్రస్తుతం నైపుణ్యంలేక మెరుగైన ఉద్యోగ భద్రత, జీవన విధానాన్ని అందిపుచ్చుకోలేకపోతున్నారు. దేశ అవసరాలకు సరిపడా మానవవనరులు లభ్యమవుతున్నా సువర్ణావకాశాలను అందుకోలేక అంధకారంలోనే మగ్గుతున్నారు.

500 మిలియన్లు గల ప్రస్తుత కార్మికశక్తిలో 14 శాతం మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నారు. మిగతా 86శాతం అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. అసంఘటిత రంగ కార్మికులకు తగిన అవకాశాలు కల్పించి, మేలిమి వనరులుగా తయారుచేయడం

పైననే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉన్నది. లేకపోతే అనేక సమస్యలు తలెత్తుతాయి.

దేశంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల పట్ల సంఘటిత రంగం కుచించుకుపోయి, అసంఘటిత రంగం దినదినవర్ధమానంగా వర్ధిలుతున్నది. కానీ అసంఘటితరంగ కార్మికుల పట్ల ప్రభుత్వం చేపట్టే చర్యలు పురోగతిని సాధించడం లేదు. వారి పట్ల ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవశ్యకతను నొక్కి చెపుతున్నది.

మెకెన్సీ నివేదిక ప్రకారం 54 శాతం మంది యువత మాత్రమే ఉన్నత చదువులతోనే ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని భావిస్తున్నారు. అంటే ఇంకా 46 శాతం మంది ఉన్నత చదువులేక ఉపాధి అవకాశాలను అందుకోవడంలో వెనుకబడ్డారని తెలుస్తున్నది. 65 శాతం మంది ఉన్నతవిద్యకు మధ్యలోనే స్వస్తి పలికి ఉసూరుమనిపిస్తున్నారు. ఇలా చదువులమ్మ ఒడిని చేరలేక ఒక అడుగుముందుకి రెండడుగులు వెనక్కి అన్న తరహాలో దిగజారి పోతున్నారు.

ఉపాధి, శిక్షణ అవకాశాలను కూడా సక్రమంగా వినియోగించుకోలేక సతమతమవుతున్నారు. ఉపాధి కల్పించే యాజమన్యాలలోనూ సైతం 53శాతం మంది నైపుణ్యం గల కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఇంతగా నైపుణ్యంగల కార్మికుల కొరతను దేశం ఎదుర్కొంటున్నది. దీనికి తోడు కాస్తో, కూస్తో నైపుణ్యంగల వారు తమ ఉద్యోగ, ఉపాధి, ఆదాయ అవకాశాలను మెరుగుపరుచుకోవటానికి విదేశాలకు తరలిపోతున్నారు. మేలిమివనరులు విదేశాలకు తరలిపోయి స్వదేశానికి నిరుపయోగంగా మారుతున్నాయి.

మేధోవలస వల్ల అధికంగా ఉన్నటువంటి మానవవనరుల ను నైపుణ్యంవంతంగా తయారుచేయడం కోసం విదేశీయుల ను ఆకర్షించాల్సి వస్తున్నది. విదేశీయులు దేశం పట్ల ఆకర్షితుల వుతున్నా తమ వ్యాపార, ఆర్థిక, పారిశ్రామిక ప్రయోజనాలు నెరవేర్చుకోవడంపైననే వారి విధానాలు ఆధారపడి ఉంటాయి.

దేశంలో శాస్త్రీయ అవగాహన కావలసినంతగా లేదు. పరిశోధనలు పెరుగుతున్నాయి. కానీ ఆ పరిశోధనలు దేశ జనాబా అవసరాలకు అనుగుణంగా, వారి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు దేశ ఆర్థిక విధానంలోనూ, వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలకు ఉపయోగపడే ఉండాలి.

కానీ మన పరిశోధనలు అంతర్జాతీయ ఖ్యాతిని గడించలేక చతికిలపడిపోతున్నాయి. దాన్ని వేగవంతం చేయాలి. దేశంలో ఐటీ, దాని అనుబంధ సంస్థల అవసరానికి 2015 సంవత్సరానికి గాను సుమారు 23 లక్షల మంది నిపుణుల అవసరం ఉన్నది. కానీ నేటికీ దేశంలో 16 లక్షల మంది ఐటీ నిపుణులను మాత్రమే ఉన్నారని అంచనా. అంటే ఇంకా ఏడు లక్షల మంది తయారయ్యే నాటికి ఇంకా వారి అవసరం పెరుగుతుంది తప్ప, తగ్గే అవకాశం లేదు.

నాస్కామ్ అంచనా ప్రకారం ప్రతీ సంవత్సరం సుమారు 30 లక్షల మంది డిగ్రీ, పి.జీలు పూర్తిచేసి మానవ వనరుల ంగా మారుతున్నారు. వారిలో 25 శాతం మంది మాత్రమే వృత్తి నైపుణ్యం కలిగి ఉంటున్నారు. మరో 10-15 శాతం మంది ప్రస్తుత పారిశ్రామిక వర్గ ఉద్యోగ అవసరాలకు ఉపయోగపడుతున్నారు. అంతేతప్ప మిగతావారికి ఎలాంటి నైపుణ్యంలేక దేశ ఆర్థికవ్యవస్థకు అవరోధంగా మారుతున్నారు.

ఇలా నైపుణ్యం గలవారి కొరతను గుర్తించిన ప్రభుత్వం 2022 నాటికి 40 కోట్ల మంది యువతకు నైపుణ్యవంతమైన శిక్షణను ఇప్పించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించి నైపుణ్య భారత్‌ను తయారీ చేయడానికి పూనుకొన్నది. స్విట్జర్లాండ్ తరహాలో నైపుణ్య శిక్షణా కేంద్రాలను భారత్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా వృత్తి విద్యావకాశాలను మెరుగుపరచాలి.

మన విద్యలో ప్రస్తుతం అవలంభిస్తున్న విధానాలు వృత్తి నైపుణ్యం కలవారుగా తయారు చేయడంలేదు. వృత్తినిపుణులను వృద్ధిచేసే విద్యా విధానాన్ని రూపొందించాలి. పలు సంస్కరణలతో ముందుకు వెళితేనే పెరుగుతున్న మానవవనరులను సద్వినియోగం చేసుకొని దేశ ఆర్థికాభివృద్ధిని పెంపొందించవచ్చు. లేకపోతే మానవ వనరులు దుర్వినియోగమై అశాంతి, అస్థిరత నెలకొనే ప్రమాదం పొంచి ఉంటుంది. కౌశలము అభివృద్ధి చేస్తేనే కుశల భారతం సాకారమవుతుంది.

*(మీడియా రిపోర్టు)*

◆

**ప్రతిరోజు పొద్దున ఏ దినపత్రిక తిరగేసినా ఏదో ఒక హత్య లేదా ఆత్మహత్యల వార్తలు కనిపిస్తున్నాయి. అనేక రకాలైన దౌర్జన్యాలు, దుర్మార్గపు సంఘటనలు తరచూ దర్శనమిస్తున్నాయి. అప్పుడే పుట్టిన చిన్నారిని కూడా కుప్పతొట్టిలో అమానుషంగా పడవేయడం అప్పుడప్పుడు చూస్తూనే ఉన్నాం. కొన్ని రూపాయల కోసం ఎదుటి వ్యక్తిని నిర్ధాక్షిణ్యంగా అంతం చేసే రాక్షసత్వం ఎందుకు వస్తుంది? మనిషి ఎదుటివ్యక్తిపట్ల ఎందుకు అపనమ్మకంతో ఉన్నాడు? మనిషిలో పగ, ద్వేషం, ఈర్ష్య, అహంభావం, ఎదుటివారిపట్ల చులకన భావం ఎందుకు పెరుగుతున్నాయి? ప్రేమ, శాంతి, వాత్సల్యం, మానవత్వం ఎందుకు కానరావడం లేదు? ఎందుకు స్వార్థచింతన పెరిగింది?**

రోడ్డుపక్కన ఒక వ్యక్తి ప్రమాదానికి లోనై ప్రాణాపాయ స్థితిలో ఉంటే చూసీ చూడనట్టు పక్కకు తప్పుకొని మాకెందుకులే అని వెళ్లిపోతున్నారు. ఒకవేళ సహాయం కోసం వస్తే వారి బంధువులు సహాయం చేసిన వ్యక్తిని ఎందుకు అనుమానంగా చూస్తున్నారు? కళ్ల ఎదుటే నేరాలు జరుగుతున్నప్పుడు ఎందుకు ఎదిరించలేక పారిపోతున్నారు? అవినీతి, దౌర్జన్యాలకు ఎందు దాసోహమవుతున్నారు?

# తగ్గుతున్న మానవ సంబంధాలు

కేవలం సమాజంలోనే కాదు కుటుంబ సభ్యుల మధ్య కూడా మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి. భార్యభర్తల మధ్య కూడా అపనమ్మకాలు, అపర్థాలు ఒకవైపు, వివాహేతర సంబంధాలు మరోవైపు పెరుగుతున్నాయి. ఇలాంటి అనుభవాలు మనకు తరచూ ఎదురవుతున్నాయి.

ఒక మనిషిలో మరో దుర్మార్గపు మనిషి దాగి ఉన్నాడా? అవసరమైనప్పుడు ఈ అపరిచితుడు బయటకు వస్తున్నాడా? తప్పులు చేస్తూ కూడా తలెత్తుకొని గర్వంగా ఎలా తిరగగలుగుతున్నాడు? మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయా అన్న అనుమానం తలెత్తుంది. అసలు ఇలాంటి ఘటనల వెనుక వాస్తవాలు ఏమిటి? ప్రపంచీకరణ విధానాలు విస్తృతమవుతున్న కొలదీ మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయా? ఇటీవల మతపరమైన విద్వేషాలు, వైషమ్యాలు ఎక్కువగా జరుగుతుండడం కూడా ఆందోళన కలిగించే అంశం.

మృగ్యమవుతున్న మానవ సంబంధాల పరిస్థితులలో భారతదేశ సమగ్రతకు దేశభక్తికి, దిశా, నిర్దేశం ఎవరు చూపించగలరు? వీటన్నిటికి సమాధానాలు పరిష్కారాలను చూపించగలదు. భారతదేశానికి వివిధ దేశాలతో పోలిస్తే ఒక విశిష్టమైన ప్రత్యేకత ఉంది. వివిధ మతాలు, వర్గాలు, భాషలు వివిధ ప్రాంతాలతో, భౌగోళిక స్వరూపాలతో కూడి ఉండడం తెలిసిందే. ఈ విశిష్టతను సరైన విధంగా అర్థం చేసుకోక మతపరమైన, వర్గపరమైన ప్రాంతీయపరమైన సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఇటువంటి సమస్యలకు పరిష్కారాలు కేవలం ఏ ఒక్క మతమో, వర్గమో లేదా ప్రాంతమో చూపించలేదు.

అన్ని మతాలకు, వర్గాలకు, ప్రాంతాలకు కూడా సమానమైన బాధ్యతలు ఉన్నాయి. విశాల భారతదేశంలో దేశభక్తి, శాంతి, ప్రేమ, సమానత్వ భావనలు కేవలం వివిధ వర్గాలకు, మతాలకు ప్రాంతాలకు మాత్రమే ఉంటే సరిపోదు. అన్ని వర్గాలు, మతాలు, ప్రాంతాలు కలసికట్టుగా సమన్వయంతో ప్రేమగా మెలగగలిగిన నాడే శాంతి సౌభాగ్యాలతో భారతదేశం పరిఢవిల్లుతుంది. వీటి మధ్య విద్వేషాలు, స్వార్థాలు ఉంటే అది కేవలం కుహనా దేశభక్తి అని చెప్పకతప్పదు.

భారతదేశానికి కేవలం ఆర్థికంగా బలంగా కనిపించే విధానాలు మాత్రమే ప్రధానం కాదు. ఆర్థిక అసమానతలు దూరం చేస్తూ సమానత్వ ఆర్థిక వ్యవస్థతోపాటు ప్రేమ, శాంతి, మానవత్వంతో కూడిన విశాల భారత దేశమే ప్రధానమైనది. కేవలం దేవుని చూడగలిగే గొప్పదనం అన్ని మత గ్రంధాలలో ఉండడం స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలి. అందువల్ల అన్ని మతపెద్దలు తమవంతుగా పరిష్కారాలు చూపించాలి. తద్విరుద్ధంగా ప్రచారం చేసే ఏ హిందువుకాని, క్రైస్తవుడుకాని, ముస్లింకాని నిజమైన భక్తుడు కాజాలడు. అలాంటి వారు కేవలం కుహనా మత మౌఢ్యవిద్రోహులు మాత్రమే భారతదేశ సమగ్రతకు ముప్పువాటిల్లుతుందని గ్రహించాలి.

మతాలు, వర్గాలు, ప్రాంతాలకన్నా ముందుగా మనిషిలోనే పరివర్తన మొదలవ్వాలి. ఇలాంటి పరివర్తన విజ్ఞానం ద్వారానే వస్తుంది. సమగ్రమైన చదువువల్లనే ఇలాంటి విజ్ఞానం పెంపొందుతుంది. సామాజిక స్పృహ, శాంతి, ప్రేమ, సమానత్వ భావనలు కేవలం విజ్ఞానం వల్లనే సమకూరుతుంది. కేవలం డబ్బుసంపాదించే విధంగా నేటి వ్యవస్థ ఉంది. చదువును కేవలం డబ్బు సంపాదించే మార్గంగా ఉపాధి పొందడానికి మార్గంగా మాత్రమే భావించడం దురదృష్టకరం. ప్రాథమిక పాఠశాలల నుండి సమగ్రమైన నీతిశాస్త్రాలను కథల రూపంలో పొందుపరచాలి. ఉన్నత విద్యలోనూ నీతిపట్ల, ప్రాంతాలపట్ల మంచి అవగాహన కలిగి స్పష్టమైన ఆరోగ్యకరమైన జీవన విధానాలను, సంబంధాలను అలవరచుకుంటారు. అందువల్ల ప్రభుత్వాలు ఈ దిశగా విద్యావ్యవస్థను రూపొందించి భవిష్యత్తు తరాలకు అందించాలి.

*(వార్తంశాల సంకలనము నుండి)*

◆

# పిల్లల్లో సరైన దిశలో జిజ్ఞాస పెంచాలి

**ప్రతిదీ సాంకేతిక పరిజ్ఞానంతో సరిచేయవచ్చుననుకుంటే చాలా పొరబాటు. సంస్కారవంతమైన నడవడికకు శ్రీకారం చుట్టవలసింది తల్లిదండ్రులే. నేటి పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులిద్దరూ పిల్లలతో కలిసి ఒక పూట భోజనమైనా చేస్తున్నారా అన్నది మీమాంసగా మారుతోంది. పూర్వ కుటుంబాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు భోజన సమయంలో అందరూ కలిసి కూర్చుని ఎన్నో విషయాలు చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకునేవారు. ఇప్పుడు పిల్లలని బడికి పంపించాలన్నా, తీసుకురావాలన్నా ముఖ్యంగా నగరాల్లోనూ, పట్టణాల్లోనూ భద్రతలోపం తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు బడికి దిగబెట్టి తీసుకురావాల్సిన పరిస్థితి.**



మీ పిల్లలు మీ ద్వారా వచ్చారు కాని మీ నుంచి రాలేదు. వారు మీతో ఉన్నా, మీకే సొంతం కారు అన్నాడు. ప్రఖ్యాత ఇరాన్ కవి ఖలీల్‌జిబ్రాన్. ఈ మాటల్ని తలిదండ్రులూ, ఉపాధ్యాయులు అర్థం చేసుకుని గుర్తుపెట్టుకుంటే చాలా సమస్యలు తీరిపోతాయి. పిల్లల కోసం సమయాన్ని కేటాయించలేని తల్లిదండ్రులకు పిల్లలను కనే హక్కు లేదంటాడు చలం.

తల్లిదండ్రులు పిల్లల్ని ఎలా పెంచాలో వారికి ఎటువంటి ఆహారం ఇవ్వాలో తెలుసుకోవాలి. అన్నింటికంటే ముఖ్యం తల్లిదండ్రులు బిడ్డలకు సమయం కేటాయించాలి. పిల్లలతో కలిసి ఉండాలి. వారిని శ్రద్ధగా గమనించాలి. వారి అవసరాలను తెలుసుకోవాలి. పిల్లల్లో సహజంగా ఉండే ప్రశ్నించేతత్వాన్ని ప్రోత్సహించాలి. ప్రతీ ప్రశ్నకు సరైన శాస్త్రీయమైన సమాధానాన్ని చెప్పాలి.

పిల్లల ఆసక్తిని అంతర్గత శక్తులను గమనించాలి. వారి సహజశక్తులను గుర్తించి ప్రోత్సహించాలి. పెద్దల ఇష్టాయిష్టాల ప్రకారం కాకుండా పిల్లల అభిరుచి మేరకు ఆస్తికి మేరకు, సహజ నైపుణ్యం మేరకు వారిని ఎదగనివ్వాలి. పిల్లలకు కలిగే భయాలను పోగొట్టాలి. మూఢనమ్మకాలకు దూరంగా ఉంచి ప్రతీ విషయాన్ని తార్కికంగా ఆలోచించే తత్వాన్ని వాస్తవాన్ని తెలుసుకొనేటట్లు సత్యానికి కట్టుబడి ఉండేటట్లు ప్రోత్సహించాలి.

ఆడుతూ పాడుతూ ఆనందంగా చదువుకోవాల్సిన పిల్లలకు చదువంటే భయం కలిగేలా వ్యవహరిస్తున్నాం. పిల్లలకు పాఠశాలే ప్రపంచం. పరీక్షల పేరుతో, ర్యాంకుల పేరుతో పిల్లలపై మానసిక ఒత్తిడి తెస్తున్నాం. పాఠాలు బట్టీపట్టడం తప్పితే, ఆ పాఠాల్లో ఏముంది, వాటివల్ల తాము తెలుసుకునేదేమిటని ఆలోచించుకొనే అవకాశం పిల్లలకు ఇవ్వడం లేదు.

పిల్లల్ని ఇష్టంగాకాక, కష్టంగా చదువుకోమని శాసిస్తున్నాం. పిల్లవాడికి చదువులో రుచి, అభిరుచి ఉండాలి. అభిరుచికి వ్యతిరేక అంశాల్ని చదివిస్తే ఇష్టంలేని పనిచేయించడమే అవుతుంది.

పిల్లవాడి పరిసరాలను, స్థానిక పరిస్థితులను, సమాజ ప్రభావాన్ని విస్మరించడం వల్ల చాలామంది పిల్లలు కృత్రిమ విద్యకు అల వాటుపడి ప్రమాదకరంగా తయారవుతున్నారు. జన్యుపరమైన సమర్థత, విద్యావంతులైన తల్లిదండ్రులు, మంచిపాలన, పోషణ, సమర్థులైన ఉపాధ్యాయులను కలిగి ఉన్న పిల్లలు చదువుల్లో బాగా రాణించడమే కాకుండా మంచి ఉద్యోగాలు కూడా పొంద గలుగుతున్నారు.

పిల్లల్ని మనతో సమానమైన విలువనిచ్చే వాతావరణాన్ని ఎంతవరకు పెంపొందిస్తున్నాం? క్రమశిక్షణ పేరుతో వారి స్వేచ్ఛను ఏ మేరకు హరిస్తున్నాం? వారి బాల్యాన్ని ఎలా కుంగదీస్తున్నాం? ఈ విషయాలపై ఆత్మావలోకనం చేసుకోవాలి.

మీడియాల వల్ల పిల్లలు యాంత్రికంగా మారుతున్నారు. పిల్లలపై సృజనాత్మకతపై ప్రభావం చూపుతుంది. వినోదంలో మానసిక శ్రమ తప్ప శారీరక వ్యాయామం ఉండటం లేదు. హైటెక్ సదుపాయాలు అనేక ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చాయి.

వినోద విజ్ఞానం మేళవింపుగా భావిస్తున్న టివి గేమ్స్, కంప్యూటర్స్ గేమ్స్ వాటితో పాటు కేబుల్ కనెక్షన్ ద్వారా పల్లెటూళ్లకు సైతం అందుబాటులో ఉంటున్న టివిఛానళ్లు బాల్యంపై పట్టు బిగించాయి. ఆధునిక వినోద సాధనాల వల్ల శారీరక శ్రమ చెయ్యకుండా కేవలం రిమోట్‌నో, మౌస్‌నో ఆపరేటు చేస్తూ ఆనందం పొందడానికి బాలలు



పరిమితమవుతున్నారు. తెరమీద సచిన్ టెండూల్కర్ సిక్సర్ కొడితే చప్పట్లు కొట్టే వాళ్లే తప్ప, క్రికెట్ బ్యాట్ పట్టుకొని మైదానంలో ఆడేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. స్కూలు నుంచి రాగానే కాసేపు ఆడుకోనివ్వండి.

ఆ తర్వాత హోంవర్క్‌కు కొంత సమయాన్ని కేటాయించండి. పిల్లలు వారంతట వారే చదువుకునేలా ప్రోత్సహించండి. స్నేహితులుగా ఈ విషయంలో తల్లిదండ్రులు వ్యవహరించాలి. అన్నింటినీ పిల్లలే తెలుసుకొని సమస్యలను పరిష్కరించుకునేలా చూడాలి.

పిల్లలు ఏ మంచి పనిచేసినా ప్రోత్సహించండి. ఒక్క సబ్జెక్టులో తక్కువ మార్కులు వస్తే తిట్టడం మంచిది కాదు. పిల్లల్ని తిట్టడం, కొట్టడం వల్ల మంచి ఫలితాలు సాధించలేము. పిల్లల దృష్టికి వచ్చే విషయాలే వారి మనస్సులపై ముద్రలు కలిగిస్తాయి. కాబట్టి మనస్సులపై ఎటువంటి ముద్రలు కలుగుతున్నాయో గమనించాలి. అందుచేత టివిలో, కంప్యూటర్‌లలో, ఇంటర్‌నెట్‌లో, సినిమాల్లో, పత్రికల్లో, పుస్తకాల్లో ఎటువంటి విషయాలను పిల్లలకు అందుబాటులో ఉంచుతున్నాము అని పిల్లలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతున్నాయో గమనించాలి.

పిల్లల పట్ల మీకున్న ఉద్వేగాలనూ స్పష్టంగా, నిదానంగా నెమ్మదిగా తెలియజేయండి. మీరు వాడుతున్న పదాలే మీరు పడుతున్న ఇబ్బందిని, సంతోషాన్ని తెలియచేసేవిగా ఉండాలి. గొంతు పెంచి మాట్లాడడం మొరటుగా వ్యవహరించడం వద్దు. మనిషికీ మనిషికీ అనుబంధాన్ని పెంచినా అగాధాన్ని పెంచినా మాటే అన్న విషయం మరిచిపోవద్దు పిల్లలు ఏదైనా పనిచేస్తే అభినందించండి. నువ్వు చాలా కష్టపడ్డావు. ఫలితం సాధించావు అంటూ చెప్పాలి. పాఠాల్నే ఆటలుగా మార్చుకుంటే బావుంటుంది కదా అని పిల్లలకు నచ్చజెప్పి, నిజానికి పాఠాలు కూడా ఆటల్లాంటివే. అక్కడ బాల్‌తో, బ్యాట్‌తో ఆడుకుంటాం.

ఇక్కడ అక్షరాలతో పదాలతో ఆడుకుందాం. అక్కడ మ్యాచ్‌ల ంటాయి. ఇక్కడ పరీక్షలుంటాయి. ఆటల్లో గెలుపుకోసం ప్రయత్నించినట్లు విద్యలో విజయం కోసం ప్రయత్నించాలి. పాఠ్యాంశాల్లోని అంశాలతో చిన్నచిన్న గేమ్స్ ప్లాన్ చేయండి. శారీరక వ్యాయామం అధికంగా ఉన్న పిల్లలు చదువులోనూ ముందుంటారు.

పిల్లల్లో అనవసర ఆలోచనలు రేకెత్తించే విధంగా మాట్లాడటం, ప్రవర్తించచడం మంచిది కాదని గుర్తించండి. తరచుగానూ అతిగానూ భిన్నమైన ప్రవర్తనా ధోరణులను కనబడినపుడు వీలైనంత సున్నితంగా వారిలో జరుగుతున్న శారీరక మానసిక మార్పుల గురించి, శారీరక ధర్మాల గురించి వారికి వివరించాలి. తల్లిదండ్రులు అప్యాయతానురాగాలతో మసలుకుంటూ పిల్లలకు ప్రేమని పంచిస్తే ఇతరుల గుర్తింపుకోసం పిల్లలు తహతహలాడే అవకాశాలు తక్కువ.

పిల్లల చేత చిన్నచిన్న కథల పుస్తకాలు చదివించి వాటిని గురించి వ్యాసం రాయించండి. డిక్షనరీ అట్లాస్ వంటివి అందుబాటులో ఉంచండి. వాటిని చూసేందుకు సహకరించండి. పిల్లలు ఆనందంగా గడిపిన క్షణాలను తోటివారితో పంచుకోవడానికి ప్రోత్సహించండి. దీనివల్ల సంభాషించే గుణం, వివరణాత్మక నైపుణ్యాలు వాళ్లతో పెరుగుతుంది. ఆట, పాట, చదువులకు సమ ప్రాధాన్యం ఇస్తే పిల్లల్లో చదువంటే భయం, ఒత్తిడి రెండూ ఉండవు.

పిల్లలు మనసులోని అభిప్రాయాన్ని చెప్పేందుకు పూర్తి అవకాశాల్ని ఇవ్వాలి. వారికి రక్షణ భద్రత భావం కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లలకు రోల్‌మోడల్స్‌గా ప్రవర్తించాలి. వారికి ఆదర్శప్రాయంగా ఆదర్శనీయంగా ఉండేలా ప్రవర్తించాలి. మంచి ఫలితాలను సాధిస్తే అభినందించాలి. చిన్నచిన్న బహుమతులు కూడా ఇవ్వాలి.

పిల్లల పట్ల స్పందన ఎప్పుడూ ఒకేలా ఉండాలి. పిల్లలు ఆందోళన చెందేలా విపరీత స్పందనలు కనబడనీయకండి. వారికి ఉపన్యాసాలు ఇవ్వకండి. పిల్లలో స్నేహపూర్వకంగా మెలగాలి. వాళ్ల ఇబ్బందులు ఏమిటో గుర్తించగలగాలి. పిల్లలకు పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోయే విధంగా అలవాటు చేయాలి. స్కూలులో ఎదురైనపుడు వాటిని ఎదుర్కొనే నైపుణ్యాలను అలవాటు చేయాలి.

పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు అతిగా స్పందించడం, పిల్లల ఆసక్తితో సంబంధం లేకుండా చదువుకు సంబంధించిన నిర్ణయాలు చేయడం మాతృభాషలో మాట్లాడనివ్వకపోవడం, అతిగా హోంవర్క్ ఇవ్వడం, ప్రతి దానికి పరుగుతీసే పోటీతత్వం వంటి వాటివల్ల పిల్లల్లో ఒకరకంగా పెద్దల పట్ల వ్యతిరేక భావన ఏర్పడే అవకాశం ఉంది.

చదువు పట్ల పిల్లల్లో ఆసక్తి కలిగించాలే తప్ప బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయకూడదు. పిల్లలకు చదువంటే పరీక్షలు, మార్కులు, ర్యాంకులేగాక జీవితాన్ని గెలిచి నేర్చుకోవడం అతని తెలిసే విధంగా విద్యావిధానం ఉండాలి. పెద్దలు తమ నుంచి ఏం నేర్చుకుంటున్నారు అన్న విషయాన్ని పెద్దలు సునిశితంగా గమనిస్తుండాలి. దానికి తగ్గట్లుగానే ప్రవర్తనాశైలిని ఆదర్శవంతంగా మార్చుకోవాలి.

*– పి.టి.ఐ.*



# స్థానిక సాధికారతతోనే ఆర్థిక ప్రగతి

**స్థానిక సాధికారతతోనే సర్వోన్నతి అనే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రగతి కార్యక్రమాలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయి. గత కొంతకాలంగా అమలవుతున్న కార్యక్రమాలతో గ్రామాల్లో జీవనోపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. పేదరిక నిర్మూలన కార్యక్రమాల వేగం పెరిగింది. భూమి ఆధారిత జీవనోపాధివృద్ధి చెందుతుంది. నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు.**

జీవనోపాధికి ప్రభుత్వం అండగా ఉంటుందనే ధీమా పేదల్లో పెరిగింది. ఫలితంగా జీవనప్రమాణాలు పెరిగి పేదరికం తగ్గుతుంది. సామాజిక అంతరాలు తగ్గిపోతున్నాయి. ప్రాథమిక విద్యలో గణనీయమైన అభివృద్ధి నమోదవుతుంది.

పచ్చని చెట్ల కోసం రూ. 325 కోట్లతో 230 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమం, మిషన్ కాకతీయ పథకంతో చెరువుల పూడిక తీయడం, మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని సరఫరా చేయడం, గూడు లేని నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్ళు మంజూరు చేయడం, నిరుపేద వృద్ధులకు ఆసరా పింఛన్లు, బిపిఎల్ కుటుంబాలకు ఆహార భద్రత, షెడ్యూల్డు కులాలకు భూమి కొనుగోలు పథకం, హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం, కల్యాణ లక్ష్మీ లాంటి పథకాలు పేదరిక నిర్మూలనకు దోహదపడుతున్నాయి.

ఈ పథకాల్లో ఇప్పటికే అత్యధిక పథకాలు అమలులో ఉన్నాయి. మరికొన్ని పథకాలు త్వరలోనే ఆచరణలోకి రానున్నాయి. వీటికితోడు నేరుగా ఆర్థిక ప్రయోజనం చేకూర్చే కేంద్ర, రాష్ట్ర పథకాలు కూడా గ్రామీణ ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయి.

స్త్రీనిధి ద్వారా గత సంవత్సర కాలంలో గ్రామీణ మహిళలు రూ. 580 కోట్ల రుణాలు పొందారు. మరో రూ. 500 కోట్లు రుణం ఇవ్వడానికి స్త్రీనిధి సంస్థ సంసిద్ధతను వ్యక్తం చేసింది. ఈ నిధులన్ని కూడా గ్రామీణ మహిళలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పెట్టుబడి పెడుతున్నారు. తమ కుటుంబాల్లో విద్యావకాశాల కోసం ఖర్చు చేస్తున్నారు.

ఒక్కొక్క కుటుంబం రూ. 25 వేల నుండి లక్ష వరకు రుణం తీసుకుంటుంది. గ్రామీణ ఆర్థిక ప్రగతిలో ఈ రుణాలు కీలక భూమిక

పోషిస్తున్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం స్త్రీనిధి కింద 9 లక్షల మంది మహిళలు రుణాలు పొందారు. ఈ రుణాలు గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి, జీవనోపాధి పెంపునకు దోహదపడుతున్నాయి.

గ్రామాల్లో ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్య, వ్యవసాయం, పశుపోషణ, త్రాగునీరు, పారిశుద్ధ్యం, కుటుంబ సంక్షేమం, చిన్నతరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు గ్రామజ్యోతి కార్యక్రమం పరిధిలోకి తేవడంతో ప్రణాళికా బద్ధమైన అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్యక్రమాలను సమీక్షించడం, వాటిని సక్రమంగా అమలు జరపడం, ప్రణాళికా బద్ధంగా చర్యలకు ఉపక్రమించడం లాంటి సమన్వయ విధానాలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయి.

ఫలితంగా గ్రామీణుల్లో ఆదాయం పెంచుకొనే అవకాశాలు ఏర్పడ్డాయి. అదే స్థాయిలో పొదుపు కూడా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన జన్‌ధన్ యోజన కింద తెలంగాణలో 77 లక్షల ఖాతాలను తెరిచారు. అందులో గ్రామీణ పేదలు తెరిచిన ఖాతాలు 44.22 లక్షల వరకు ఉన్నాయి. వారంతా రూ. 688 కోట్ల మేరకు పొదుపు చేశారు.

బ్యాంకర్ల వద్ద నిబంధనల మేరకు తమకు రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. తమ జీవన ప్రమాణాల పెంపు, జీవనోపాధి అవకాశాలను వృద్ధి చేసుకుంటామని పేర్కొంటున్నారు.

ఒక్కొక్క ఖాతా పైన రూ.5000 వేల వరకు రుణం పొందే అర్హతను తెలంగాణ గ్రామీణ పేదలు పొందగలిగారు. వారందరికి రుణాలు ఇవ్వగలిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చినట్లవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2016 నాటికి 1200 పల్లె ప్రగతి కేంద్రాలను ప్రారంభించి ఎలక్ట్రానిక్ పద్ధతిలో పౌర సేవలను అందజేస్తుంది.

దశల వారిగా అన్ని గ్రామాల్లో ఇలాంటి కేంద్రాలను ప్రారంభించడానికి చర్యలను వేగిరపరుస్తుంది. అంకాపూర్,



ముల్కనూరు, గంగదేవిపల్లి గ్రామాలను ఆదర్శంగా తీసుకొని ప్రజల సమిష్టి కృషితో గ్రామాలను అభివృద్ధిపర్చాలని ప్రభుత్వం భావిస్తుంది, వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజలను భాగస్వామ్యం చేస్తుంది. ఫలితంగా అనేక గ్రామాల్లో సానుకూల ఫలితాలను రాబట్టగలుగుతుంది.

రాష్ట్రంలో మొత్తం 8778 గ్రామ పంచాయతీలు, 10,761 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. సుమారు 215.85 లక్షల గ్రామీణ జనాభా ఉంది. ప్రతి గ్రామాన్ని డిజిటల్ గ్రామంగా తీర్చిదిద్దడానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. వాటర్ గ్రిడ్ పైప్ లైన్ల వెంట ఫైబర్ ఆప్టికల్ కేబుల్స్ వేయడం ద్వారా ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే గ్రామాల్లో 69,13,458 ఎకరాలకు సాగు సౌకర్యం ఉంది, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల కింద బీడుబారిపోయిన సాగు భూములకు సాగునీరందించబోతుంది.

ఇది గ్రామీణ ఆర్థిక ప్రగతికి దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొంది. ఇప్పటికే అక్షరాస్యతను 61.33 శాతం నుండి 66.46 శాతానికి పెంచారు. సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి ఇంటికి మంచినీరు అందించే లక్ష్యం చేరుకొనగలిగితే గ్రామీణాభివృద్ధిలో ఆశించిన ప్రగతి అంచులకు చేరుకోవడం పెద్ద సమస్య కాబోదని పాలకులు భావిస్తున్నారు. అందులో భాగంగా కొన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర పథకాలతో అనుసంధానం చేసే విషయంపై కూడా సమాలోచనలు జరుపుతున్నారు.

గ్రామాల్లో 14 శాతం పేదల ఇళ్ళకు విద్యుత్ సౌకర్యం లేదని, 41 శాతం నివాసాల్లో మరుగుదొడ్లు లేవని, దాదాపు 44 శాతం పేద కుటుంబాలు ఒకే గదిలో జీవనం సాగిస్తున్నాయని, 67 శాతం మంది గ్రామీణ నిరుపేదలకు సొంత భూమిలేదని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా ఈ కుటుంబాలకు ఇళ్ళు, పొలం, విద్యుత్, మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని భావించింది, ఆ మేరకు నివేదికలను సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించింది.

2017 నాటికి ఈ సమస్యలన్ని పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకొనబోతుంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాలను అమలు పర్చిన పక్షంలో గ్రామీణ పేదరికం నిర్మూలించబడి, ప్రతి గ్రామం ఆర్థికాభివృద్ధి చెందుతుందడనడం అతిశయోక్తి కాబోదు.

*– పి. శంకర్, సీనియర్ జర్నలిస్ట్*

# ఆడవాళ్ళకు అంటరాని వాళ్లకు అక్షరాలు దిద్దించిన సావిత్రిబాయి పూలే



**ఆధునిక భారతదేశానికి మొదటి టీచర్ సంఘసంస్కర్త సావిత్రిబాయిపూలే. కుల వ్యవస్థలో మానవహక్కులు కోల్పోయిన శూద్ర, దళిత కులాలకు, అన్ని కులాల మహిళలకు 1848లోనే ప్రత్యేక పాఠశాలలు నడిపి వారికి చదువు చెప్పిన మొదటి ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే. బతికినంత కాలం స్త్రీ విద్య కోసం, అంటరాని కులాలకు చదువును అందించడానికి శ్రమించింది.**

ఆధిపత్య హిందూ సమాజంపై తిరుగుబాటు చేసింది. కార్మిక, కర్షక అభ్యున్నతికి ఉద్యమాలు నడిపింది. జ్యోతిబాపూలేతో కలిసి సత్యశోధక సమాజాన్ని స్థాపించి, సామాజిక న్యాయం కోసం కృషిచేసిన సంఘసంస్కర్త సావిత్రిబాయిపూలే.

సావిత్రిబాయి పంటకో ..... యింటికో పరిమితమైన ఆధిపత్య కులాల నుంచి కాక, పనిపాటల శ్రమ జీవనంలో బతికే బహుజన కులాల నుంచి వచ్చింది. ఆదదిక్కులేని జ్యోతిబాపులే యింటికి తొమ్మిదేండ్లకే అతని భార్యగా అడుగుపెట్టి, జీవితాంతం సామాజిక ఉద్యమ కార్యకర్తగా నేతగా కొనసాగింది. జ్యోతిబాపూలే తర్వాత కూడా సత్యశోధక సమాజాన్ని బలంగా ముందుకు నడిపిన ఉద్యమకారిణి.

జ్యోతిబాపులే నడిపిన అన్ని సామాజిక ఉద్యమాల్లో సావిత్రిబాయిపూలే ప్రధాన భాగస్వామి. సావిత్రిబాయిపూలే లేకుండా జ్యోతిబాపులే మహిళా పాఠశాలలు, దళిత పాఠశాలలు, సత్యశోధక సమాజాలు సజావుగా నడిపేవాడు కాదేమో!

జ్యోతిబాపులే బాలికా పాఠశాలలు ఏర్పాటు చేస్తే పాఠాలు చెప్పడానికి నిరాకరణలు, తీవ్ర అడ్డంకులెదురైనపుడు సావిత్రిబాయి టీచరుగా వెళ్లి ఆ పాఠశాలల్ని విజయవంతంగా కొనసాగించింది. స్త్రీవిద్య, పాకి, మాంగ్, మహర్ లకు పాఠశాలలు, సత్యశోధక సమాజ స్థాపన, యింకా అనేక సామాజిక ఉద్యమాల్లో జ్యోతిబాపులేతో సగభాగంగా, సమభావంగా నడిచింది, నడిపింది.

'నువ్వు యింటి పట్టునుండు నేను పోరాటం చేసోస్తా' అనే ఉద్యమకారులకన్నా జ్యోతిబాపూలే వెయ్యిరెట్లు జెండర్ ప్రజాస్వామ్యాన్ని

తన జీవితభాగస్వామి సావిత్రిబాయిపూలే పట్ల కనబరిచాడు. పూలే తన చదువును, చైతన్యాన్ని, చదివిన ప్రతిపుస్తకాన్ని సావిత్రిబాయికి పంచేవాడు. అట్లా యింటి నుంచే చైతన్యాల్ని అందిపుచ్చుకున్నందువల్ల హిందూ ఆధిపత్య సమాజాల్నించి తీవ్ర దూషణలు ఎదురైనా ధైర్యంగా నిలిచింది.

'ఆడపిల్లలకు చదువెందుకు అంటరానోల్లకు చదువా! ఆడదైవుండి బలదూరుగా బజారుకొచ్చి చదువు చెప్పుడేంది? సంఘానికి కీడు' అని ఛీ కొట్టినా, థూ–థూ అని తిట్టినా, అలుకు నీల్లు మీదబోసినా... ఆ అవమానాలన్ని భరించి నిమ్నజాతులకు, మహిళలకు చదువు చెప్పింది.

కొల్లాటినీల పేరుతో, తమాషాల పేరుతో దళిత కులాల ఆడవాళ్ళ మీద జరిగే జోగినీ వ్యభిచార దురాచారాలకు, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపింది. సతి, వితంతు, వైధవ్యం అనాధ బాలలు (సమాజామోదం లేని) వంటి ఆధిపత్య కులాల మహిళా దురాచారాలుగా వుండేవి.

నిమ్నజాతికి చెందిన సావిత్రిబాయిపూలే ఒక వైపు హిందూ ఆధిపత్యాల పట్ల వ్యతిరేక ఉద్యమాలు నడుపుతూనే అదే కులాల మహిళా బాధితుల్ని అక్కున చేర్చుకొని వారిపైవున్న దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించింది. వారికోసం ఆశ్రమాలు నెలకొల్పింది. అన్ని సాంఘిక దురాచారాల నిర్మూలనకు పోరాడింది సావిత్రిబాయిపూలే.

సావిత్రిబాయిపూలే సంస్కరణోద్యమాలు సమాజంలోని బాధితులందరి కోసం చేసింది. సమాజంలోని బాధితులందరి పక్షాన సేవా దృక్పథం కనబరిచింది. ఆమె యీ విశాల దృక్పథానికి ఏ చరిత్రలు గుర్తింపులు, విలువలు యివ్వలేదు. సావిత్రిబాయి నిమ్నజాతిలో కాకుండా ఆదిపత్య జాతిలో పుట్టివుంటే ఆమె చేసిన సామాజిక సేవకు చరిత్రంతా మోకరిల్లేది.

ఆమె 'మాలి' కులంలో పుట్టి కుల వ్యవస్థల్ని, దాని విలువల్ని ప్రశ్నించినందువల్ల ఆమె చేసిన సామాజిక ఉద్యమ చరిత్రను ఆధిపత్య చరిత్రలు విస్మరించనాయి. ఆధిపత్య చరిత్రలకు సంఘసంస్కర్తలంటే సామాజిక ఉద్యమకారులంటే ఆధిపత్య హిందూకులాల వారే కనిపిస్తారు. వారు పెట్టిన బ్రహ్మ సమాజాలు, ప్రార్థనా సమాజాలు, సార్వజనిక్ సమాజాల్లాంటి వాటిని చరిత్రనిండా గానుగు తిప్పినాయి.

ఈ సమాజాలు తమ కులాల్లో వున్న దురాచారాల నిర్మూలన కోసం ఏర్పాటు చేసుకున్నదే గానీ సమాజంలో ఉన్న అన్ని జాతులకు, కులాలకు సంబంధించినవి కావు. కానీ సార్వజనీనమనీ, సామాజికమని చరిత్రనిండా అబద్ధ ప్రచారం చేసుకున్నాయి. నిమ్నకులాల సమస్యలు గానీ, సంస్కరణలు గానీ పట్టించుకున్నట్లు కనిపించదు. సావిత్రిబాయి, జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక సమాజాల్లాంటివి దేశంలో యింకెన్ని మరుగునపడినాయో శోధించాల్సి వుంది. అట్లా శోధించడమే సావిత్రిబాయి సామాజిక ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకుని పోవడంగా భావించాలి.

భారతదేశంలో అభ్యుదయ, కమ్యూనిస్టు, విప్లవ మహిళా ఉద్యమ ముసుగుల్లో నాయకత్వాలు చేస్తున్న ఆధిపత్యకులాలు సావిత్రిబాయిపూలే చేసిన సామాజిక ఉద్యమ చరిత్రల్ని చీకటి చేసినయి అట్లా చీకటి చేసిన చరిత్రల్ని బహుజన కులాలు ఒకటొకటిగా వెలుగులోకి తెస్తున్న ప్రయత్నంలోనే సావిత్రిబాయి, జ్యోతిబాపులే చరిత్రలు బైటకొచ్చినయి. అవి తెలుగు సమాజానికి తీసుకొచ్చింది (2005) బి.ఎం. లీలా కుమారి.

సావిత్రిబాయి సామాజిక ఉద్యమనాయకురాలే కాదు, ఆమె గొప్పరచయిత్రి. కావ్యపూలే, భావన్‌కషి సుబోధర్‌లాకర్ వంటి రచనల్ని ప్రధానంగా చెప్పుకోవచ్చు. సావిత్రిబాయి గొప్ప ఆచరణవాది. సమాజామోదంలేని సంతతిని దత్తు తీసుకొని సమాలించింది. వందల వేల కులాంతర వివాహాలు జరిపించింది. తన పెరట్లో బావిని తవ్వించి అంటరాని వాల్లకు నీటికొరత తీర్చింది.

సావిత్రిబాయిపూలే జీవితా దర్శాన్ని విస్తృతి చేయడానికి ఆమె జన్మదినమైన జనవరి 3ను భారతజాతీయ మహిళా దినంగా ప్రకటించాలి, టీచర్స్‌డే గా ప్రకటించి, స్ఫూర్తిప్రధానమైన ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలి.

– ***జూపాక సుభద్ర,*** *డిప్యూటీ సెక్రటరీ, పి.ఆర్.*

# ట్రైకోడెర్మా సేంద్రియకం మరియు జీవనియంత్రకము

**ట్రై కోడెర్మా అనేది అన్ని వాతావరణ మండలాలలోనూ, అన్ని నేలలోనూ ఉండే నిర్లింగ/ అలైంగిక శిలీంధ్ర ప్రజాతి, మొక్కలకు తెగుళ్ళు కలిగించే ఎన్నో రకాల శిలీంధ్రాల మీద, నులిపురుగుల (నెమటోడ్స్) మీద ఇవి పర్నాజీవులుగా ఉండటం వలన ఇవి మొక్కలను తెగుళ్ళవారి నుండి రక్షిస్తాయి. శిలీంధ్రాలను అరికట్టే జీవ నియంత్రక జీవులలో అత్యధికంగా అధ్యయనం జరిగింది.**

ఈ శిలీంధ్రాలు హరిత గృహాలలోనూ, పొలాలలోనూ జీవకీటకనాశినిగానూ, జీవన ఎరువుగానూ సత్ఫలితాలను అందించాయి. పారిశ్రామిక రంగంలో కూడా ట్రైకోడెర్మా శిలీంధ్రాలు ఉత్పన్నం చేసే ఎంజైములు (దోహకద్రవ్యాలు) ఉపయోగిస్తారు. తెగుళ్ళను అరికట్టి, మొక్కల పెరుగుదల ప్రోత్సహించే గుణం కలిగి ఉన్నందున వివిధ రకాల ఉపజాతుల ట్రైకోడెర్మా జీవులను కలిపి తయారుచేసిన మిశ్రమాలు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి. ట్రైకోడెర్మా జాతిజీవులు అన్నిచోట్లా వ్యాపించి ఉండి, భూమిలో నివసించే ఇతర వ్యాధికారక ఇతర శిలీంధ్రాల కన్నా ప్రబలంగా ఉంటాయి. వీటి పెరుగుదలకు కావల్సిన కనీస పోషకవసరాలు చాలా తక్కువ. ఈ శిలీంధ్రాల జీవకరణ కవచంలోని పదార్థాలు, సెల్యూలోజ్ మరియు ఖైటిన్‌లను వినియోగించుకోగల్గుతాయి.

శిలీంధ్రజాలం కొనిడియా (సూక్ష్మ సిద్ధబీజాశయాలు), అచేతనంగా ఉన్న సుప్త బీజాణువుల వంటి ప్రవర్ధనపు కణంకాలను సమృద్ధిగా ఉత్పత్తి చేస్తాయి. పోషకాల మూలం లభించగానే ఇవి పెరగడం మొదలుపెడతాయి. ట్రైకోడెర్మా శిలీంధ్రాలు విడుదల చేసే అనేక రకాల బాష్పశీల, అబాష్పశీల జీవక్రియా రసాయనాలు పంటలను నష్టపరిచే అనేక తెగులు కారక సూక్ష్మజీవులకు నిరోధకములుగా పనిచేస్తాయి. జీవావరణపరంగా అనుకూలా స్వభావం కలిగి ఉండటం వలన, ఖరీదు తక్కువగల మాధ్యమాలను ఆధారంగా చేసుకొని పెరగగల గుణం కలిగి ఉన్నందున ట్రైకోడెర్మా జీవులు అధికసంఖ్యలో ఉత్పత్తి చేసి, వివిధ ఫార్ములేషన్స్ (మిశ్రమాలు)లో చేర్చి, అందించడానికి అనువుగా ఉంటుంది. ట్రైకోడెర్మా హర్జియానం: జాతి సూక్ష్మజీవి సమూహాలు వివిధ రకాల ఉదజని సూచి పరిస్థితులను, వివిధ ఉష్ణోగ్రతలను (25-35 డిగ్రీ సెంటీగ్రేడ్) ఈ అన్ని కారణాల వలన ట్రైకోడెర్మా జాతి సూక్ష్మజీవుల నియంత్రకాలుగా సత్ఫలితాలనిస్తాయి.

## ట్రైకోడెర్మా పనితీరు

జీవనియంత్రకాలుగా ఉపయోగించినప్పుడు ట్రైకోడెర్మాసూక్ష్మజీవులు తెగుళ్ళను కలుగజేసే జీవులపట్ల వివిధ రకాల విరుద్ధ ప్రవర్తనలు ప్రదర్శిస్తాయి. వీటిలో ఒకటి "యాంటి బయోసిస్" అంటే ఇతర సూక్ష్మజీవులను నిరోధించే యాంటిబయోటిక్ ధర్మాలు కల అనేక జీవరసాయనాలను విడుదల చెయ్యడం. ట్రైకోడెర్మా శిలీంధ్రము పర్నాజీవకముగానూ మరియు అతిపర్నాజీవన శాలిగా పనిచేస్తుంది.

రెండవది పోషకాలకు, స్థలానికి/ ప్రదేశానికి ఇతర సూక్ష్మజీవులతో పోటీపడడం మూడవది, తెగులుకారక శిలీంధ్రాల జీవకరణ కవచాన్ని కరిగించివేసే ఎంజైములను విడుదలచెయ్యడం ద్వారా, జీవకణ కవచాన్ని కరిగించి కణంలోపలి పదార్థాన్ని ఆహారంగా స్వీకరించడం నాలుగవది, మొక్కలలో తెగులుకారక జీవుల పట్ల దైహిక నిరోధకత పెంపొందించడం వీటన్నింటిలో యాంటీబయోటిక్ పదార్థాలు ఉత్పన్నం చెయ్యడం జీవనియంత్రక కారకాలుగా ఉపయోగించే సందర్భంలో ప్రముఖపాత్ర వహిస్తాయి. జీవనియంత్రణ ప్రక్రియ కొరకు ట్రైకోడెర్మా జీవులు వివిధరకాల బాష్పశీల, అభాష్పశీల జీవరసాయనికాలు ఉత్పన్నం చేస్తున్నట్లు పరీక్షల ద్వారా నిరూపించడం జరిగింది.

## తెగుళ్ళ అణచివేత

భూమిలో నివసించే తెగులు కారక రైజోక్టోనియా, స్క్లిరాటీనియా, వర్టిసిల్లియం మరియు ఫూజేరియం వంటి శిలీంధ్రాలను హైఫెరాసైటిస్మ్ ద్వారా ట్రైకోడెర్మా నియంత్రిస్తుంది. ట్రైకొడెర్మా జీవి ఖైటినేస్ మరియు సెల్యులేసిన్ అనే ఎంజైములను స్రవిస్తుంది. ఈ ఎంజైములు, ట్రైకోడెర్మా తలపడే తెగులుకారక చిన్న అణువులు విడుదలయ్యేలా చేసి 'ఖేమోట్రోపిజం' అనే ప్రక్రియ మొదల య్యేలా చేస్తాయి. ఈ విధంగా ఇతర జీవులు, శిలీంధ్రాలు దగ్గరకు వచ్చాక ట్రైకోడెర్మా శిలీంధ్ర తంతువులు తెగులుకారక జీవి చుట్టూ చుట్టుకుంటాయి. క్రమంగా ఆ జీవులు జీవకరణ కవచాలను కరిగించి ట్రైకోడెర్మా వాటిలోకి ప్రవేశిస్తుంది. ట్రైకోడెర్మా మరియు గ్లియోక్లేడియం శిలీంధ్రాలు "యాంటీమైక్రోబియల్ సెకండరీ మెటబొలైట్స్" కూడా వెలువరిస్తాయి.


ట్రైకోడెర్మా శిలీంధ్రాలు జీవులతోనేరుగా తలపడడం వలన కలిగే ప్రయోజనాలతోపాటు కొన్నిరకాల ట్రైకోడెర్మా జీవులు మొక్క యొక్క వేరు ఉపరితలం మీద సహనివేశాలు ఏర్పరుచుకుని మొక్క యొక్క జీవనక్రియకు ఎంతగానో తోడ్పడుతాయి.

ఈ కారణంగా మొక్క పెరుగుదల పోషకాల అందుబాటులో పంట ఉత్పత్తి తెగుళ్ళ నిరోధకశక్తి పెరుగుతాయి. ట్రైకోడెర్మా శిలీంధ్రం మొక్క నుండి పోషకాలు అందుకోగా, ఈ శిలీంధ్రం వలన మొక్క తెగుళ్ళ నుండి రక్షణ పొందుతుంది. తెగులును కలుగజేసే సూక్ష్మజీవుల ను అడ్డుకోవడమే కాక, ట్రైకోడెర్మా శిలీంధ్రం మొక్క పెరుగుదలకు, ఉత్పత్తికి నేరుగా కూడా దోహదపడగలదు. స్థూల మరియు సూక్ష్మ పోషకాలను ద్రావణీకరించి మరియు / లేదా వాటిని మరింత ఎక్కువగా పీల్చుకోవడం ద్వారా మొక్కకు పోషణ బాగా అందించడం, మొక్క పెరుగుదలకు అవసరమైన మూలకాలను పెంచి, మొక్కకు హాని కలిగించే వేరు మండలపు సూక్ష్మజీవులను నిర్మూలించడం జరుగుతుంది. ఈ ప్రక్రియలు ట్రైకాడెర్మాకు "జీవన ఎరువుల ప్రభావం' ఉంటుంది. ట్రైకోడెర్మా జాతీ శిలీంధ్రాలు అనేక రకాల చర్యల ద్వారా నులిపురుగులలో ప్రవేశించడం లేదా వాటిని నాశనం చెయ్యడం జరుగుతుంది.

◆

# సహన గుణం

**జీవితాన్ని ఉన్నతంగాను, పవిత్రంగాను, చేయటంలో దివ్యగుణాలకు ఎంతో విలువైన స్థానం వుంది. కాని కొన్ని దివ్యగుణాల సంబంధం మానవుని మానసిక శక్తులతో ముడిపడివుంది. ఇవి లేకుండా జీవితంలో శాంతిని పొందటం అసంభవం. సంతోషం, మధురత, సహనశీలత, ధైర్యం, నమ్రత లాంటి సుగుణాలు లేకుండా శాంతిని పొందటం వీలుకాని పని. కాని వీటిని జీవితంలో ఎలా ఆచరించాలనేదే ప్రశ్న.**



**సంతోషం :** అశాంతిని నివారించగల గొప్ప ఉపాయం సంతోషం లేక సంతృప్తి. ఏది దొరికినా, దొరకక పోయినా అంతా మన కర్మల ఫలితమేనని, మన కర్మలే మనకు ప్రాప్తినిచ్చేవని, మన లోటుకు కారణం కర్మలేనని అసంతృప్తి పనికిరాదు. మనకు ఏదైనా అవసరమైన వస్తువు దొరకనిచో దానిని సాధించి ముందుకు సాగిపోవాలి. ఉదాహరణకు: ఏ వ్యక్తి దగ్గరైనా ధనం, సంపదలు లేనప్పుడు జ్ఞాన ధనాన్ని ఆర్జించకలిగితే అతని జీవితానికి సంతృప్తి కలుగుతుంది.

వృద్ధులలో యువకులవలె శక్తి లేకపోయినా యోగశక్తిని సంపాదించుకొని పవిత్రతా బలాన్ని శక్తివంతంగా తయారుచేసుకోవాలి. నా దగ్గర ధనం లేకపోయినా దైవ సంపద వుంటే మనసుకు సంతృప్తి, శాంతి కలుగుతుంది.

**మధురత:** కటువుగా మాట్లాడే వ్యక్తి అశాంతిపాలై ఎదుటి వారిని అశాంతి పరుస్తాడు. మాటల తీరుతో సంబంధాలు కూడా బలపడతాయి. అశాంతిపాలైన వ్యక్తిని తియ్యని మాటలతో శాంతింపచేయగలం. కటువైన మాటలతో మరింత దూరం పెరుగుతుంది. అందువల్ల మాధుర్యమే శాంతి పతాకమని, విజయ దుందుభిని మ్రోగించగలదని గ్రహిస్తే మధురత ఉన్న చోట శాంతి నెలకొంటుంది.

**సహన శీలత:** సహన శీలత అలవర్చుకున్న మానవుడు ఆవేదన, పశ్చాతాపం అనే అగ్ని నుండి రక్షింపబడతాడు. సహనంతో ఇతరుల కోపాన్ని తగ్గించి వారిని శాంతింపచేయగల్గుతాము. ఆత్మ బలాన్ని పెంచుకొని శారీరకంగా బలవంతుడైన వ్యక్తి ఎదురు దెబ్బలను సహించినచో ఆత్మ శక్తివంతమవుతుంది. శాంతంగా వుండటమే సహనం వైపు పయనించటం తన శక్తిని వికసింపచేసుకొనటం సహనం లేకపోతే మనోవాక్ కర్మలలో తప్పులు కనిపిస్తాయి. సహించుట అనగా గొప్పవారమవడమేనని గ్రహించి సహించే ప్రయత్నం చేయ్యాలి.

**ధైర్యం:** ఆపత్కాలంలో ధైర్యం కోల్పోయిన మనిషి తన మానసిక ప్రశాంతతను పోగొట్టుకుంటాడు. అప్పుడు అతని వివేకం పనిచేయదు.

సరియైన నిర్ణయం కూడా తీసుకోలేడు. కావున అతని మానసిక అశాంతి పెరిగి ఎన్నో తప్పులు చేస్తాడు. ఆపత్కాలంలోనే ధైర్యానికి పరీక్ష ఉంటుంది. ధైర్యమనే సద్గుణాన్ని పాటించే ముందు పరిస్థితులు నాకు అనుకూలమా, ప్రతికూలమా అని గమనించాలి. రోజులు కూడా గడిచిపోతాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల ను ధైర్యంగా ఎదుర్కోవాలి. మనసును సరిదిద్దుకునే వ్యక్తి ఆలోచించి అడుగుముందుకు వేస్తూ త్వరలోనే సఫలీకృతుడవుతాడు.

**నమ్రత:** వినయం అనేది దివ్యగుణం.

దివ్యగుణమే కాక మనల్ని శాంతి వధాన్ని పయనింపచేసే విలువైన సుగుణం. నమ్రత గల వ్యక్తి అందరి మనసులో అతనికి శుభాశీస్సులు వుంటాయి. అందరి శుభభావనలతో అతని జీవితం శాంతి పయనమవుతుంది. అహంభావి, కదు స్వభావం ఉన్న వ్యక్తితో మాట్లాడడానికి అందరూ వెనకాడతారు.

అందుకే మన జీవితంలో వినయాన్ని అలవర్చుకునే ప్రయత్నం చెయ్యాలి. ఈ దివ్యగుణాలన్నీ వెలకట్టలేనివి. వీటిని పాటించటం వలన మనం శాంతిపయనంలో ముందుకుపోగలము.

– ఐ & పి.ఆర్



# ట్రైనింగ్ నీడ్స్ ఎసెస్‌మెంట్ (టిఎన్ఎ) పై టిసిపార్డులో 2 రోజుల వర్క్‌షాప్

**తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శులకు కావలసిన ట్రైయినింగ్ అవసరాలను అంచనా వేసి వారికి కావలసిన మెటీరియల్‌ను (కరదీపికను) తయారుచేయటానికి రెండురోజుల వర్క్‌షాప్ టిసిపార్డులో సి.డి.పి.ఎ హెడ్ శ్రీ బి.లింబగిరి స్వామి ప్రారంభించారు.**

ఈ వర్క్‌షాప్‌లో గ్రామాలలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు చేయవలసిన పనులు, కార్యక్రమాలు, విధులు బాధ్యతలను గూర్చి, 100 శాతం పన్నులు వసూలు, సర్టిఫికెట్స్ జారీ, పెన్షన్ మంజూరి, ఇతర అంశాలపై వర్క్‌షాప్‌నందు చర్చించి కరదీపికను రూపొందించటానికి నిర్ణయాలను చేర్చి మెటీరియల్‌ను అందజేస్తారు. అందుకు సీనియర్ MPDO లు EO(PRRD) లు Grama Panchayat కార్యదర్శులు కలిసి మెటిరీయల్‌ను ఈ వర్క్‌షాప్‌లో తయారు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు. వర్క్‌షాప్ కోర్సు డైరెక్టర్‌గా ఎస్.శంకరయ్య వ్యవహరించారు.

*- సిఎంపి*

# పీసా చట్టంపై ఎన్నికైన ప్రతినిధులకు మెటీరియల్ (కరదీపిక) పై రెండురోజుల వర్క్‌షాప్ (కార్యశాల)

**తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన షెడ్యూల్డ్ ప్రాంతంలో ఎన్నికైన ప్రతినిధులకు టి.సి పార్డులో రెండు రోజుల వర్క్స్ షాప్ (21-22 డిసెంబర్) జరిగింది. ఏజెన్సీ ప్రాంతం నుండి ఎన్నికకాబడిన ప్రతినిధుల కోసం తయారు చేయవలసిన కరదీపికపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ శ్రీ కె.యాదయ్య ప్రారంభించారు.**



ఈ సందర్భంగా మాట్లాడుతూ పీసా చట్టం మీద ఏజెన్సీ ప్రాంత్రాలలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించి, వారిని గిరిజనులకు అభివృద్ధి కార్యక్రమాలను అందేలా చేయటానికి ఒక కరదీపికను తయారు ఏయడం జరుగుతుందని అన్నారు.

ముఖ్యంగా గ్రామసభ నిర్వహణ, గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, వనరులు సమీకరణ, నాయకత్వ లక్షణాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన. గిరిజనులకు నిధులు రాబట్టడం, ఖర్చు చేయడంపై ఈ కరదీపిక నందు పొందుపరచడం జరుగుతుందని సిడిపిఎ హెడ్ బి.లింబగిరిస్వామి అన్నారు.

ఈ రెండు రోజుల వర్క్‌షాప్ నందు ఎం.పి.డి.ఓలు. EO(PRRD), GPS (గ్రామ పంచాయితీ సెక్రటరీలు, ఇతర అధికారులు వర్క్‌షాప్ నందు పాల్గొని కరదీపికను రూపొందించారు.

*- సిఎంపి*



# పేదల ఇంటికలను నెరవేరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అనే మాట ఊరికే పుట్టలేదు. పేదరికంలో మగ్గుతున్న ఎంతోమంది అభాగ్యులకు సొంతింటి కల.. కలగానే మిగిలిపోతోంది. ఆకాశానికి తాకే భవంతులు కట్టే కూలీలు.. తమకోసం పిట్టగూడు వంటి ఇంటిని కూడా కట్టుకోలేకపోతున్నారు. పిట్టకున్న గూడు కూడా లేక.. ఎక్కడో ఒకచోట తలదాచుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే పేదోళ్ల కలల సౌధాలు సాకారమవుతున్నాయి! డబుల్ బెడ్‌రూమ్ కల సాకారమవుతోంది! డబుల్ బెడ్‌రూమ్ కల సాకారం చేస్తూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ ఇండ్లు కట్టిస్తోంది. నియోజకవర్గానికి 400 డబుల్ బెడ్‌రూం ఇండ్లను కట్టించి.. పట్టాలు పంచే పథకానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు! హైదరాబాద్‌లో మురికి వాడలుగా అన్న ఓ ఐదు బస్తీలను.. అక్కడి ప్రజల లైఫ్ స్టయిల్‌ను డబుల్ బెడ్‌రూం పథకం ఎలా మార్చివేసిందో చూద్దాం...**

"గల్లీసిన్నది.. గరీబోల్ల కథ పెద్దది. వాళ్లున్న ఇండ్లు కిల్లికొట్ల కన్న సిన్నగున్నయి. గల్లీ సిన్నది!

ఆ ఇండ్లకన్న మేలురాఫలక్‌నామ బండ్లురా.. పాతరైలు డబ్బలోలె పడావున్నవేందిరో.. గల్లీ సిన్నది"!

గరీబోల్ల ఇండ్ల గురించి ఇంత దయనీయంగా వర్ణించడం గోరెటికే సాధ్యం.

ఆయన అన్నట్టు పేదోళ్లు 'గూడు' కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటారు. పిట్టెగూడు మాదిరి ఇండ్లలో కాలం వెల్లదీస్తారు. ఇంటికి తుమ్మచెక్కతో చేసిన కడపలు వేసి.. జాగా లేకపోవడంతో దర్వాజాలను దగ్గరగా కట్టుకుని ఇరుకు ఇంటిని కొంత కాలం చేసుకుంటారు. తుప్పు పట్టిన సిలుకులను.. పుచ్చుపట్టి పెచ్చులూడుతున్న తలుపులను రోజూ చూసుకుంటూ ఇళ్లు కట్టే భాగ్యం ఇంకెప్పుడొస్తుందో అని లోలోన గొణుక్కుంటారు.

ఎవరైనా చుట్టం వస్తే కనీసం కూర్చోబెట్టే స్థలం లేక వాకిట్లో నుంచి మాట్లాడి సాగనంపేవాళ్లు కొందరైతే.. అసౌకర్యం కలిగించినవాళ్లమవుతామని తప్పించుకొని తిరిగేవాళ్లు మరికొందరు. ఇక హైదరాబాద్‌లో ఉండే పేదల గురించి.. వారి బస్తీల బతుకు గురించి వర్ణించడానికి పాటలు కూడా సరిపోవు. ఇంటికొక్క గాథ వినిపిస్తుంది.. విచారిస్తే బాధ కనిపిస్తుంది!

"యుద్ధం చేస్తే కచ్చితంగా సాకారం అవుతుంది. లండన్‌లో.. అమెరికాలో లేవా? వాళ్లేమైనా బంగారం తింటున్నారా? వాళ్లు

మనకన్నా ఎక్కువ సిపాయిలా? పేదోడికి కూడా ఉండటానికంటూ ఓ ఇల్లు వాంటే సమస్య కచ్చితంగా సాల్వ్ అవుతుంది. గుడిసెల దారిద్ర్యం తెలిస్తే వందశాతం ఆ దారిద్ర్యాన్ని రూపుమాపొచ్చు. తెలియకపోతే.. తెలుసుకోవాలని లేకపోతే.. ఇంకా వందేళ్లయినా ఈ మురికిలోనే ఎంటాం' అంటూ సీఎం కేసీఆర్ శపథం చేసి గుడిసె గుడిసెకూ తిరిగి సొంతింటి కల కోసం కంకణం కట్టుకున్నారు. అదే ఈరోజు గరీబొల్ల ఇంటికి పచ్చ తోరణమై వేలాడుతోంది.

## గేటెడ్ కమ్యూనిటీ....!

పేదలు కూడా ఆత్మగౌరవంతో బతకడమే ధ్యేయంగా డబుల్ బెడ్‌రూమ్ పథకాన్ని లాంచ్ చేసిన సీఎం కేసీఆర్ ఆశించిన ఫలితాన్ని రాబట్టారు. చరిత్రలో కొత్త అధ్యయానికి తెరతీసిన ఈ పథకం కింద తొలుత ప్రారంభమైన కాలనీ హైదరాబాద్‌లోని ఐడీహెచ్ కాలనీ, పేదల స్వపాలను సాకారం చేసిన దర్శనీయ స్థలంగా మారింది. ఈ కాలనీ.

రెండు సైడ్ల భారీ అంతస్తుల భవనాలు.. మధ్యలో విశాలమైన రహదారులు.. అపార్ట్‌మెంట్ల ముగింట పూదోటలుగా కనిపిస్తున్న పచ్చతివాచీలు.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యం.. ఎల్ఈడీ బల్బులతో రహదారులకు మధ్యన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్.. ఈ అపార్ట్‌మెంట్లకు ముందూ వెనకా భారీ గేట్లు ఉన్నాయి. వీటిని చూస్తుంటే.. స్లమ్ అనే మాట కనుమరుగైనట్లనిపించింది. ఢిల్లీ, ముంబై, పుణె, బెంగళూరు, చెన్నైవంటి మెట్రోపాలిటన్ సిటీస్‌లో అతి సౌకర్యవంతంగా ఉండే ఖరీదైన ధనికులుండే గేటెడ్ కమ్యూనిటీలా కనిపిస్తోంది ఆ పరిసరమంతా!

కానీ ఒకప్పుడు.. ఐడీహెచ్ కాలనీ అంటే ఒక మురికివాడ! ఈ కాలనీకి అనుబంధంగా అమ్ముగూడ హట్స్, సుభాష్ చంద్రబోస్ బస్తీ, భగత్‌సింగ్ నగర్ బస్తీ, పార్థివాడ ఉన్నాయి. కార్లు.. మోటార్లు కంటికైనా కనిపించని సామాన్యులుండే గల్లీలివి.

చిమ్మ చీకట్లలో.. కీచురాళ్ల ఘీంకార శబ్దాలతో నిర్మానుష్యంగా.. నిశ్శబ్దంగా ఉండేది ఈ బస్తీ. గుడిసెల బస్తీ ఉందని కూడా చాలామందికి తెలియదు. వాళ్ళొచ్చారు... వీళ్లొచ్చారు. చూశారు. వెళ్లారు. కొందరికి వాంబే ఇండ్లు కట్టించి చేతులు దులుపుకున్నారు. కానీ సరైన నాణ్యత, నిర్వహణ లేకపోవడంతో వాంబే ఇండ్లు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఏ అపరాత్రో.. అర్ధరాత్రో వర్షం పడితే ఆ వర్షం తడికి ఇండ్లు కూలిపోయే ప్రమాదపుటంచున కాలం వెల్లదీస్తూ కలల సౌధం కోసం తపిస్తూ బతికారు.

## కలిపింది ఇద్దరినీ..!

తరాలు గడచిపోయాయి. తలరాతలు మాత్రం మారడం లేదు తాత.. తండ్రి.. కొడుకు ఇదే మురికివాడలో ఏళ్ల తరబడి బతుకీడ్చేవాళ్లు. అంతా నిరుపేదలే. అంతా ఏ రోజుకారోజు కూలీ పనిచేసుకుని పొట్ట నింపుకునేవారే. ఇంకా వీళ్లకు డబ్బెక్కడ పోగవుతుంది? గుడిసెలు.. గుడారాల స్థానంలో ఇండ్లెట్ల కనిపిస్తాయి? అదంతా ఒక కల ఆ కల కలగానే మిగిలిపోయిన వ్యథ!

తల్లులు ధనికుల ఇళ్లల్లో పాచీపని చేసేవాళ్లు. తండ్రులేమో మోండా మార్కెట్లో ఆలుగడ్డ బస్తాలు మోసి కూలీ పని చేసేవాళ్లు. పిల్లలేమో రాణిగంజ్ కార్ఖానాల్లో పనిచేస్తూ ఆయిల్ పూసిన ముఖాలతో కనిపించేవాళ్లు. తోపుడు బండ్లు పెట్టుకుని కొందరు.. అడ్డా కూలీలుగా కొందరు దినమొక గండంగా గడిపేవాళ్లు.

కానీ తమ ముఖాలపై పేరుకున్న మసిని తుడిచే ప్రయత్నమెవరూ చేయలేదనే బెంగమాత్రం అందరికీ ఉండేది. మేం సమాజంలో భాగం కాదా అన్న సందేహం సందేహంగానే మిగిలిపోయింది. కూలీలు మానుకొని.. కూడబలుక్కొని చెప్పులరిగేలా ప్రజా ప్రతినిధుల చుట్టూ లెక్కలేనన్ని ప్రదక్షిణలు చేశారు. నిరుపేదలకు సొంతింటి కల తీరలేదు!

మురికివాడల పర్యటన చేసిన సీఎం కేసీఆర్ మాత్రం ఈ పరిస్థితిని చూసి చలించిపోయారు. మనుషులు కాదు.. దయ్యాలు కూడా ఈ ఏరియాల్లో నివసించడానికి భయపడతాయేమో? అయినా ఇన్నాళ్లు ఎలా బతుకుతున్నారు అని ఉద్వేగానికి లోనైన సీఎం అప్పటికప్పుడు మీకు లండన్.. అమెరికాలకన్నా ధీటుగా నేను ఇండ్లు కట్టిస్తానని భరోసా కల్పించారు. అన్నదే తడువుగా .. ఐడీహెచ్ కాలనీ వాసులకు 33 బ్లాక్‌ల్లో 396 మందికి డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించి ఇచ్చారు. గుడిసెవాసుల గూడు కోసం పండగలా దిగి వచ్చి.. వెలుగిచ్చిన కేసీఆర్‌ను బస్తీవాసులుఒక దేవునిగా కొలుస్తున్నారు!

| గదుల వైశాల్యం | | (చదరపు అడుగుల్లో) |
|---|---|---|
| ఒక్కో ఫ్లాట్ లివింగ్ ఏరియా | : | 530 |
| ఒక హాలు | : | 122.145 |
| మాస్టర్ బెడ్‌రూం | : | 95.84 |
| వంటగది | : | 38.36 |
| ఒకటో బాత్రూం | : | 19.76 |
| బాల్కనీ | : | 21.76 |
| లోపలికి దారి | : | 28.32 |
| రెండో బెడ్‌రూం | : | 101.35 |
| రెండో బాత్రూం | : | 21.76 |

## బస్తీ రూపురేఖలు..!

గల్లీలు ఇలా చిన్నవిగా ఉండి.. గరీబోల్లకు అడ్డాలుగా ఉన్నంతకాలం సమస్యలు పెద్దవిగానే ఉంటాయి. నెలకు వేలు, లక్షల్లో జీతాలున్న ఉద్యోగులతో.. కోట్లలో సంపాదిస్తున్న వ్యాపారులతో గరీబోల్లను పోల్చుకుంటే తిండి, బట్ట, గూడుకు చాలా వ్యత్యాసాలు కనిపిస్తాయి. ఉప్పుకు.. పప్పుకు.. సమస్యకు మాత్రం పేదవాడికి ధనవంతుడి కంటే కొన్ని వందల రెట్లు పెద్దదిగా అనిపిస్తుంది. కేవలం అవసరాల విషయంలోనే పేదవాడు ధనికుడితో పోటీ చేయలేని పక్షంలో..

ఇక సౌకర్యాలు, విలాసాల విషయంలో అసలు ఊహించడం కూడా కష్టమే.. ఇంతేనా.. ఇలా ఎంకెన్ని రోజులు రాసుకుంటాం. మురికివాడల స్థానంలో మెరిసే అందాల ఇల్లు చూడలేమా? గుడిసెలు బస్తీ గుమ్మం దాటి వెళ్లిపోలేవా? గల్లీల్లోని గరీబోల్ల సొంతింటి కల సాకారం కాదా?

## నెరవేరిన కలలు

ఎక్కడో స్థిరపడ్డవాళ్లను ఇప్పుడు డబుల్ బెడ్‌రూమ్ ఫలించడంతో ఒకే ఇంట్లో కలిసి మెలిసి ఉండేలా చేసింది. దీనికి ఉదాహరణ: ఐడీహెచ్ కాలనీకి చెందిన మామిడాల భూదేవి. ఆమెకు ఐదుగురు కొడుకులు. పెళ్లిళ్లై ఇక్కడ ఉండే గుడిసె సరిపోక వేరుపడి ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. చేసిన కష్టం తిండికే సరిపోవడంతో వాళ్లంతా సొంతింటికి నోచుకోలేదు. కానీ ఇప్పుడు.. వాళ్ల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. వాళ్ల కష్టాలు తీరాయనిపిస్తోంది. భూదేవి తనకు వచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటితో వారి సమస్య తీరింది. రెండు బెడ్‌రూమ్‌ల్లో ఇద్దరు కొడుకులు.. హాల్లో తాము హాయిగా వుంటామని చెప్తోంది భూదేవి !




## అద్దంలా మెరిసే...!

ఇంతకుముందు ఇల్లే లేని అమ్ముగూడ హట్స్ బస్తీవాసులు ఇప్పుడు ఇల్లు లభించడంతో ఆనందంతో ఎగిర గంతేస్తున్నారు. ఈ ఇల్లు రాకపోతే తమ పరిస్థితి ఎలా ఉండేదోనని తలచుకుంటూ కొందరైతే ఏడ్చేస్తున్నారు. అది ఏడుపు అనేకన్నా.. ఆనంద భాష్పాల ప్రవాహం అని చెప్పవచ్చు. ఇంటి ముందర సైకిల్ పెట్టుకోవడానికి కూడా భరోసాలేని వాళ్లు ఈరోజు ఏకంగా పెద్ద వాహనాలనే పెట్టుకునే సౌకర్యం కలిగింది.

ఉదాహరణకు: సుభాష్‌చంద్రబోస్ కాలనీకి చెందిన ఎమ్. జ్యోతి కూలీ పనిచేస్తోంది. భర్త ఆటో డ్రైవర్. శిథిలావస్థకు చేరుకున్న తమ వాంబే ఇంటిస్థానంలో లభించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇంటిని చూసి ఆ దంపతులు సంబురపడుతున్నారు. తమ ఆటోను పార్కింగ్ చేసుకోవడానికి స్థలం.. అపార్ట్‌మెంట్ల ముందు పచ్చగడ్డితో పరచిన నేల..మూడు బోర్లు.. 24 గంటల నీటి సరఫరా కన్నా తమకు ఇంకేం కాలని వాళ్లు అంటున్నారు.

ఇలా ప్రతి ఇళ్లూ మోడ్రనైజేషన్‌గా ఉంది. ఇంట్లోకి ఎంటర్ కాగానే రెండు గదులు కనిపిస్తాయి. హాల్లో పక్కపక్కనే రెండు గదులు..వాటిలో వస్తువులు భద్రపరుచుకోవడానికి సజ్జ... దానికి అటాచ్‌మెంట్‌గా పోర్ట్‌కో ఉంటుంది. ఇంకా ఇన్నాళ్లు బాత్రూం సౌకర్యం లేక ఇబ్బంది పడ్డవారికి రెండు బాత్రూం సౌకర్యాలు కల్పించారు. ఒకటి ఇండియన్.. మరొకటి వెస్ట్రన్ కమెడ్‌లతో అమర్చి ఉంటుంది. కిచెన్‌లోనూ వస్తువులు పెట్టుకునేందుకు అరలు.. ప్లాట్‌ఫారమ్.. సజ్జె ఉంటాయి.

అపార్ట్‌మెంట్‌పై నీటి ట్యాంకు కూడా ఉంటుంది. టైల్స్‌తో కూడిన ఫ్లోరింగ్ అద్దంలా మెరుస్తూ ఉంటుంది. ఫైనల్‌గా ప్రతీ కుటుంబానికి జీవించడానికి చక్కనైన నివాసగృహం ఇది అని చెప్పవచ్చు! కానీ గతంలో ఇచ్చిన వాంబే ఇళ్లకు లబ్ధిదారుడు ముందుగా రూ.2 లక్షల 67 వేలు ఖర్చయ్యేది. దీంట్లో రూ.30 వేలు రాయితీపోగా మిగిలిన సొమ్ము నెల వారీగా లబ్ధిదారులు చెల్లించాల్సి ఉండేది. పైగా ఇళ్లు ఎలా ఉంటుందంటే.. ఒక్కటే హాలు కొంత భాగాన్ని వంట గదిగా, కొంతభాగాన్ని స్నానాల గదిగా మార్చుకోవాల్సిన పరిస్థితి. అలాంటి చీకటి రోజులను ఛేదిస్తూ ఉచితంగా సొంతింటిని సాకారం చేసుకుని బృందావనంలోకి అడుగుపెడుతున్నారు సామాన్యులు.

*(ఆధారం : ఐ&పి.ఆర్, తెలంగాణ)*

# తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవలు

భారత్ నిర్మాణ్ వాలంటీర్లను 2011 వ సంవత్సరంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. వీరు ఏ పారితోషికం ఆశించిక ఐచ్ఛికంగా పనిచేసే గ్రామీణ యువతీ యువకులు వీరిలో గ్రామాభివృద్ధి - వారి గ్రామాన్ని బాగుచేయటానికి తమ వంతు సహకారాన్ని అందించేలా గ్రామ పంచాయతీలు చొరవతీసుకొని భారత్ నిర్మాణ్ వాలంటీర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ప్రధానమంత్రి ప్రోత్సాహంతో పేద గ్రామీణులకు ప్రభుత్వం కల్పించే సహాయ సహకార పథకాలను గూర్చి వారికి తెలియచెప్పి ఉపయోగించులా అవగాహన కల్పించే యువకులతో బి.ఎన్.వీ దళంగా కొన్ని గ్రామాలలో ఏర్పాటు చేశారు.



ఆ విధంగా స్వచ్ఛందంగా ఏర్పడిన బి.ఎన్.వీలకు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వ పథకాలను గూర్చి దేశంలోని అన్ని SIRD ల ద్వారా శిక్షణనిచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది.



అందులోభాగంగా గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎ.ఎం.ఆర్ – అపార్డ్) ఆధ్వర్యంలో అప్పటి కమీషనర్ శ్రీ.కె.చంద్రమౌళి నేతృత్వంలో దాదాపు 35 వేల మంది బి.ఎన్.వీలకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నిధులతో ఉచిత శిక్షణ నివ్వడం జరిగింది.

వీరు ఆయా గ్రామాలలో చొరవ తీసుకొని త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం ఉపాధి మరియు పెన్షన్ పథకాలు, తదితర అంశాలలో ప్రజలను చైతన్యపరచి ఆయా గ్రామాలను సారా మరియు పొగాకు రహిత గ్రామాలుగా తీర్చిదిద్ది వ్యవసాయ సాముహిక కార్యక్రమాలు అమలు చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్ది ప్రభుత్వం నుండి నిర్మల్ పురస్కార్వలను పొందేలా చేశారు.

2010 లో మొదలైన ఈ బి.ఎన్.వీల కార్యక్రమాలు రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ



రాష్ట్రంలో కూడా కొనసాగేందుకు టిసిపార్డులోని సహజ వనరుల యాజమాన్య కేంద్రం వారు శ్రద్ధ తీసుకొని గ్రామజ్యోతి కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు బి.ఎన్.వీల సేవలను కూడా ఉపయోగించుకొన్నారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పలు అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను గూర్చి టిసిపార్డులో శిక్షణలో తెలియజేయదలచినతో వారు గ్రామాలకు వెళ్ళి ప్రజలలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

2015 డిసెంబర్ నాటికి తెలంగాణ రాష్ట్రంలో 20565 మంది గుర్తింపు పొందిన బి.ఎన్.వీలు ఉన్నారు. వీరు రాష్ట్రంలోని 9 జిల్లాలలో, 350 మండలాలోని, 1363 గ్రామాలలో పలు అభివృద్ధి పథకాలపై ప్రజలలో ఉచితంగా అవగాహన కల్పిస్తున్నారు.

స్థానికంగా గ్రామపంచాయతీ అధ్యక్షులకు, వార్డు సభ్యులకు చేదోడుగా వుంటూ స్వచ్ఛంధ సంస్థల సహకారంతో పనిచేయడం జరుగుతుంది. అంతేగాక సనసద్ ఆదర్శ గ్రామయోజన క్రింద పార్లమెంటు సభ్యులు, సెలబ్రిటీలు, శ్రీమంతులు ఎంపిక చేసుకున్న గ్రామలలో వాటి అభివృద్ధికి కృషిచేసి గ్రామ ప్రజలలో ప్రభుత్వ పథకాల మీద అవగాహన కల్పించేందుకు పనిచేస్తున్నారు.

ఈ విధంగా బి.ఎన్.వీలు స్వచ్ఛందంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరిని మరింత సమర్థవంతంగా పనిచేసేలా కమీషనర్ టిసిపార్డు శ్రీమతి అనిత రామచంద్రన్, ఐ.ఎ.ఎస్, సి.ఎన్.ఆర్.ఎమ్ హెడ్ శ్రీ బి.నరేంద్రనాథ్‌రావు గారు మరియు శ్రీజయపాలరెడ్డి, సీనియర్ కన్సలెంట్ పర్యవేక్షణలో బి.ఎన్.వీలకు ఉచిత కంప్యూటర్ శిక్షణను కూడా టిసిపార్డు ఏర్పాటు చేసింది.

వీరికి కంప్యూటర్ పై శిక్షణను 70 గంటలపాటు ఉచితంగాను ఏర్పాటు చేశారు. ఈశిక్షణ ద్వారా బి.ఎన్.వీలు అభివృద్ధి పథకాలను ఇంటర్నెట్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల నుండి డౌన్‌లోడ్ చేసుకొని వాటిని అవగాహన చేసుకొని ప్రజలలో ప్రచారం చేయటానికి,తమ సామర్థ్యలను పెంచుకొనేందుకు మరింత అవకాశం కల్పించేలా రూపొందించారు.

ఈ నేపథ్యంలో బి.ఎన్.వీలకు టి.సిపార్డు వారు మరింత జవసత్వాలను నింపటానికి పలు ఉచిత శిక్షణలను అందజేయడం జరుగుతుంది. అందుకు సహజవనరుల యాజమాన్య కేంద్రం అధిపతి శ్రీ బి.నరేంద్రనాథ్‌రావు కంప్యూటర్ కోర్సుపై తయారు చేసిన పుస్తకం, ఇతర మెటిరీయల్‌ను అందించి బి.ఎన్.వీలకు 6 రోజులు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇంతవరకు ఐదు (5) బ్యాచ్‌లలో 180 మందికి శిక్షణ ఇవ్వడం జరిగింది.

ఈ ఉచిత శిక్షణ వలన బి.ఎన్.వీలు తమ సామర్థ్యాన్ని పెంచుకొని ఉద్యోగ అవకాశాలు పొందటానికి మరియు ప్రజలకు ఉచిత సేవలు అందించటానికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఈ విధంగా ఏమీగాని యువతను బి.ఎన్.వీలుగా తీర్చిదిద్ది వారిని సంఘ సేవకు ఉపయోగపడేలా చేయటం ఇటీవల కాలంలో మంచి ప్రాచుర్యం పొందింది. కనుక టిసిపార్డు ఆ సాంప్రదాయలను పంచాయతీరాజ్ శాఖ సహకారంతో అమలుపరచడం మంచి పరిణామం. ఇందువలన వ్యక్తులు, కుటుంబాలు, సమాజం మరియు ప్రభుత్వాలకు బి.ఎన్.వీల ద్వారా ఉచిత సేవలు అందుతున్నాయి.

*– బి. నరేంద్రనాథ్‌రావు,*
*సెంటర్ హెడ్, సిఎన్ఆర్ఎం*

# గ్రామీణ యువతకు ఉన్నత విద్య-ఆవశ్యకత

**మనకు స్వాతంత్ర్యం వచ్చి 67 సంవత్సరాలు గడుస్తున్నా మన దేశంలోని చాలా చోట్ల గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్న దళితులు, నిరుపేదలైన వెనుకబడిన తరగతుల వారి జీవన స్థితిగతులు/ప్రమాణాలు అత్యంత దుర్లభంగా వుంటున్నాయి. దానికి ప్రధాన కారణం పేదరికం మరియు నిరక్షరాస్యత. మన తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్న వారిలో ఎక్కువ శాతం పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి కుటుంబాల నుంచి ఉన్నత చదువులకు వెళ్లే వారి సంఖ్య బహుశా వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. అందుకోసమే వీరి అభ్యున్నతిని కాంక్షిస్తూ మన తెలంగాణ ప్రభుత్వం కేజీ నుంచి పి.జీ వరకు ఉచిత విద్యను అమలుచేయడానికి ఏర్పాట్లుచేస్తున్నారు.**

మన జాతిపిత మహాత్మగాంధీజీ కలలుగన్న గ్రామీణ స్వరాజ్య స్థాపన లక్ష్యంగా అత్యంత పేదరికంలో లేదా దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న దళితులు మరియు వెనుకబడిన తరగతుల ప్రజలను అక్షరాస్యులుగా చేసి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి, చైతన్యవంతులుగా చేసి ఉన్నత చదువులపై ఆశక్తి కనబరిచేందుకు, ఆధునిక కాలానికి అనుగుణంగా వారిని దీర్చి దిద్దాలనే లక్ష్యంతో కేజీ నుంచి పి.జీ వరకు ఉచిత విద్యను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నం చేస్తోంది. ఇది ఎంతగానో హర్షించదగ్గ విషయం.

2011 జనాభా లెక్కలను పరిశీలించినట్లయితే తెలంగాణా ప్రాంతంలో (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో) యస్.సి.జనాభా 54.33 లక్షలుగా, యస్.టి.జనాభా 32.87 లక్షలుగా వుంది. వీరిలో ఎక్కువ శాతం మంది గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్న వారే. యస్.సి.ల అక్షరాస్యతా శాతం 58.90 గా వుంది, అదే విధంగా యస్.టి.ల అక్షరాస్యతా శాతం 49.51 గా వుంది. వీరిలో ఎక్కువ శాతం స్త్రీలే నిరక్షరాస్యులుగా వున్నారు. వీరి అక్షరాస్యతా శాతం కనీసం 50% గా కూడా లేదు మొత్తంగా చూస్తే తెలంగాణా ప్రాంతంలో



అక్షరాస్యతా శాతం 66.46 గా వుంది. పట్టణ ప్రాంతంతో పోలిస్తే గ్రామీణ ప్రాంతంలోని యస్.సి., యస్.టి.ల అక్షరాస్యతా శాతం చాలా తక్కువగా వుంది.

జనాభా ప్రకారం యస్.సి/యస్.టిలు మరియు వెనుకబడిన తరగతుల వారు అధికంగా ఉన్నప్పటికీ, వీరిలో అక్షరాస్యతా శాతం చాలా తక్కువగా వుంది.



కొన్ని గణాంకాల ఆధారంగా ఇప్పటికీ కూడా మనదేశంలోని గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలలో కనీస మౌళిక సదుపాయాల ను కల్పించలేకపోతున్నాం. అనేక పాఠశాలలో శిక్షణ పొందిన అధ్యాపకులు లేక, విద్యార్థులు హాజరు శాతం తక్కువగా ఉండటంచేత కొన్ని ప్రభుత్వ పాఠశాలలను మూసివేయవలసి వస్తుంది.

దాంతో అనేక మంది గ్రామీణ విద్యార్థులు ప్రవేటు పాఠశాలల్లో ఫీజులు భరించలేక, దూర ప్రాంతాలకు వెళ్లలేక పాఠశాల విద్యతోనే ఆపివేస్తున్నారు. ఇలా మధ్యలోనే చదువును ఆపివేస్తున్న వారిలో ఎక్కువ శాతం విద్యార్థినులే అధికం. ఇక వీరికి ఉన్నత చదువులపై ఏ మాత్రం అవగాహన ఉంటుందో మనం అర్థంచేసుకోవచ్చు. దీనితో పాటుగా గ్రామీణ ప్రాంతాలలో నివశించే ప్రజలలో ఎక్కువ శాతం నిరక్షరాస్యులే. దాంతో వీరికి ఉన్నత చదువులపై ఏ విధమైన అవగాహన లేక తమ పిల్లలను వారి కుటుంబ పోషణ నిమిత్తం చదువును మధ్యలోనే ఆపివేసి వారిని కూడా వ్యవసాయ పనులకు లేదా కులవృత్తిలోకి పంపించటం జరుగుతుంది.

దీంతో కనీసం గ్రామీణ ప్రాంతం నుంచి ఉన్నత విద్యను అభ్యసించడానికి వచ్చే వారి శాతం చాలా తక్కువగా వుంది. గ్రామీణ యువతను దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఉన్నత చదువుల కొరకు, విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నాయి. ఈ అవగాహనా కార్యక్రమాలతో పాటుగా వారికి ఉన్నత విద్యను అభ్యసించేందుకు

| ఉన్నత విద్యనభ్యసించాలనుకునే వారికి యు.జి.సి.వారు అందిస్తున్న స్కాలర్‌షిప్‌లు - ఫెలోషిప్‌లు | |
|---|---|
| 1) మైనారిటీ విద్యార్థుల కొరకు | మౌలానా అజాద్ జాతీయ ఫెలోషిప్ |
| 2) యస్.సి యస్.టి. మరియు వికలాంగులైన పరిశోధనా విద్యార్థుల కొరకు | రాజీవ్ గాంధీ జాతీయ ఫెలోషిప్ |
| 3) కుటుంబంలో ఒకే ఒక అమ్మాయి మాత్రమే ఉంటే | పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇందిరా గాంధీ స్కాలర్‌షిప్ |
| 4) విశ్వవిద్యాలయ ర్యాంకర్ల కొరకు | పోస్ట్ గ్రాడ్యుయేషన్ మెరిట్ స్కాలర్‌షిప్ |
| 5) పరిశోధన పూర్తయిన విద్యార్థుల కొరకు | పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్ |
| 6) ఇంజనీరింగ్ విద్యార్థుల కొరకు | జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ |
| 7) కుటుంబంలో ఒకే ఒక అమ్మాయి మాత్రమే ఉండి తను పరిశోధన చేస్తున్నట్లయితే | స్వామీ వివేకానంద స్కాలర్‌షిప్ |
| 8) వెనుకబడిన తరగతుల విద్యార్థుల కొరకు | జాతీయ ఫెలోషిప్ |

గాను ఫెలోషిప్‌లు మరియు స్కాలర్‌షిప్‌లు వంటివి మంజూరు చేస్తున్నాయి. అయితే వీటి గురించి గ్రామీణ యువతకు అంతగా అవగాహనలేకుండా పోతున్నాయి.

స్కాలర్‌షిప్‌లే కాకుండా ఆయా రాష్ట్రప్రభుత్వాలు వేరు వేరుగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారికి స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నాయి.

నేడు తెలంగాణ ప్రభుత్వం యువతకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకు వచ్చే లక్ష్యంగా జిల్లాకో విశ్వవిద్యాలయం అనే విధానం క్రింద విశ్వవిద్యాలయాలను నెలకొల్పటం జరుగుతుంది. వాటికి కావలసిన నిధులను యు.జి.సి. మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత మేరకు మంజూరు చేస్తున్నాయి.

ఈ విశ్వవిద్యాలయాలలో సాంప్రదాయక కోర్సులతో పాటుగా ఉపాధి కల్పనకు తోడ్పడే కోర్సులను ప్రవేశ పెట్టినట్లయితే గ్రామీణ యువతలో ఉన్న నిరాశక్తత అంటే తాము ఎంత ఉన్నత చదువులు చదివినా తమకు తగిన ఉద్యోగం రాదు అనే భావన నుంచి వారిని బయటకు తీసుకు రాగలినవారమవుతారు. అందుకు తగిన విధంగా విశ్వవిద్యాలయాలను తయారు చేయాలి. తాము ఉన్నత విద్య అభ్యసిస్తే ఉపాధి దొరుకుతుందనే భావనను యువతలో కల్పించాలి.

## నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యనందించాలి

ఉన్నత విద్యను బోధిస్తున్న అన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో గ్రామీణ యువతకు అందుబాటులో ఉండే విధంగా బోధన, బోధనావసతులు నాణ్యతా ప్రమాణాలతో కూడినవైవుండాలి. అంటే గ్రామీణ యువతకు అర్థమయ్యే విధంగా కొత్త, కొత్త కోర్సులను ప్రవేశ పెట్టాలి. సాంప్రదాయక కోర్సులతో పాటు వారి వారి వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు దోహదపడే అంశాలను కోర్సుల రూపంలో ప్రవేశపెట్టి వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయాలి.

## పర్యవేక్షణ కలిగివుండాలి

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న యు.జి.సి. కేంద్రం, విశ్వవిద్యాలయాలపై తగిన పర్యవేక్షణ సక్రమంగా నిర్వర్తించాలి. అన్ని విశ్వవిద్యాలయాలకు నిధులను సకాలంలో మంజూరు చేసి వాటి అమలుపై పర్యవేక్షణ కలిగివుండాలి. ప్రత్యేకించి వారు కేటాయింపులలో గ్రామీణ యువతను దృష్టిలో ఉంచుకొని కొన్ని కొత్త కోర్సులను అనగా ఉపాధి కల్పనకు తోడ్పడే వృత్తి విద్యాకోర్సులను రూపొందించి వాటికోసం తగు కేటాయింపులను బడ్జెట్‌లో ఇవ్వగలిగితే గ్రామీణ యువతరంలో ఇక నిరుద్యోగం అనే మాటే ఉండదు.



## ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి

నేటి ప్రపంచం ప్రవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ వల్ల ఒకే కుటుంబంగా పరిగణించబడుతుంది. మనదేశం కూడా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీగా అత్యాధునిక సౌకర్యాలతో, సదుపాయాలతో అంతరిక్ష నౌకాయానం, అణు ఆయుధాల తయారి వంటి వాటిల్లో ప్రపంచదేశాలలో అగ్రగామిగా నిలుస్తున్నాం. అంతే కాకుండా అత్యాధునిక సాంకేతికతను జపాన్, జర్మనీ, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నాం.

ఎలక్ట్రానిక్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను చవి చూసాం. ఇంతగా అభివృద్ధి చెందుతున్నా, ఇంకా గ్రామీణ యువతరం గ్రామాలలోనే ఉంటూ వారి సాంప్రదాయకు వృత్తుల పైనే ఆధారపడుతున్నారు. ఉన్నత విద్యపై వారు ఆశక్తి కనబరచలేక పోతున్నారు. కారణం వారికి పేదరికమే ప్రధాన సమస్యగా వుంది. ఈ పేదరికాన్ని రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను చేపడుతున్నప్పటికీ వీరికి చేరటం లేదు.

వృత్తివిద్యలో ప్రవేశాలు కల్పించి ఉపాధిని కల్పించగలిగినట్లయితే గ్రామీణ యువతకు కూడా ఉన్నత విద్యపై ఆశక్తి కలుగుతుంది. కొంతమంది గ్రామీణ యువత, ఉన్నత విద్య తమకు దక్కదనే భావనతో ఉన్నారు అలాంటి వారికి ఉన్నత విద్య యొక్క విశిష్ఠతను తెలియచేసి వారిని కూడా ప్రతిభావంతులుగా తీర్చిదిద్దగలగాలి. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా విశ్వవిద్యాలయాలలో సాంప్రదాయక కోర్సులతోపాటుగా తప్పనిసరిగా వృత్తి నైపుణ్య కోర్సుల ను కూడా ఏ ఒక్క కోర్సుకే పరిమితం చేయకుండా విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించే విద్యార్థులందరికీ ఒక పాఠ్యాంశంగా చేయగలిగితే వారికి వృత్తి విద్యపై ఆశక్తి కలుగుతుంది. అదే విధంగా వారిలో నిర్లిప్తంగా దాగివున్న ప్రతిభాపాటవాలు వెలుగుచూడటానికి విశ్వవిద్యాలయాలు ఒక వేదికగా కావాలి. అందుకు తగిన మౌళిక సదుపాయాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలి. గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు వారికి తమ తమ ప్రాంతీయ భాషలలో విద్యాబోధన జరిగే విధంగా చర్యలు చేపట్టాలి.

మన దేశంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలను అనుసంధానిస్తూ నూతన కోర్సులను ప్రవేశపెట్టి గ్రామీణ విద్యార్థులకు కూడా





అర్థమయ్యే విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తరగతులను నిర్వహించాలి. అలా చేయగలిగితే ఏక సమయంలో అనేక విశ్వవిద్యాల యాల్లో ఒకేసారి ఒక ప్రతిభావంతులైన ఆచార్యులు విద్యాబోధన చేయగలుగుతారు. అదే సమయంలో విద్యార్థులకు, అధ్యాపకులకు సూచనలు, సలహాలు కూడా చేయగలుగుతారు. గ్రామీణ విద్యార్థులతో ముఖాముఖిగా చర్చలద్వారా విద్యార్థుల అనుమానాలను కూడా నివృత్తి చేయగలుతారు.

అదే విధంగా ఇప్పటికే అనేక విశ్వవిద్యాలయాలు ఇతర దేశాల విశ్వవిద్యాలయాలతో పరస్పర ఒప్పందాలు కుదుర్చుకొని విద్యాబోధన చేస్తున్నాయి. అయితే ఇక్కడ విద్యా నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులైన గ్రామీణ యువతరానికి ఇతర దేశాలలో కూడా ఉపాధి కల్పించే విధంగా పరస్పరం అంగీకారం పొందాలి. అలా చేయగలిగితే గ్రామీణ యువతకూడా ఉన్నత చదువులపై ఆశక్తి పెంపొందించుకుంటుందని ఆశిద్దాం.

అలాగే దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. అయితే ఈ డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యక్రమాలు, బ్యాంకింగా కార్యకలాపాలను అన్నింటినీ కూడా ఆధునిక సాంకేతిక రంగంతో అభివృద్ధిచేసి పట్టణ ప్రాంతాలనే కాకుండా గ్రామీణ యువతకు కూడా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను ప్రజలముందుకు తీసుకు వస్తున్నారు. ఇలాంటి సాంకేతిక విప్లవం హర్షణీయం మరిము నేటి యవతరానికి ఎంతగానో దోహదపడే అంశం.

ఈ విధంగా సాంకేతిక రంగాన్ని ఉపయోగించుకొని నిరుపేదలైన SC/ST లకు మరియు వెనుకబడిన తరగతుల యువతకు విద్యాబుద్దులు నేర్పగలిగినట్లయితే మన దేశంలో అక్షరాస్యతా శాతాన్ని పెంపొందించుకోగలం అదేవిధంగా అనేక రంగాలలో అభివృద్ధి సాధించడానికి దోహదపడిన వారమవుతాము. ఇందుకుగాను ప్రభుత్వం మరియు స్వచ్ఛంధ సంస్థలు సంయుక్తంగా విద్యాభివృద్ధికి కృషి చేసినట్లయితే కొంత ఫలితం వుంటుందని ఆశిద్దాం.

*– డా॥ కె.నాగేశ్వర రావు, రీసెర్చి అసోసియేట్, సిడిఎస్, టిసిపార్డ్*

# సుబాబుల్ - సాగు

**సుబాబుల్ అతి త్వరగా పెరిగే బహువార్షిక మొక్క, దీనినుండి ఎక్కువసార్లు పిలకపంటను తీసుకోవచ్చు. ఈ పంట అధిక వర్షాభావ పరిస్థితులలో కూడా బాగా పెరుగుతుంది. ఈ మొక్కలు గాలిలో ఉండే నత్రజనిని వాపయోగించుకునే శక్తి గల బాక్టీరియాను వేరుబొడిపెల యందు కలిగి ఉంటాయి. ఈ మొక్కలు 600-1700 మి.మీ. వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో బాగా చురుకుగా పెరుగుతాయి.**

ఈ పంట తెలంగాణా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అనుకూలంగా పెరుగుతుంది. ఈ పంటను పశుగ్రాసం కోసం పనిముట్ల కలపకు మరియు పేపరు తయారీలో వాడే కలప గుజ్జు తయారీలో వినియోగించుకోవచ్చు. ఈ మొక్కల విత్తనాలు సులువుగా మొలకెత్తుతాయి. వ్యాపార పంటలు వలన నష్టం వాటిల్లినప్పుడు ఈ పంటను విరివిగా నాటితే అధిక లాభాలను పొందవచ్చు. సుబాబుల్‌తో పాటు ప్రత్తి, జొన్న, ఆముదం, కంది, మొదలగు పంటలను అంతర పంటలుగా మొదటి రెండు సంవత్సరాలుగా పెంచుకోవచ్చు.



## ఉపయోగాలు

* ఈ మొక్కల యొక్క ఆకులను పశుగ్రాసంగా వినియోగించవచ్చు.
* ఈ మొక్కల యొక్క కలప గట్టిగా మరియు నాణ్యంగా ఉంటుంది. దీనిని భవన నిర్మాణానికి లేదా ఫర్నీచర్ తయారీలో వాడుకోవచ్చు.
* ఈ మొక్కల తుంగలను గుంజెలు లేదా కంచె స్తంభాలుగా వాడుకొనవచ్చు.
* సుబాబుల్‌ను పచ్చిరొట్టగా ఉపయోగించినట్లయితే ఖరీదైన నత్రజని ఎరువులపై ఆధారపడటం తగ్గించవచ్చు.
* సుబాబుల్ నుండి తీసే గుజ్జు పేపరు తయారీలో వినియోగించుకోవచ్చు.
* ఈ మొక్కల ఆకులను పశుగ్రాసంగా వాడటం వలన 20 శాతం పాల ఉత్పత్తిని పెంచవచ్చును.
* మొక్కలు యొక్క కొమ్మలు ఎండిన తరువాత వంట చెఱుకుగా వాడుకోవచ్చు.

## నేలలు

ఈ మొక్కలు అన్ని రకాల తటస్థ నేలల్లో పెరుగుతాయి. ఈ మొక్కలకు లోతైన, సారవంతమైన మరియు ఎక్కువ తేమ లభ్యమయ్యే నేలల్లో సానూకూలంగా పెరుగుతాయి. ఈ మొక్కలు క్షార మరియు ఆమ్ల నేలల్లో పెరగవు. ఈ మొక్కలను బంజర భూములలోను, చెరువు గట్లపైన, పశువుల తాకిడి లేని కాలువ గట్లు పైన పొలాల గట్లపైన పెంచవచ్చు.

## రకాలు

బి.ఐ.ఎ.ఎఫ్, వారుళికంచన్, పుణెవారి కె-6 రకం మరియు ఎస్-24, ఎస్-22, ఎస్-10, కె-8, అనే రకాలు జాతీయ పశుగ్రాస అభివృద్ధి సంస్థ చే అందించబడుచున్నవి. మెట్ట నేలల్లో హవాయిన్, కామన్, హవాయిన్ జెయింట్ కె-8, మరియు కె-28 రకాలను నీటివసతి గల నేలల్లో సాగుచేయవచ్చు. హవాయిన్ జెయింట్ కె-636 రకము తక్కువ విత్తనవ్యాప్తి చెందగల లక్షణాన్ని కలిగి ఉంటుంది.

## నారు మొక్కల పెంపకం

విత్తనాలను రెండు సంవత్సరాలు లేదా ఆపైబడిన చెట్ల నుండి సేకరించాలి. విత్తనాలు దళసరి కవచంతో కప్పబడి ఉంటాయి. ఇందువలన విత్తనం త్వరగా మొలకెత్తదు. దీనికోసం విత్తనాలను



ముందుగా క్షారంలో గాని లేదా వేడినీటిలో గాని శుద్ధిచేసి వాడుకోవాలి. కృష్ణా మరియు ప్రకాశం జిల్లా రైతులు సాధారణంగా క్షారంలో విత్తనశుద్ధి చేసి వాడుకుంటారు. సర్వసాధారణంగా వేడినీటిలో విత్తనశుద్ధి చేయటం ఉత్తమం. విత్తనశుద్ధికి గానూ ఒక కిలో విత్తనాల ను బాగా మరగకాచిన రెండు లీటర్ల నీటిలో 24 గంటలు ఉంచాలి. ఆ తరువాత విత్తనాలను నాటటానికి ఉపయోగించుకోవచ్చు.

విత్తనాలను విత్తనశుద్ధి చేసిన తరువాత నారుమడులలో విత్తటానికి వరుసలు మధ్య 20 సెం॥మీ, వరుసలో 4 సెం॥మీ లోతుగా విత్తనాల ను విత్తుకోవచ్చు. పాలిథీన్ సంచులలో పేడ, ఎరువును కలిపిన మట్టిని నింపి ఒక సంచికి రెండు విత్తనాలు చొప్పున విత్తుకోవాలి.

## నాటే పద్ధతి

వేసవిలో 303045 సెం.మీ. పరిమాణం గల గుంతలను త్రవ్వితే నేల గుల్లబారి మొక్కలు నాటటానికి అనువుగా మారుతుంది. వర్షాకాల ప్రారంభంలోనే మట్టి నింపిన గుంతలలోనూ, సంచులలోనూ మొక్కల ను నాటాలి. మొక్కల మధ్య దూరం 22 మీ॥ 23 మీ॥ కాని ఐంచాలి. ఒక ఎకరాకు 1.5-2 కిలోల విత్తనాన్ని వాడుకోవచ్చు. ఎకరాకు 666-1000 మొక్కలు వరకు నాటుకోవచ్చు.

## అంతరకృషి

మొదటి రెండు సంవత్సరాలు మొక్కలు మధ్య అంతరసాగు చేసినట్లయితే మొక్కల ఎదుగుదల బాగుంటుంది.

## అంతరపంటలు

ముఖ్యంగా కృష్ణా మరియు ప్రకాశం జిల్లా వాసులు అంతరపంటగా ప్రత్తి, కంది, పశుగ్రాస పైరులను పెంచి లాభాలు పొందుతున్నారు. ఇవికాక పప్పుదినుసుజాతి పైరులను పెంచటం వలన నేలయొక్క సారాన్ని పెంచి అధిక దిగుబడిని సాధించవచ్చును.

## యాజమాన్య పద్ధతులు

నీటివసతి ఉన్న యెడల నెలకు 1 నుండి 2 సార్లు తడిస్తే దిగుబడిని పెంచుకోవచ్చు. ఈ పంట గుబురుగా పెరుగుతుంది. గనుక మొదటి రెండు సంవత్సరాలలో కొమ్మలు నరికి వంట చెఱకుగా వాడుకోవచ్చు. కలుపు నివారణ అత్యంత ఆవశ్యకమైన విషయం, మొదటి రెండు సంవత్సరాలు కలుపును నివారించటం వలన అధికలాభాలను సొంతం చేసుకోవచ్చు. అవసరాన్ని బట్టి 2-5 సంవత్సరాలు మధ్య చెట్లను నరకవచ్చు. వంట చెఱకుకు అయితే 2-3 నెలలకు 10-15 సెం. మీ॥ ఎత్తులో నరకాలి. కాగితపు గుజ్జుకు అయితే 4-5 సంవత్సరాల మధ్య నరకవచ్చు.

## దిగుబడి

వర్షాధార ప్రాంతాలతో పోలిస్తే నీటివసతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో దిగుబడి అధికంగా ఉంటుంది. వర్షాధార ప్రాంతాలలో సాధారణంగా కలప దిగుబడి ఎకరాకు సంవత్సరానికి 4-8 ఘ.మీ. వస్తుంది. నీటి వసతి ఉన్న ప్రాంతాలలో 2-3 రెట్లు అధికంగా కలప దిగుబడి ఉంటుంది. పశుగ్రాసం ఎకరానికి వర్షాధార ప్రాంతాలలో ఎకరానికి 5-10 టన్నులు, నీటివసతి ఉన్న ప్రాంతాలలో 32-36 టన్నులు వస్తుంది.

*- వై. నాగరాజు, బి. ప్రసన్నకుమార్, కె. దామోదరచారి, బి.ఎస్. సుమన్, ఇ. రాంబాబు*
*వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్*



# పాలీహౌజ్ విధానంలో కట్ పుష్పాల పెంపకం – మెళకువలు

**తక్కువ స్థలం తక్కువ శ్రమతో అధికోత్పత్తిని సాధించే దిశగా రైతులకు అందుబాటులో వచ్చింది పాలీహౌజ్ టెక్నాలజి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని చాలా ప్రాంతాల్లోని రైతులు కట్ ఫ్లవర్స్‌ను ఎక్కువగా సాగుచేస్తున్నారు. కేవలం 25 సెంట్లు విస్తీర్ణంలో సంవత్సరానికి 3-4 లక్షలు రూపాయల ఆదాయం పొందే అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ పూల సాగు పాలిహౌజ్‌లలో వ్యవసాయం రైతులకు కల్పతరువుగా మారింది. కూలీల అవసరం లేకుండా రైతు స్థాయిలోనే మొత్తం పనులు పూర్తిచేసుకునే అవకాశం ఉంది. దిగుబడి కూడా 3 నుండి 5 రెట్లు ఎక్కువ రావటం వలన రైతులు ఆర్థికంగా మంచి ఫలితాలను సాధిస్తున్నారు.**

ప్రారంభ పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. మార్కెట్ విలువ అధికంగా ఉండే పంటలను సాగుకు ఎంచుకోవలసి ఉంటుంది. వెయ్యి చ॥మీ. జర్బెరా పెంచాలంటే ప్రారంభపు పెట్టుబడి 11-12 లక్షలు వరకు ఖర్చువుతుంది. అదేవిధంగా కార్నేషన్ పూలకు 12-14 లక్షల వరకు ఖర్చువుతుంది. ఇంత పెట్టుబడి సాగు రైతుస్థాయిలో సాధ్యం కాదు గనుక రాష్ట్ర ఉద్యాన శాఖ పాలిహౌజ్‌లలో పంటల సాగుకు 50% వరకూ రాయితీ అందించి ప్రోత్సాహిస్తుంది. ఒక్కో రైతు ఒక ఎకరంలో సాగుకు ఈ రాయితీ పొందే అవకాశం ఉంది.

## మడుల నిర్మాణం

కట్ ఫ్లవర్స్ సాగులో మడుల నిర్మాణం అనేది అత్యంత కీలకం. జర్బెరా, కార్నేషన్ మొక్కలు ఒకసారి నాటితే 3 నుండి 4 సంవత్సరాల పాటు పూల దిగుబడిని ఇస్తాయి. కనుక పూర్తిగా కొత్త మట్టితో వీటి నిర్మాణం చేపట్టవలసి ఛంటుంది. దీని కోసం 1000 చ॥మీ॥ కు ఎర్రమట్టి 35 ట్రక్కులు, 10 లారీల పేడ ఎరువు, 3-4 టన్నుల వరిపొట్టు సమగ్ర పాళ్ళలో కలుపుకొని మడులను నిర్మించుకోవాలి. తయారైన మడులను ఫార్మాలిన్ ద్రావణంతో ఫ్యూమిగేషన్ అంటే క్రిమిరహితం చేయాలి. మందు ద్రావణం పోసిన 2 నుండి 3 రోజుల వరకు బెడ్లు లేదా మడులపై సన్నని పాలిథీన్ కవర్‌ను కప్పి ఉంచినట్లయితే క్రిమి కీటకాలు, శిలింధ్ర బీజాలు నశిస్తాయి. ఈ పూల రకాలు బెంగుళూరు నుండి మనం దిగుమతి చేసుకోవచ్చు. 2 అడుగల వెడల్పు, 30 సెం.మీ. ఎత్తులో ఉన్న ఈ మడులపై మొక్కలు మధ్య ఎటుచూసినా ఒక అడుగు దూరంలో జర్బెరా మొక్కలు నాటుకోవాలి. 100 చ.మీ.కు 32 బెడ్లు వస్తాయి.


## పాలిహౌజ్ నిర్మాణం

వాతావరణాన్ని మొక్కల ఎదుగుదలకు తగినట్లుగా మార్చుకునే విధానం. దీనిలో పూలు, పండ్లు, కూరగాయలు సాగుచేసుకోవచ్చు. నాణ్యతతో కూడిన ఉత్పత్తులను పొందే వీలుంటుంది. నాణ్యతయే

మార్కెట్‌లో డిమాండ్‌ను పెంచుతుంది. కనుక పాలిహౌజ్‌లలో పంటల సాగు రైతులకు మంచి ఆదాయాన్ని తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఈ పాలిహౌజ్‌లలో సంవత్సరం పొడవునా పంటల సాగును చేపట్టటానికి ఎంతోమంది రైతులు ఈ ఆధునిక విజ్ఞానం వైపు మొగ్గుచూపుతున్నారు.

ఈ పాలీహౌజ్‌ల నిర్మాణంలో అల్ట్రావయొలెట్ పాలిథీన్ సీట్లను ఉపయోగిస్తారు. వీటి మన్నిక 5 సంవత్సరాల వరకు ఉంటుంది. హౌజ్ నిర్మాణానికి అవసరమైన ఫ్రేమ్ జి.ఎ పైపులతో ఉంటుంది. వీటి మన్నిక 15 నుండి 20 సంవత్సరాలు. పాలిహౌజ్ చుట్టూ 50 శాతం షేడ్‌నెట్ ఏర్పాటు చేస్తారు. అధిక ఉష్ణోగ్రత ఉన్నప్పుడు హౌజ్ లోపల వేడిని తగ్గించేందుకు పైకప్పు క్రింది భాగంలో కూడా 50 శాతం వరకూ రైతులు షేడ్ నెట్‌ను ఏర్పాటుచేస్తారు.

లోపల ఉష్ణోగ్రత 27 నుండి 3 రోజులకు షవర్ విధానంలో మొక్కలను బెడ్లను తడపవలసి ఉంటుంది. 1000 చ॥మీ పాలిహౌజ్‌లో రోజుకు 3000 లీటర్ల నీటిని అందించవలసి ఉంటుంది. మొక్కలకు డ్రిప్ పద్ధతిలో నీటిని అందించేందుకు ప్రత్యేకంగా ట్యాంక్‌లను




ఏర్పాటు చేసుకోవటం మంచిది. మొక్కలు నాటిన 100 రోజుల నుండి పువ్వులు వికసించటం ప్రారంభమవుతాయి.

పువ్వులు చేతికందేసరికి 100 రోజుల లోపల 1 లక్ష రూపాయలు వరకు ఖర్చు అవుతుంది. పువ్వుల యొక్క రంగు ఆధారంగా కూడా దిగుబడిలో వ్యత్యాసాలను గమనించవచ్చు. జర్బెరా జాతిలో తెలుపు పూల రకం అధిక దిగుబడిని అందిస్తుంది. ఒకే రకమైన రంగు కలిగిన పూలను సాగుచేయకుండా వివిధ రంగులలో ఉన్న పూల సాగును చేపట్టినట్లయితే మార్కెట్‌లో ఈ పూలకు అధిక డిమాండ్ ఉంటుంది. ఈ పూలను కోసే విధానంలో తగు జాగ్రత్త వహించాలి. పూల యొక్క కాండాన్ని లేదా తొడిమను కుడి మరియు ఎడమవైపునకు కదిల్చి నెమ్మదిగా త్రుంచినట్లయితే పూల నాణ్యత దెబ్బతినకుండా ఉంటుంది.

పూలను కోసిన వెంటనే నీటిలో వేసినట్లయితే పూలు తొందరగా చెడిపోకుండా ఉంటాయి. జర్బెరా సంవత్సరం పొడవునా పూల దిగుబడిని ఇస్తుంది. ఒక్కొక్క మొక్క నుంచి సంవత్సరానికి 40 నుంచి 50 పువ్వుల దిగుబడి వస్తుంది. అంటే ఒక్కో మొక్క నెలకు 3 నుంచి నాలుగు పువ్వులు పూస్తుంది. అంటే సంవత్సరానికి 1000 చ.మీ. గల పాలిహౌజ్‌లో మొత్తం 6000 మొక్కలకు 2,10,000 నుంచి 2,20,000 పూల దిగుబడి వస్తుంది. ఒక్కొక్క పువ్వుకు 3 రూపాయల సరాసరి ధర లభించినా పెట్టిన పెట్టుబడి మొత్తం మొదటి సంవత్సరంలోనే వచ్చే అవకాశం ఉంటుంది.

1000 చ॥మీ॥ కార్నేషన్ పూలు సాగుచేయటానికి మొక్కల మధ్య ఎటుచూసినా 17 సెం.మీ. దూరంలో ఒక్కొక్క మడిపై నాలుగు వరుసలుగా కార్నేషన్ మొక్కలు నాటుకోవచ్చు. ఈ విధానంలో మొత్తం 24,000 మొక్కలు నాటుకోవటానికి ఆస్కారం ఉంటుంది. మొక్కలు పడిపోకుండా దీనికి నాలుగు అంచులుగా జాలీని ఏర్పాటు చేయవలసి ఉంటుంది. గనుక పెట్టుబడి 2 లక్షలు ఎక్కువ అవుతుంది. ఒక్కొక్క మొక్క నుండి సంవత్సరానికి 12 నుండి 16 పూల దిగుబడి వస్తుంది. అయినా మొక్కలు సంఖ్య ఎక్కువ ఉండటం వలన పూల దిగుబడిని ఎక్కువగా పొందవచ్చు. రేటు కూడా ఒక్కొక్క పువ్వుకు 4 నుండి 6 రూపాయలు సరాసరి ధర లభిస్తుంది.

## ఆస్టర్‌పూల సాగు

ఆస్టర్ పూల పెంపకంలో అధిక దిగుబడులు రావాలంటే నత్రజని, భాస్వరం ఎరువులు వేయాల్సి ఉంటుంది. నత్రజని ఎరువు లోపం ఉన్నట్లయితే పూల మొక్కలు చిన్నవిగా ఉండి చిన్న పూలు పూస్తాయి. పువ్వుల నాణ్యత కూడా తగ్గిపోతుందది. ఈ పూలు సాగుచేసే పొలంలో 10 నుంచి 15 టన్నుల పశువుల ఎరువు దుక్కిలో వేసి కలియదున్నాలి. దీనితోపాటు ఎకరాకు 36 కిలోల నత్రజని, 48 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాషియం ఎరువులను వేసుకోవాలి. పైపాటుగా 36 కిలోల నత్రజని వేసుకోవాలి. అవసరాన్ని బట్టి నేటి తడులు ఇవ్వాలి. ఈ మొక్కలు వేర్లు పై పొరలులోనే ఉండటం వలన నేలలో తేమశాతం ఉండేటట్లు జాగ్రత్త వహించాలి.

మొక్కలు నాటిన 70-80 రోజులలో మనం వేసిన రకాన్ని బట్టిపూలు పూస్తాయి. పూలను రెండు రకాలుగా కోసుకోవచ్చు. పూలను విడిగా కోసినట్లయితే నాణ్యత ఎక్కువగా ఉండదు. పూలను కాడలతో పాటు కోసినట్లయితే కట్ ఫ్లవర్‌గా అమ్మటానికి వీలవుతుంది. పూలు అధికంగా ఉన్నప్పుడు భూ మట్టానికి వాటిని కోసి కట్ ఫ్లవర్‌గా అమ్ముకోవచ్చు. పువ్వులను కోసిన వెంటనే కాడలతోపాటుగా నీటిలో ఉంచాలి. సాధారణంగా ఆస్టర్ పూలు సాగుచేసుకుంటే ఎకరాకు 4 నుంచి 5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మొక్కలను సాలు సాలుకి 30 సెం.మీ వరుసల మధ్య 30 సెం.మీ. ఎడం ఉండే విధంగా నాటుకోవాలి. ఆస్టర్ పూల సాగుకు 15-20 డిగ్రీల సెంటిగ్రేడ్ పగటి ఉష్ణోగ్రత లభించినట్లయితే ఎక్కువ పూల దిగుబడిని సాధించటానికి అవకాశం ఉంటుంది.

*- వై. నాగరాజు, బి. ప్రసన్నకుమార్, కె. దామోదరచారి, బి.ఎస్. సుమన్, ఇ. రాంబాబు*
*వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్*

# వ్యవసాయరంగంలో నానో టెక్నాలజీ... రెండవ హరిత విప్లవానికి నాంది

**వ్యవసాయ రంగంలో ప్రస్తుతం 'సాంకేతిక పరిజ్ఞాన స్తబ్దత' నెలకొంది అని చెప్పవచ్చు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే దశాబ్దకాలంలో అంటే, 2020 సంవత్సరానికల్లా ప్రపంచ వ్యాప్తంగా ఆహార కొరత ఏర్పడుతుందని ప్రపంచ ఆహార సంస్థ జరిపిన ఒక అధ్యయనం తెలియజేస్తుంది. ఈ పరిస్థితులను అధిగమించి పెరిగే జనాభా అవసరాలకు అనుగుణంగా ఆహారోత్పత్తిని పెంచాలంటే ఖచ్చితంగా మరొక హరిత విప్లవం రావాల్సిన అవసరం ఉంది.**

మొదటి హరిత విప్లవం తరువాత ఆహారోత్పత్తి గణనీయంగా పెరగడానికి సంకరజాతి వంగడాల రూపకల్పనే ఎక్కువగా తోడ్పడిందని చెప్పాలి. కానీ, మొక్కల సంకరీకరణకు ముఖ్యంగా మంచి గుణగణాలు కలిగిన తల్లి, తండ్రి మొక్కలు కావలసి ఉంటుంది. అయితే నానాటికీ ఈ జన్యుపరమైన వైవిధ్యంగల మొక్కల లభ్యత దాదాపు అన్ని పంటలలో తగ్గిపోతూ వస్తుందనే చెప్పాలి.

కాబట్టి ఈ పద్ధతి ద్వారా పంటల దిగుబడులు పెంచడం అంత సులువు కాదు. గడిచిన కొద్ది సంవత్సరాలుగా జన్యుమార్పిడి పంటల పై జరుగుతున్న పరిశోధనలు పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను అధిగమించడం ద్వారా దిగుబడుల విషయంలో మనదేశంలో విప్లవాత్మకమైన మార్పులనే తీసుకువచ్చాయి. అయితే జన్యు మార్పిడి ద్వారా వృద్ధి చేసిన పంటలలో కేవలం ఒకటి లేదా రెండు గుణాలను మాత్రమే వృద్ధి చేయగలిగాయే తప్ప, సగటు పంట దిగుబడిని నేరుగా పెంచడం సులవుకాదని ఋజువైంది.

ఈ పరిస్థితులలో హరిత విప్లవం సాధ్యమేనా? దీనికి సమాధానం ఏదైనా నానో టెక్నాలజీలాంటి ఒక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సగటు పంట దిగుబడులను నేరుగా పెంచినట్లయితే సమీప భవిష్యత్తులో ఆహారధాన్యాల కొరతను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

నానో టెక్నాలజీ అంటే ఒక పదార్థాన్ని అతిసూక్ష్మంగా (10–9 మీటర్ల పరిమాణం) తయారు చేయడం. ఈ పరిమాణంలో పదార్థం యొక్క భౌతిక మరియు రసాయనిక ధర్మాలు దాని మృత పదార్థం కంటే భిన్నంగా వుండి వాటి నుండి ఊహకందని అనువర్తనాలు పొందవచ్చును. నానో టెక్నాలజీ అనేది ఏ ఒక్క శాస్త్రానికి సంబంధించిన పరిజ్ఞానం కాదు. భౌతిక శాస్త్రాల పరిజ్ఞానాల కలయికగా నానో టెక్నాలజీని చెప్పవచ్చు.

ఈ సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఇప్పటికే మనం ఎలక్ట్రానిక్స్, కాస్మటిక్స్, దుస్తులు మరియు రంగుల పరిశ్రమలో మునుపెన్నడూ ఊహించని ఫలితాలను గమనించడం జరిగింది. అయితే జీవశాస్త్రంలో నానో టెక్నాలజీ పరిశోధనలు ప్రస్తుతం ఎక్కువగా వైద్యశాస్త్రంలోనే జరుగుతున్నాయి. మంచి ఫలితాలు వస్తున్నాయి.

మరి మానవజాతి మనుగడకు అవసరమైన ఆహారోత్పత్తికి సంబంధించిన వ్యవసాయరంగంలో ఈ నానో టెక్నాలజీ పరిశోధనలు ఎంతవరకు ఉపయోగపడుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే నానో టెక్నాలజీపై జరుగుతున్న పరిశోధనల సారాంశాన్ని ఆసాంతం చదవాల్సిందే.

తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నానో పరిమాణంలోని పోషకాలను ముఖ్యంగా జింకు, రాగి, ఇనుము, మాంగనీసు, కాల్షియం, మెగ్నీషియం, మరియు పొటాషియంల ను ఒక ప్రత్యేక పద్ధతిలో తయారే చేసి వివిధ పద్ధతుల్లో మరియు వివిధ మోతాదుల్లో పంటలకు అందించినపుడు చాలా ఆసక్తికరమైన ఫలితాలు వచ్చాయి. నానో పరిమాణాంలోని మూలకాల ఖచ్చితమైన ఆకారాన్ని, పరిమాణాన్ని అంచనా వేయడానికి ఐ.ఐ.టి చెన్నయ్ సహాయం తీసుకోవడం జరిగింది.




## నానో టెక్నాలజీలో పరిశోధనలు – కొన్ని ఫలితాలు

1. నానో పరిమాణంలో వివిధ మూలకాలను అంటే జింక్, రాగి, ఇనుము, మాంగనీసు, కాల్షియం, మెగ్నీషియం,



పోటాషియం మొదలగు వాటిని పంటలకు అందించేందుకు వీలుగా తయారుచేయడం.

2. నానో పరిమాణంలో మూలకాలను రసాయానికి పద్ధతుల ద్వారా తయారుచేయడం.

3. నానో పరిమాణంలో పదార్థాలను సూక్ష్మజీవులనుపయోగించి తయారుచేయడం.

4. నానో పరిమాణంలోని మూలకాలను మొక్కల యొక్క లేదా వేరు వేరు భాగాలనుపయోగించి తయారుచేయడం.

5. వేరుశనగ పంటకు నానో పరిమాణంలోని (20-25 నానో మీటర్లు) జింక్ ఆక్సైడ్‌ను అందించినప్పుడు -

- వేరు పెరుగుదల సాధారణం కంటే అధికంగా ఉన్నట్లు నిర్ధారణ అయింది.
- ఆకులలో కిరణజన్య సంయోగక్రియ బాగా జరిగింది.
- మొక్క పెరుగుదల అధికంగా ఉండి, క్రమపద్ధతిలో పెరిగినట్లుగా గమనించడం జరిగింది.
- సాధారణ జింక్ సల్ఫేటు మోతాదు కంటే 15 రెట్లు తక్కువ మోతాదులోనే నానో పరిమాణంలోని జింక్ ఆక్సైడ్‌ను పంటకు అందించినపుడు 29 శాతం అధిక దిగుబడులు వచ్చినట్లుగా గుర్తించడం జరిగింది.

6. వివిధ ఆకుకూరలను నానో పరిమాణంలోని ఇనుమును అందించినపుడు కంటి ఆరోగ్యానికి అవసరమైన ల్యూటిన్, బీటా కెరోటిన్‌లు రెండింతలు పెరిగినట్లుగా హెచ్.పి.ఎల్.సి విశ్లేషణ ద్వారా నిర్ధారణ అయ్యింది.

7. వేరుశనగ పంటలో నీటి ఎద్దడిని తట్టుకునే శక్తిని పెంపొందించే యాంటి ఆక్సిడెంట్‌లు నానో పరిమాణంలోని ఇనుమును పంటకు అందించినప్పుడు అధికమైనట్లుగా గమనించడం జరిగింది.

8. సమస్యాత్మక భూములను తిరిగి వ్యవసాయ యోగ్యమైన భూములుగా మార్చడానికి నానో పరిమాణంలోని పదార్థాలు చాలా సమర్థవంతంగా పనిచేస్తాయి. ఈ దశలో నానో పరిమాణంలోని కాల్షియంను ఉపయోగించి చౌడు నేలలను శుద్ధి చేయడానికి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పరిశోధనలు జరుగుతున్నాయి.

నానో మూలకాలను వినియోగించి ఎక్కువ కాలం విత్తనాల మొలక శాతం తగ్గకుండా నిల్వచేయడానికి కూడా పరిశోధనలు మొదలుపెట్టడం జరిగింది.

*- డా॥ యస్. త్రివేణి, డా॥ ఎ. విజయగోపాల్,*
*వై. నాగరాజు, బి. ప్రసన్నకుమార్, ఇ. రాంబాబు, కె. భవ్య*
*వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్*

# మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నూతన మార్గదర్శకాలు, కొన్ని ప్రశ్నలు, సమాధానాలు

**మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలు చేయటానికి నియమాలు తయారు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నదా?**

**అవును విభాగం 32(1)లో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టంలో తయారుచేసిన నియమాలకు అనుగుణంగా ఉండే విధంగా చట్టంలోని నిబంధనలు కొనసాగే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటన ద్వారా నియమాలు తయారు చేయవచ్చు.**

కేంద్ర ప్రభుత్వాలు గానీ, రాష్ట్ర ప్రభుత్వాలు గాని పథకాలు అమలు చేయటానికి అధికారాలు బదలాయించవచ్చునా?

అవును (నియమాలు చేసే అధికారము తప్ప) కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదా క్రిందిస్థాయి అధికారికి ప్రకటన ద్వారా మరియు రాష్ట్ర ప్రభుత్వాలు క్రిందిస్థాయి అధికాంరులకు విభాగం 26 ప్రకారం అధికారాలు బదలాయించవచ్చును.

మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టంలో ఏవిధంగా కూర్పు (పారాడిగమ్) బదిలీ అయింది?

ప్రతి రాష్ట్రంలో ఉపాధి డిమాండ్ ఆధారంగా మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం డిమాండును అనుసరించి వనరులను కేంద్రం నుండి రాష్ట్రానికి బదిలీ చేస్తుంది. చేపట్టిన పనులకు కూలీ చెల్లించటంలో ఆలస్యమైనా, పని చూపించి ఉపాధి కల్పించటంలో విఫలమైనా నిరుద్యోగభృతి మరియు నష్ట పరిహారం చెల్లించటానికి చట్టపరమైన హామీని కలిగిస్తుంది.



| మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం మరియు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం మధ్యగల సంబంధం ఏమిటి? | |
|---|---|
| మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం | మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం |
| మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకానికి పునాది. ఇది ఉపాధి హామీని కల్పిస్తుంది. | మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం ద్వారా చట్టాన్ని అమల ుచేసి ఉపాధి హామీని కల్పించటానికి ఏర్పాటైనటువంటిది మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం. |
| మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం భారత పార్లమెంటు చేత ఆమోదం పొందింది. | మహాత్మాగాంధీ ఉపాధీ హామీ పథకం రాష్ట్ర అసెంబ్లీ చేత ఆమోదించబడింది. |
| మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం 2005 లో కేంద్ర ప్రభుత్వం కొన్ని లక్షణాలు మరియు నిబంధనలు ఉపాధి హామీ కోసం సృష్టీకరించినది. | మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టంలోని అన్ని లక్షణాలు రాష్ట్ర ప్రభుత్వంమహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో షెడ్యూలు 1లో ఉపాధి హామీ నిబంధనలు షెడ్యూలు 2లో చేర్చినది. |
| మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టానికి నిబంధనలలో సవరణలు చేయు అధికారం కేంద్రప్రభుత్వానికి ఉంటుంది. | మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో నిబంధనల సవరణలు చేసే అధికారం సంబంధిత రాష్ట్రాలకు ఉంటుంది. |
| మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం భారత ప్రభుత్వ అసాధారణ రాజపత్రంలో జాతీయ చట్టసభలు ద్వారా ప్రకటించబడింది. | మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం సంబంధిత రాష్ట్రాల అధికార రాజపత్రం ద్వారా ప్రకటించబడింది. |
| మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం 2005 సెప్టెంబరు 7న ప్రకటించబడింది. | మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం వివిధ రాష్ట్రాలలో వివిధ తేదీలలో ప్రకటించబడింది. అయితే ఈ ప్రకటలన్నీ మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం ప్రకటించిన సంవత్సరంలోపు ప్రకటించబడినవి. |

చేపట్టవలసిన పనులకు సంబంధించి ప్రణాళికలు మరియు నిర్ణయాలు, పనుల ఎంపిక క్రమము,స్థల ఎంపిక మొదలగు విషయాలన్నీ గ్రామ సభ బహిరంగ సమావేశాలలో నిర్ణయించబడి గ్రామ పంచాయతీలో ఆమోదము పొందుతుంది. సంబంధిత లబ్ధిదారులకు ఆస్తుల నిర్వహణపై జవాబుదారి తనాన్ని కలిగించే సామాజిక తనిఖీ అనునది ఒక వినూత్న అంశం.

గతంలో ఉన్న కేటాయింపు ఆధానిత ఉపాధి కల్పిత కార్యక్రమాలకు ఇది భిన్నమైనది. సమగ్ర సహజ వనరుల నిర్వహణ మరియు జీవనోపాధుల అశావహకల్పనతో గతంలో ఉన్న ఉపాధికల్పిత కార్యక్రమాలకు భిన్నంగా సంచలనాన్ని కలిగించిన పథకం మహాత్మాగాంధీ ఉపాధి హామీ కార్యక్రమం.

### కీలక లబ్ధిదారులు – పాత్రలు మరియు బాధ్యతలు

మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో కీలక లబ్ధిదారులు ఎవరు?

*ఈ క్రింది వారు కీలక లబ్ధిదారులు*

1. కూలీ కోరుకునేవారు.
2. గ్రామ సభ (జి.ఎస్)
3. మూండంచెల పంచాయతీ రాజ్ సంస్థలు (పిఆర్ఐస్) ప్రత్యేకించి గ్రామపంచాయతీ (జిపీ)
4. మండల స్థాయిలో కార్యక్రమ అధికారి
5. జిల్లా కార్యక్రమాల సమన్వయ అధికారి(డిపిసి)
6. రాష్ట్ర ప్రభుత్వం
7. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ
8. పౌర సమాజం
9. ఇతర లబ్ధిదారుల (లైను డిపార్టుమెంట్లు, ఏకబిందు శాఖలు, స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జిఎస్)

*మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో కూలి కోరుకునే వారికి హక్కుల అర్హతలు ఏమిటి?*

1. దరఖాస్తు నమోదు చేయుట.
2. ఉపాధి కార్డు పొందుట.
3. ఇచ్చిన దరఖాస్తుకు పని కల్పించుటకు తేది వేయబడిన చీటి ఇచ్చుట..
4. పని కోసం దరఖాస్తు చేసిన కాలపరిమితి మరియు పని ఎంపిక చేసుకొనుట..
5. దరఖాస్తు ఇచ్చిన పదిహేను దినాలలో పని కల్పించటం లేదా ముందుగా దరఖాస్తు ఇచ్చి వుంటే పని కోరుకొనిన తేది నుండి ఏది తరువాత అయితే అది.
6. పని చేస్తున్న స్థలంలో త్రాగునీరు ప్రథమచికిత్స, అలసట తీర్చుకొనుటకు పాక సౌకర్యాలు.
7. 5 కి.మీ పరిధికి మించిన దూరంలో పని కల్పించిన 10 శాతం ఎక్కువ కూలికి హక్కు.
8. వారి వారి ఉపాధి కార్డులలో నమోదు చేసిన ఉపాధికి సంబంధించి మొత్తము సమాచారము మరియు మస్టర్ రోలు పరీక్షించుకొను హక్కు.
9. పని పూర్తియైన వారము లేదా గరిష్టంగా 15 దినములు మించకుండా కూలీ పంపిణీ చేయించుకొనుటకు.
10. దరఖాస్తు ఇచ్చిన పదిహేను దినాలలోపు పని కల్పించేలేని పక్షంలో లేదా ముందుగా దరఖాస్తు ఇచ్చినప్పుడు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు పని కల్పించలేకపోయినా ఏది ఆలస్యమైతే అది అయినపుడు నిరుద్యోగభృతి పొందు హక్కు.
11. పని చేయుచున్న సమయములో గాయపడినచో వైద్యంతో పాటు అవసరమైన వైద్యశాల ఖర్చులు, ఒకవేళ వికలాంగుడైనగాని, మరణించిన గాని ఎక్స్‌గ్రేషియా చెల్లింపుకు హక్కు.

మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో గ్రామసభ పాత్ర ఏమిటి?

*ఈచట్టము ప్రకారము గ్రామ సభకు ఈ క్రింది హక్కులు బాధ్యతలు ఉంటాయి.*

1. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం క్రింద చేపట్టే పనులు ప్రాధాన్యతా క్రమం నిర్ణయించుట, చేపట్టవలసిన పనులు సిఫారుసు చేయటంలో గ్రామనిర్ణయమే అంతిమ నిర్ణయం.
2. గ్రామసభలలో పనులు జరుగు విధానమును అజమాయిషి చేయుట.
3. సామాజిక తనిఖీ నిర్వహించటానికి ఇది ప్రాథమిక వేదిక. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టానికి సంబంధించి గ్రామ పంచాయతీ ప్రాంతంలో అమలు జరుగుచ్చు పనులు గ్రామ పంచాయతీతో సహా అమలు సంస్థల సమాచారం పొందటానికి నివాసులందరికి ఇదే వేదిక.

*మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో గ్రామ పంచాయతీ పాత్ర ఏమిటి ?*

ఈ క్రింది కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ బాధ్యత వహించును.

1. నమోదు చేసుకొనుటకు ధరఖాస్తులు తీసుకొనుట
2. నమోదైన ధరఖాస్తును పరిశీలించుట
3. కుటుంబాల నమోదు.
4. ఉపాధి కార్డులు జారీ చేయుట
5. పనుల కొరకు ధరఖాస్తులు తీసుకొనుట
6. దరఖాస్తులకు పని తేది వేసిన చీటిలు ఇచ్చుట.
7. దరఖాస్తు సమర్పించిన పదిహేను రోజులలోపు పనుల కేటాయింపు లేదా ముందుగా దరఖాస్తు ఇచ్చి ఉన్నట్లతే కోరినప్పుడు పని కల్పించుట ఏది ఆలస్యమైతే అది. అమలు సంస్థతో సంబంధము లేకుండా.
8. పని అవసరత అంచనా కొరకు ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించుట
9. పనుల గుర్తింపు ప్రణాళిక రచించటం, ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయిస్తూ ప్రాజెక్టుల షెల్ఫును అభివృద్ధిపరచుట, కార్యక్రమ అధికారి పరిశీలనకు మరియు ఆమోదానికి ఈ జాబితా పంపుట.
10. జరుగుచున్న పనులకు అవసరమైన సాంకేతిక ప్రమాణాలు మరియు కొలతలు వేసుకొనుట.
11. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టంలో నిర్వహణ మార్గదర్శకాలు 2013 వరకు 10వ అధ్యాయంలో స్పష్టపరచిన రీతిగా రికార్డుల నిర్వహణ.
12. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన ఫార్మెట్లలలో లెక్కల నిర్వహణ, వినియోగ ధృవీకరణలు సమకూర్చుట.
13. తన అధికార పరిధిలో పథకాల అమలు, వాస్తవిక, అంకెలతో, లక్ష్యాలతో కూడుకొన్న వార్షిక నివేదిక తయారి మరియు ప్రజల కోరిన మీద చెల్లింపుపై వారికి అందజేయుట.
14. అవగాహన కల్పన మరియు సామాజిక సమీకరణ.
15. సామాజిక తనిఖీ మరియు ప్రణాళికల కొరకు గ్రామ సభ సమావేశపరచుట.
16. మస్టర్‌రోల్స్, బిల్లులు, ఓచర్లు, కొలతల పుస్తకము, మంజూరు ఉత్తర్వుల ప్రతులు మరియు ఇతర సంబందించిన అకౌంటు

పుస్తకాలుతో సహా సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు సామాజిక తనిఖీ చేయుట కొరకు అందించాలి.

17.గ్రామ స్థాయిలో అమలును అజమాయిషీ చేయుట.

18.పూర్తయిన మరియు జరుగుచున్న పనుల వివరాలు (చెల్లించిన కూలీ మరియు వస్తువుల భాగం పని జరుగుచున్న స్థలంలో ఉపాధి కార్డుల నంబర్లతో సహా పని చేసిన వ్యక్తుల పేర్లు, కూలీ చెల్లించిన పని చేసిన దినాలు ప్రతి ప్రాజెక్టు కొరకు కొనుగోలు చేసిన వస్తువుల యొక్క ధర మరియు నాణ్యత,గ్రామపంచాయతీ కార్యలయములో మరియు ప్రధాన పబ్లిక్ స్థలాలలో సరఫరా చేసిన సంస్థపేరుతో సహా వివరాలు తెలుపాలి.

19.తనికీలో సృష్టీకరించిన పథకాల నియమాలు సామాజిక తనిఖీ యూనిట్‌కు అందజేయాలి.

*గమనిక:* ఎక్కడైతే రాజ్యాంగంలోని 2వ భాగం వర్తించదో సంబంధిత రాష్ట్రాల స్థానిక మండలాలు లేదా సాధికార సంస్థలు అమలులో ఉన్న బ్యాంకులలో మదుపు చేయాలి.

మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో కార్యక్రమ అధికారి పాత్ర మరియు భాధ్యతలు ఏమిటి?

మండల స్థాయిలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకానికి కార్యక్రమ అధికారి సమన్వయ కర్తగా ఉంటాడు.దరఖాస్తు చేసుకొనిన 15 రోజులలోపు ఎవరెవరికి పని కల్పించారో ధృవపరచుకొనుట కార్యక్రమ అధికారి ప్రాథమిక భాధ్యత.కార్యక్రమ అధికారి ఇతర విధులు ఈక్రింది విధంగా ఉండును.

1. గ్రామ పంచాయతీలో చేరిన అన్ని ప్రాజెక్టుల ప్రతిపాదనలు సూక్ష్మ పరిశీలన చేసిన తరువాత మండల ప్రణాళికలో ఏకీకృతం చేయాలి.దానిని జిల్లా పంచాయతీ సూక్ష్మ పరశీలనకు ఏకికృతం చేయుటకు సమర్పించాలి.
2. బ్లాకులో ప్రతి గ్రామ పంచాయతీ పని అవసరతను,మండల ప్రణాళికలో, పనుల నుండి ఉత్పన్నమౌతున్న ఉపాధి అవసరాల ను సరిచూచుట.
3. పని అవసరత అంచనాకు బేస్ లైన్– సర్వే ధృవీకరించుకొనుట.
4. మండలాలలో గ్రామ పంచాయతీ మరియు ఇతర అమలు చేయు సంస్థలు చేపట్టిన పనుల అమలును పర్యవేక్షించుట మరియు అజమాయిషి వహించుట.
5. సకాలంలో ఉపాధి కల్పించలేని వారికి నిరుద్యోగ భృతి చెల్లింపు మరియు కూలీలకు కూలి చెల్లింపు సకాలంలో చక్కగా జరుగుచున్నట్లు ధృవీకరించుకొనుట.
6. అందుకున్న వనరులు,విడుదల చేసిన మరియు వినియోగించిన వాటి లెక్కలు సరిగా నిర్వహించుట.
7. సామాజిక తనిఖీ నిర్వహణ మరియు అవసరమైన కార్యక్రమాలు పదే పదే గర్తు చేయుట.
8. మండల స్థాయిలో ఫిర్యాదు పరిష్కారం,కార్యక్రమ అధికారి ఫిర్యాదు పుస్తకములో ప్రతి ఫిర్యాదు నమోదు చేసి ఫిర్యాదు సంఖ్య తేది ఇవ్వాలి.చట్టము విభాగము 23(6) లో నిర్ణయించిన విధంగా కార్యక్రమ అధికారి తన అధికార పరిధిలోకి వచ్చు ఏ ఫిర్యాదునైనా 7 దినములలో పరిష్కరించాలి.తన అధికార పరిధిలోకి రాకుండా ఏ ఇతర సాధికార సంస్థ పరిష్కరించవల సిన పిర్యాదు అయితే కార్యక్రమ అధికారి దానిపై ప్రాథమిక విచారణ జరిపి ఆవిషయమును సంబంధించిన సాధికార సంస్థకు 7 దినములలోపుగా పంపాలి.ఆవిషయాలను పిర్యాదుదారుకు తెలియజేయాలి.
9. అమలు చేయు సంస్థకు చెందిన ఉపాధి కార్డుల రిజిస్టరు,ఉపాధి రిజిస్టరు,పని రిజిస్టరు,గ్రామసభ తీర్మానాలు,పరిపాలన పరమైన,సాంకేతిక,ఆర్థికపరమైన మంజూరు ఉత్వర్వులు, మస్టరురోలు చీటీలు ఇచ్చు రిజస్టరు,మస్టర్‌రోలు,కూలీ చెల్లింపు అక్విటెన్సు(ప్రతిపనికి) వస్తువుల బిల్లులు మరియు ఓచర్లు (ప్రతిపనికి) కొలతల పుస్తకము,ఆస్తుల రిజిష్టరు,గత సామాజిక తనిఖీ నివేదికపై తీసుకున్న చర్యలు,ఫిర్యాధుల మరియు గ్రీవెన్సు రిజిస్టరు మొదలుగా గల అవసరమైన సమాచారము అందించినట్లు ధృవీకరించుకొనుట.
10. సామాజిక తనిఖీ చేయుటకు సామాజిక తనిఖీ యూనిట్‌కు అవసరమైన డాక్యుమెంట్లు అందజేసినట్లు ధృవీకరించుకొనుట. కోరుకున్న ఫార్మెట్లలోనే ఫోటో కాపీలు గ్రామ సభ సమావేశ షెడ్యూలకు కనీసం 15 రోజుల ముందుగానే సామాజిక తని యూనిట్‌కు అందజేయుట.
11. పంచాయతీలోని ప్రతి క్లస్టరులో అవసరమైన సాంకేతిక సహాయం అందించుటకు క్లస్టర్ స్థాయి ఫెసిలిటేషన్ దళము ఏర్పాటు చేయుట.
12. క్లస్టర్ ఫెసిలెటేషన్ దళము ద్వారా గ్రామ సభలకు సాంకేతిక సహాయము అందజేయుట.
13. కూలీలకు సకాలంలోను క్రమంగాను చెల్లింపు జరిగించుటకు బ్యాంకులలో,పోస్టాఫీసులలో కొత్త ఖాతాలు ప్రారంబి ంచుటకు మధ్యవర్తిత్వము వహించుట,అన్నిరకాల ఉత్తర ప్రత్యుత్తరాలకు,సమాచారానికి గ్రామ పంచాయతీకి బ్లాకులకు మధ్య,బ్లాకుకు జిల్లాకు మధ్య మధ్యవర్తిత్వము వహించుట.
14. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకము మండలం అమలు చేయుటలో పాల్గొన్న పౌర సోసైటి సంస్థలతో నెలవారి సమావేశాలు నిర్వహణ.

*మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకములో కార్యక్రమ అధికారి ఎవరికి హోదా కల్పిస్తారు?*

తరుచుగా బ్లాకు స్థాయిలో తహాసిల్ధారు లేదా మండల అభివృద్ధి అధికారికి కార్యక్రమ అధికారి హెూదా కల్పిస్తారు.ఎక్కువగా యస్.సి.లు,యస్.టి.లు,భూమిలేని నిరుపేద కూలీలు,

ఉన్నచోట మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టంలోని కార్యక్రమలలకు నిబద్ధత లేదా అంకితభావము కలిగిన కార్యక్రమ అధికారి ఉండాలి. మహాత్మాగాంధీ ఉపాధీ హామీ చట్టమునకు ప్రత్యక్ష సంబంధము కలిగిన బాధ్యతలు కార్యక్రమ అధికారికి కూటాయించరాదు.

మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో ఇంటర్మీడియట్ పంచాయతీ కార్యక్రమాలు ఏమిటి?

*ఇంటర్మీడియట్ పంచాయతీ స్థాయిలో కార్యక్రమాలు ఈ క్రింది విధంగా ఉండును.*

1. మండల స్థాయి ప్రణాళిక ఆమోదించి జిల్లా స్థాయి అంతిమ ఆమోదము కొరకు జిల్లా పంచాయతీకి పంపుట.
2. మండల స్థాయిలో,గ్రామ పంచాయతీ స్థాయిలో చేపట్టిన ప్రాజెక్టుల ను పర్యవేక్షించుట,ఆజమాయిషీచేయుట.
3. ఎప్పటికప్పుడు రాష్ట్ర మండలి కేటాయించిన కార్యక్రమాల కొనసాగించుట.
4. ఎక్కడైతే రాజ్యాంగంలోని 9 వ భాగం వర్తించదో సంబంధిత రాష్ట్రాల స్థానిక మండలాలు లేదా సాధికార సంస్థలు అమలులో ఉన్న బాధ్యతలతో మదుపు చేయాలి.

*మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో జిల్లా కార్యక్రమాల సమన్వయకర్త ఎవరు?*

జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి లేదా జిల్లా కలెక్టరు లేదా అదే హెూదా కలిగిన జిల్లా స్థాయి అధికారికి రాష్ట్ర ప్రభుత్వం డిపిసి హోదా కల్పిస్తుది. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం 2005 లో గల నిబంధనలకు అనుగుణంగా అందులో ఉన్న నియమాలు మరియు మార్గదర్శకాల మేరకు పథకమును జిల్లాలో అమలుపరచు బాధ్యత డిపిసి కలిగి ఉన్నాడు.

*మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో డిపిసి కార్యక్రమాలేమిటి?*

**డిపిసి కార్యక్రమాలు :**

1. జిల్లా పరిషత్ కార్యక్రమాల నిర్వహణలో సహకరించుట.
2. ఇతర అమలుచేయు సంస్థల నుండి అందిన ప్రాజెక్టు ప్రతిపాదనలతో మండల పరిషత్‌కు అందిన ప్రణాళికలు కలిపి ఏకీకృతం చేసి జిల్లా ప్రణాళిక జిల్లా పంచాయతి ఆమోదము కొరకు చేర్చుట.
3. షెల్ఫు ఆఫ్ ప్రాజెక్టులకు సకాలములో మంజూరు ఇచ్చుట.
4. మండల స్థాయిలో లేదా జిల్లా స్థాయిలో ఏమైనా క్రొత్త ప్రాజెక్టులు మరలా పంపబడి పరిపాలన మంజూరు ఇచ్చేలోపు సంబంధిత గ్రామసభల ద్వారా ప్రాధాన్యత క్రమము నిర్ణయము, ఆమోదము ధృవీకరించుట.
5. సకాలంలో నిధుల విడుదల మరియు వినియోగము ధృవీకరించుకొనుట.
6. చట్టప్రకారము ఉపాధి కోరుకొనిన వారు వారి అర్హత ప్రకారము పనుల కల్పన ధృవీకరించుకొనుట.
7. మహాత్మాగాంధీ ఉపాది హామీ చట్టమునకు సంబంధించిన పనులు అమలు చేయు సంస్థల పని విధానమును,కార్యక్రమ అధికారి పని విదానమును పర్యవేక్షించుట,అజమాయిషి చేయుట,సమీక్షించుట.
8. మస్టర్‌రోల్సు మరియు పనుల అభివృదిద్ధి క్రమపద్దతితో తనిఖీ చేయుట,తనికీ చేయుటకు గల కారణము.
9. నిధుల దుర్వినియోగమునకు సంబంధించి ప్రాథమిక ఆధారము ఉన్న ప్రతి కేసు విషయములో ఎఫ్.ఐ.ఆర్.ఫైల్ చేసినట్లు ధృవీకరించుకొనుట.
10. జిల్లా అంతటా ప్రాజెక్టు అమలు సంస్థలను నియమించుట కనీసము 50 శాతము విలువ కలిగిన పనులను దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయతీలకు ప్రాజెక్టు అమలు సంస్థలను నియమించుట.
11. జిల్లా అంతటా మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టమును గురించి ప్రచారము మరియు సమాచార విద్యను సమన్వయము చేయుట.
12. జిల్లాలో గల వివిధ లబ్ధిదారులకు సామర్ధ్యపు పెంపు శిక్షణ కొరకు వార్షిక ప్రణాళికలు తయారు చేయుట.
13. రాష్ట్ర ప్రభుత్వానికి క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు నివేదికలు పంపుట.
14. ప్రతి ఆరు నెలలకొకసారి అన్ని గ్రామపంచాయతీలలో సామాజిక తని నిర్వహించినట్లు,సామాజిక తని నివేదికల కొరకు పదేపదే గుర్తు చేస్తున్నట్లు ధృవీకరించుకొనుట.
15. ఉపాధికార్డుల జారీతో సహా పని కొరకు ధరఖాస్తుల నమోదు,పని కేటాయింపు,కూలీ చీటీల తయారు,నిధుల బదిలీ ఉత్తర్వుల ౦,జరుగుతున్న పనులకు సంబంధించిన నమోదులు,కూలీలు చెల్లించుటలో ఆలస్యము,నిరుద్యోగభృతి మొదలగు అన్ని విషయాల ౦,అన్ని లావాదేవీలు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకము సాఫ్ట్ ద్వారా మాత్రమే జరుగుచున్నట్లు ధృవీకరించుకొనుట.
16. పనులకు సంబంధించిన అన్ని వివరాలు అనగా షెల్స్ ఆఫ్ వర్కులు,అమలులో గ్రామపంచాయతీల సమన్వయము,పనులు జరుగుచున్నపుడు వివిధ స్థాయిలలో తీసిన ఛాయ చిత్రములు

అవసరమైన ప్రతి స్థాయిలలో ఎన్ఆర్ఇజిఎ సిబ్బంది ద్వారా మాత్రమే నమోదైనట్లు ధృవపరుచుకొనుట,పూర్తయిన పనికి సంబంధించిన సమాచారము సాధ్యమైనంత వరకు వెంటనే నమోదు చేయాలి.అయితే ఏ పరిస్థితులలో కూడా భౌతికంగా పూర్తయిన రెండు నెలల లోపల నమోదు చేయాలి.

17. అమలు చేయు సంస్థ ద్వారా అందిన నిధులు మరియు జిల్లా స్థాయి సంస్థల ద్వార,పంచాయతీల ద్వారా అందిన నిధులతో సహ అన్ని నిధులు,నిధులు అందిన రెండు రోజులు మించకుండా ఎన్ఆర్ఇజిఏ సాఫ్ట్వేర్ ద్వారా నమోదు చేయాలి.

18. జిల్లాలో అన్ని లైను డిపార్టుమెంట్లతో సహా సంబంధిత అధికారులందరూ కోరుకున్న ఎంట్రీలు ఎన్ఆర్ఇజిఏ సాఫ్టవేర్ ద్వారా మాత్రమే జరుగుచున్నట్లు ధృవీకరించుకొనుట.

*మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం క్రింద జిల్లా పంచాయతీ బాధ్యతలు ఏమిటి?*

**జిల్లా పరిషత్లు ఈక్రింది వాటికి బాధ్యత వహిస్తాయి.**

1. జిల్లాలోన్ని అన్ని మండలాల వార్షిక ప్రణాళికలను జిల్లా ప్రణాళికలో ఏకికృతం చేయుట.
2. గ్రామ సభ ముందస్తు ఆమోదముతో ఇంటర్ బ్లాకు పనిగా చేర్చి ఇచ్చుట మంచి ఉపాధి వనరుగా ఉంటుంది.
3. జిల్లాలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకము పర్యవేక్షించట అజమాయిషీ చేయుట.
4. ఎప్పటికప్పుడు రాష్ట్ర మండలి కేటాయించు కార్యక్రమాల కొనసాగి ంపు.

*రాష్ట్ర ఉపాధి హామీ మండలి (ఎస్.ఇ.జి.సి) పాత్ర ఏమిటి?*

రాష్ట్ర ఉపాధి హామీ మండలి ఈక్రింది పాత్రను మరియు బాధ్యతలు కలిగి వున్నది.

1. పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చుట.
2. అజమాయిషిని సమీక్షించుట,అసంతృప్తుల నివారణ యంత్రాంగము అభివృద్ధికి సలహాలిచ్చుట.
3. రాష్ట్రంలో పథకము అజమాయిషీ ముల్యాంకనము చేయుట.
4. చట్టంలోని 1వ షెడ్యూలు,1 బి పేరా (16) ప్రకారము, సిఫారసు చేయబడిన పనుల ప్రతిపాధనలు కేంద్ర ప్రభుత్వానికి పంపుట.
5. ఈ చట్టము మరియు అందులోని పథకాలకు విస్తృత ప్రచారము, సమాచారము చేయుట.
6. రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రాష్ట్ర శాసనసభ ముందు ఉంచుటకు వార్షిక నివేదిక తయారు చేయాలి.

*మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకములో రాష్ట్ర ప్రభుత్వ భాధ్యతలు ఏమిటి?*

**రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతలు ఈక్రింది విధంగా ఉన్నాయి.**

1. చట్టములోని 32 వ సెక్షను క్రింద రాష్ట్ర బాధ్యతలకు సంబంధించి నియమాలు తయారు చేయుట.
2. రాష్ట్రానికి గ్రామీణ ఉపాధి హామీ పథకమునకు ప్రకటించుట, అభివృద్ధి పరుచుట.
3. ఎస్ఇజిసి ఏర్పాటు.
4. వృత్తిపరంగా నిబద్దత కలిగిన చాలినంత మంది అధికారులతో రాష్ట్రస్థాయిలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకము అమలు సంస్థను ఏర్పాటు చేయుట.
5. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం అమలు క్రమంలో సామాజకి తనిఖీకై నిబద్ధత కలిగిన వారితో రాష్ట్ర స్థాయి మహాత్మాగాంధీ ఉపాది హామీ పథకం సామాజిక తనిఖీ సంస్థ లేదా డైరెక్టరేటును ఏర్పాటు చేయుట.
6. రాష్ట్ర ఉపాధి హామీ నిధి ఏర్పాటు చేయుట (ఎస్.ఇ.జి.ఎఫ్)
7. రివాల్వింగ్ నిధిగా ఉపయోగపడేవిధంగా ఆర్థిక సంవత్సర ప్రారంభంలోనే మహాత్మాగాంధీ ఉపాధీ హామీ పథకము రాష్ట్ర వాటా ఎస్.ఇ.జి.ఎఫ్ కు విడుదల చేయుట.
8. రాష్ట్ర, జిల్లా మరియు క్లస్టర్ స్థాయిలో అవసరమైనచోట మహాత్మాగాంధీ ఉపాధీ హామీ చట్టమును అమలుకు అంకిత భావం కలిగిన వ్యక్తులను కార్యక్రమ అధికారిగా ఇతర రాష్ట్ర సిబ్బందిగా ప్రత్యేకించి ఉపాధి హామీ సహాయకుడుగా (గ్రామరోజ్గార్ సహాయక్) గా నియామకము ధృవీకరించుకొనుట.
9. పథమును సమర్థవంతంగా అమలు చేయుటకు ఆర్థికి మరి యు పరిపాలన అధికారాలు డిపిసికి కార్యక్రమ అధికారికి బదలాయింపు అవసరమని భావించాలి.
10. శిక్షణకు.సాంకేతిక సహాయము కొరకు,మరియు నాణ్యతకు నియమించిన పద్దతుల కొరకు వృత్తిపరమైన సంస్థల నెట్వర్కు ఏర్పాటు.
11. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకము అమలు జరుగుతున్న విధానమును ఫలితాలను మూల్యాంకనము, అజమాయిషీ, పరిశోధన సమీక్ష క్రమం తప్పకుండా జరుగుతుండాలి.
12. అన్ని స్థాయిలలో పథకము పారదర్శకతతో జవాబుదారితనము ఉన్నట్లు, ధృవపరుచుకొనుట.
13. రాష్ట్రమంతటా మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టముపై సాధ్యమైనంత వరకు విస్తృత అవగాహన కల్పించాలి.

14. నెలకొకసారి రాష్ట్ర,జిల్లా,మండల స్థాయిలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టము క్రింద కార్యకర్తలను సమీకరించి పౌర సోసైటి సంస్థలతో సమావేశ ఏర్పాటు చేయుట.

15. చట్టములో నిర్దేశించిన విధానము,నియమాలు,మార్గదర్శకాలతో సమ్మతించినట్లు ధృవపరుచుకొనుట.

*కేంద్ర ఉపాధి హామీ మండలి పాత్ర మరియు బాధ్యత ఏమిటి?*

**చట్ట ప్రకాము కేంద్ర ఉపాధి హామీ మండలి పాత్ర మరియు బాధ్యతలు ఈక్రింది విధంగా ఉండును**

1. మూల్యాంకనము మరియు ఆజమాయిషి,కేంద్ర వ్యవస్థ ఏర్పాటు.
2. చట్టము అమలుకు సంబంధించిన హామీతో కేంద్ర ప్రభుత్వమునకు సలహా ఇచ్చుట.
3. ఆజమాయిషి మరియు అసంతృప్తులను తొలగించు యంత్రాంగమును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చేయవలసిన అభివృద్ధిపై సిఫారుసు చేయుట.
4. ఈపథకము యొక్క సమాచారమును,గూర్చి ప్రజలలో విస్తృతంగా ప్రచారం.
5. ఈచట్టము అమలును గూర్చి కేంద్ర ప్రభుత్వము పార్లమెంటు ముందు ఉంచడానికి వార్షిక నివేదిక తయారు చేయుట.

*గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పాత్ర మరియు బాధ్యతలు ఏమిటి?*

**గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బాధ్యతలు ఈక్రింది విధంగా ఉంటాయి.**

1. ఈ చట్టమునకు నియమాలు తయారు చేయుట.
2. చట్టము సమర్ధవంతంగా అమలు జరుగుటకు కార్యచరణ మార్గదర్శకాలు జారీచేయుట.
3. రాష్ట్ర ప్రభుత్వాల అవసరాలకు స్పందిస్తూ మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టము క్రింద అనుమతించబడిన పనుల జాబితాపై సమీక్షించుట.
4. సిఈజిసి ఏర్పాటు చేయుట.
5. జాతీయ ఉపాధి హామీ నిధిని ఏర్పాటు చేయుట.
6. పనివిధాన సూచికల ద్వారా వినియోగ వ్యయము అంచనా మరియు క్లిష్ట విషయాల అంచనాపై ట్రాక్ డాటా పట్టుకొనుటకు యంఐఎస్ నిర్వహణ.
7. బడ్జెటు కేటాయింపులు జరిపి సకాలంలో కేంద్ర వాటా విడుదలకు కృషి చేయుట.
8. చట్టము అమలులో పారదర్శకత,సామర్థ్యము పెంపు కొరకు సమాచార సాంకేతికతను ఉపయోగించుటకు సహకరించుట.
9. చట్టము యొక్క లక్ష్యాలను చేరుకొనుటకు విధానాన్ని అభివృద్ధిపరచే ఆధునికీకరణకు అండగా ఉండుట.
10. ఫలితాలు అభివృద్ధి పరచేందుకు సామర్ధ్యపు పెంపు మరియు సాంకేతిక సహాయము అందజేయుట.
11. మహాత్మాగాంధీ ఉపాధీ హామీ చట్టము పని విధానమును మూల్యాంకనము మరియు పరిశోధనకు అజమాయిషి వహించుట.
12. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టము పనులు అమలు చేయుటకొరకు రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయు సంస్థల నియామకు కొరకు జాబితా తయారుచేసి వారి పరిపాలన ఖర్చులకు గాను నిధుల నుండి ఎంత శాతము ఇవ్వవచ్చునో నిర్ణయించుట.

మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకములో స్వయం సహాయక సంఘాలు మరియు పౌర సోసైటి సంస్థల పాత్ర ఏమిటి?

అట్టడుగు స్థాయిలో పనిచేసే పౌర సొసైటి సంస్థలు కూలీ కోరుకొను వారిలో అవగాహనను పెంపొందించుటలో,గ్రామపంచాయతీలలో సామర్థ్యపు పెంపు కల్పించుటలో,రాష్ట్ర ప్రభుత్వపు ప్రణాళికలు అమలు పరచుటలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ,సామాజిక తనిఖీలో గుర్తింపదగిన పాత్ర పోషించగలరు.

అవగాహన విస్తృత పరచడంలో,పనుల నిర్వహణలో అర్హతలు అంచనావేసి సహకరించుటలో ఇంటింటికి వెళ్ళి సర్వే నిర్వహించుటలో సామాజిక జవాబుదారితనము కలిగియుందురు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టము 9వ అధ్యాయములోని నిర్వహణ మార్గదర్శకాలలో ఇటువంటి పనులలో పౌర సొసైటి సంస్థలలను ఉపయోగించుకొను ఫ్రేం వర్కు వివరంగా చెప్పబడింది.

*మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకములో ఇతర లబ్ధిదారులు ఎవరు?*

**ఇతర ముఖ్యమైన లబ్ధిదారులు :**

సామాజిక తని యూనిట్ నిఘా మరియు ఆజమాయిషి కమీటిల ం,అమలు సంస్థల సాంకేతిక సిబ్బంది,మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టములో ఏకబిందువు కొరకు యంఓయు లో సంతకం చేసిన శాఖలు అనగా వ్యవసాయ మంత్రిత్వ శాఖ,అటవి మరియు పరిసరాల మంత్రిత్వశాఖ,నీటి వనరుల శాఖ,గ్రామీణాభివృద్ధి శాఖ,భూవనరుల శాఖ,త్రాగనీరు మరియు పారిశుధ్యపు శాఖ.

*– **జి.జయపాలరెడ్డి,** సి.ఇ.ఓ.జడ్.పి (రిటైర్డ్)*
*సలహాదారుడు, సి.ఎన్.ఆర్.ఎమ్.*
*తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు*
*గ్రామీణాభివృద్ధి సంస్థ*

# అభివృద్ధి సుస్థిరత కోసం శక్తి సంరక్షణ

**అభివృద్ధి, వివిధ రకాల ఇంధనశక్తి ఆవశ్యకత, ఆధునిక ఉపకరణాలు, పదార్థాల వినియోగశైలి, ఇంధనశక్తి సుస్థిరత, ఇంధనశక్తికి సంబంధించిన ఆర్థిక వెసలుబాటు (జాతీయ, సంస్థాగత వ్యక్తిగత స్థాయిలలో) హరిత వాయు ఉద్గారాలు, వాతావరణ మార్పులు, భూతాపం పెరగటం మానవజీవనం, జీవవైవిధ్య సంరక్షణ ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలు. ప్రపంచవ్యాప్త అధ్యయనాల్లో నిరూపితమైన ఈ సత్యం పై ప్రజలు, సమాజాలు, సంస్థలు పాలకులలో అవగాహన పెంచి వారి ని కార్యోన్ముఖులుగా ప్రేరేపించే ప్రయత్నంలో భాగంగా ఐక్యరాజ్యసమితి అందించిన పిలుపుల్లో ప్రతి ఏటా డిసెంబర్ 14 తేదీన శక్తి సంరక్షణా దినాన్ని జరుపుకోవటం ఒకటి. ఈ సారి కూడా భారత్‌తో సహా వివిధ దేశాలు దీన్ని పాటించాయి.**

శక్తి అనేది మానవ మనుగడకు, ఎదుగుదలకు కీలకమైనది. యంత్రాల ద్వారా కావచ్చు, ఇతరత్రా కావచ్చు. మన కార్యకలాపాలన్నీ శక్తి రూపాంతరం లేదా బదిలీ ద్వారా సంభవిస్తాయి. మన పూర్వీకుల జీవన విధానం సరళంగా ఉండి ప్రాకృతిక శక్తులతో పెద్దగా ఘర్షణకు దారితీయలేదు. ప్రాకృతిక వనరులకు బెడద రాలేదు. జీవవైవిధ్యానికి పెద్దగా భంగం కలుగలేదు.

కానీ మనిషి ఆశాజీవి. పెరుగుతున్న లేదా మారుతున్న అవసరాల కోసం మానవ మస్తిష్కం తన సదుపాయాలను పెంచుకొనేందుకు అనువైన పద్ధతులను, పదార్థాలను అన్వేషిస్తూ వస్తోంది. అనువైన పరికరాలను తయారు చేసుకొనే ప్రక్రియపై దృష్టి సారిస్తూ వస్తోంది. ఈ క్రమంలో అనాదికాలంలో రాళ్ళను నిప్పు, వెలుతుర్ల కోసం వాడుకోవటం మొదలుకొని 40,000 బి.సి. లో బొగ్గు వాడకం, 3000 బి.సి. నాటికి జలశక్తిని వినియోగించటం, 1615లో సౌరశక్తి ప్రయోగాలు చేయటం, 1769లో జేమ్స్‌వాట్ స్టీమ్‌ఇంజిన్ నమూనా తయారు చేయటం, 1799లో మొట్ట మొదటి ఎలెక్ట్రిక్ బేటరీని వోల్టా తయారు చేయటం, 1820లో మొట్టమొదటి బల్బును కనుక్కోవడం, 1935లో ట్యూబ్‌లైట్‌ల తయారీ ప్రారంభం, 1951లో మొట్టమొదటిసారి అణుశక్తితో విద్యుత్తు తయారుచేయడం లాంటి ముఖ్యమైన ఘట్టాలు ఎన్నో ఉన్నాయి. ఈ పరంపర నిరంతరం కొనసాగుతూనే ఉంది.



ఈ గమనంలో మానవుని సుఖజీవనానికి కావలసిన వసతులు, పరికరాలు పెరగడంతో ...

❄ మనిషి సగటు ఆయుర్ధాయం పెరిగింది.

❄ పేదరికం స్థాయి తగ్గుతూ వస్తోంది.

❄ సగటు ఆరోగ్యస్థాయి గతంతో పోలిస్తే మెరుగయింది.

కానీ ఇది సాధించడంలో వివిధ రంగాల్లో శక్తి వినియోగం విపరీతంగా పెరుగుతూ వస్తోంది. పర్యవసానంగా ఈ క్రింద పేర్కొనట్లుగా కొన్ని దుష్ఫలితాలు, ప్రమాదాలను ఎదుర్కొంటున్నాం.

❄ ప్రస్తుత వినియోగ సరళి కొనసాగిస్తూపోతే ప్రపంచంలోని శిలాజ ఇంధనాలు మరో వంద సంవత్సరాల తరువాత మిగలవు.

❄ మిగతాకారణాలు అటుంచితే, శక్తి ఉత్పత్తి మరియు వినియోగము 80% మేరకు వాయుకాలుష్యానికి 88% మేరకు హరిత గృహ వాయువుల ఉద్గారానికి కారణభూతమవుతోంది. ఫలితంగా భూతాపం పెరిగి వివిధ రంగాలపై (వ్యవసాయం, ఆరోగ్యం, త్రాగునీరు వగైరాలు) వ్యతిరేక ఫలితాలు కలుగజేస్తున్నాయి.

❄ వినియోగ సరళి ఇట్లే కొనసాగితే ఈ వ్యతిరేక ఫలితాలు తీవ్రతరమై మానవ సమూహాల మనుగడకే ప్రమాదకరంగా మారుతాయి.

ఇక మన భారత దేశ విషయానికి వస్తే దేశంలో ప్రసుత్తం మన అవసరాలకు వివిధ రంగాలలో వినియోగమవుతున్న శక్తి వనరుల శాతాలు ఇలా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| బొగ్గు, లిగ్నైట్ | - | 41% |
| విద్యుచ్ఛక్తి | - | 14% |
| ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు | - | 39% |
| సహజ వాయువు | - | 6% |
| **మొత్తము** | | **100%** |

కాని మనం గమనించాల్సిన విషయమేమిటంటే ముడిచమురు,

పెట్రోలియం ఉత్పత్తుల వినియోగంలో 83%, బొగ్గు వినియోగంలో 27%, సహజ వాయువు వినియోగంలో 27% వివిధ దేశాల నుండి దిగుమతుల పై ఆధారపడింది. 2014-15 సంవత్సరంలో కేవలం మన ముడిచమురు, పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి బిల్లు మాత్రం రూ. 6.00 లక్షల కోట్ల రూపాయలు దాటింది.

నిపుణుల అంచనా ప్రకారం ప్రస్తుతమున్న వినియోగ శైలినే కొనసాగిస్తూపోతే మరో పదేళ్ళలో ఈ పైకం రెండింతలు దాటే అవకాశముంది. భవిష్యత్తులో ఒక వేళ అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారితే పరిస్థితి మరింత క్లిష్టతరంగా మారి శక్తి సంక్షోభానికి దారితీసి దేశ ఆర్థిక వ్యవస్థ పై ప్రభావం చూపి వివిధ సరకుల ధరలుపెరిగి సామాన్య కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యే ఆస్కారముంది.

పెరుగుతున్న జనాభాతోనూ, అభివృద్ధి ఫలాల కోసం జరిగే పారిశ్రామికీకరణ, మౌళిక వసతుల పెరుగుదలతోను, దేశంలో శక్తి అవసరం త్వరితంగా పెరుగుతోంది. 2000 సంవత్సరంలో 450 మేరకు వినియోగమైన శక్తి 2012లో 770 ఎంటిఓఇ కి పెరిగింది. ఇదే సరళిలో 2030 సంవత్సరంలో ఈ డిమాండ్ 1250 నుండి 1500 మధ్య ఉండవచ్చని నిపుణుల అంచనా.

కానీ, ఇప్పటికీ మన దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో

- 45% కుటుంబాలకు విద్యుచ్ఛక్తి సదుపాయం లేదు.
- 80% కుటుంబాలు వంటకు బొగ్గు, కట్టెలను వాడుతున్నారు.

ఒక రకంగా చూస్తే ఈ పరిస్థితిని అధిగమించి మన అభివృద్ధి లక్ష్యాలను (ఇంటింటికీ విద్యుత్తు లాంటివి) చేరుకోవాలంటే ...

- కొత్త వనరులపై పరిశోధన జరిపి వాతావరణానికి అనువైన శక్తి సాధకాలను కనుగొనాలి.
- కొత్త శక్తి ఉత్పాదక కేంద్రాలను నెలకొల్పాలి.

మన దేశం అనుసరిస్తోన్న ద్విముఖ వ్యూహంలో మొదటి వ్యూహం ఈ లక్ష్యాలతో కూడుకున్నదే-శక్తి వనరుల లభ్యత పెంచటం, క్రొత్త వనరులపై దృష్టి సారించటం. ఆ దిశలో కృషి జరుగుతోంది కూడా.

కాని ఈ వ్యూహం అధిక వ్యయంతో కూడుకొన్నది. సఫలీకృతమవటానికి ఎక్కువ సమయం పడుతుంది. అంత సమయం పాటు మనం ఏమీ చేయకుండా వేచి ఉంటే సంక్షోభాన్ని ఆహ్వానించిన వారమవడమే కాకుండా ముందుముందు శక్తి వనరులు కనుమరుగయ్యే స్థితి వలన భూమికి తిరుగదోడలేని నష్టాన్ని కలిగించి భవిష్యత్ తరాల వారికి అన్యాయం చేసినవారమౌతాం.

ఇక రెండవ వ్యూజుం శక్తి వినియోగాన్ని తగ్గించుకోవటం. ఈ విషయంలో దేశం ముందున్నవి రెండు ముఖ్యమైన ప్రత్యామ్నాయ మార్గాలు - ఒకటి చట్టపరమైన చర్యలు, రెండు ప్రజలలో అవగాహన



పెంచి వారివారి పరిధిలో అందరు శక్తి సంరక్షణకు తోడ్పడే చర్యలు తీసికోవటం దైనందిన అలవాటుగా చేసికొనేటట్టు ప్రోత్సహించటం.

**1. చట్టం** - ఈ విషయంలో శక్తి సామర్థ్యంకోసం చట్టపరమైన ప్రాతిపదికను నెలకొల్పటానికి భారత ప్రభుత్వము ఇంధన సంరక్షణ చట్టాన్ని 2001లో తెచ్చింది. ఈ చట్టంలోని ముఖ్యమైన అంశాలు ఇవి.

కొన్ని పరికరాలు, యంత్ర సామాగ్రికి శక్తి వినియోగ ప్రమాణాల ను కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశిస్తాయి. ఆ పరికరాలు / యంత్ర సామాగ్రి పై తప్పనిసరిగా, సంబంధిత లేబెల్స్ వేసేట్టుగా చేయవచ్చు.

ఈ ప్రమాణాలకు అనుగుణంగా లేని పరికరాలు / యంత్ర సామాగ్రి యొక్క తయారీ / కొనుగోలు/ దిగుమతిని నిషేదించవచ్చు.

అధికంగా శక్తి ఉత్పాదకం / వినియోగంతో కూడిన సంస్థలు/ పరిశ్రమలు / భవనాలను నిర్దేశిత వినియోగదారులుగా ప్రకటించి వారు తగు అర్హతలు ఉండి ధృవీకరించబడిన ఎనర్జీ మేనేజర్లను నియమించుకోనేటట్టుగా చేయటం. (ఎనర్జీఆడిట్ నిర్దేశిత విధంగా జరిగి యాజమాన్యాలు తగు చర్యలు తీసికొనేటట్టుగా చేయవచ్చు)

100 కిలోవాట్ విద్యుత్తు లోడు ూన్న క్రొత్త వ్యాపార భవనాలకు బిల్డింగా కోడును నిర్దేశించటం (రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక వాతావరణ పరిస్థితుల కనుగుణంగా ఈ బిల్డింగ్ కోడును మార్చుకొని అమలుకు చట్టరీత్యా చర్యలు తీసికొనవచ్చు).

**2. శక్తి సంరక్షణ ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచటం**

వివిధ అధ్యయనాల ద్వారా భారతదేశంలో అన్ని రంగాలలో చేరి దాదాపు 30% శక్తిని పొదుపు చేయటానికి అవకాశముందని తేలింది. అంటే అంతమేరకు అదనపు శక్తి ూత్పాదన ప్లాంటులను నెలకొల్పేందుకు కావలసిన పెట్టుబడిని ఆదా చేయవచ్చు. అంతేకాదు, పరోక్షంగా కొంతమేరకు ఇంధన దిగుమతికయ్యే భారీ ఖర్చును కూడా తగ్గించుకోవచ్చు.

శక్తి వృధాను అరికడితే ఒనగూరే ప్రయోజనం గురించి మచ్చుకు కొన్ని దృష్టాంతాలు:

★ ఒక హాలును లేదా తరగని గదిని లైట్లు ఆర్పకుండా ఒక రాత్రి వదిలేస్తే వృధా అయ్యే శక్తితో 1000 టీ కప్పులకు కావలసిన నీటిని వేడి చేయవచ్చు.

★ ఒక ప్రింటరు/ జిరాక్స్‌మెషిన్ ఆఫ్ చేయకుండా ఒక రాత్రి వదిలేస్తే వృధా అయ్యేశక్తితో 1500 కాపీలు ప్రింట్ చేయవచ్చు.

★ ఒక కంప్యూటర్ ఆఫ్ చేయకుండా ఒక రాత్రివదిలేస్తే వృధా అయ్యేశక్తి 7.5 వాట్స్.

## గృహోపకరణాలు

*సామాన్య ప్రజలు అలవరచుకోగలవిగా ఉండి శక్తి సంరక్షణకు తోడ్పడే అలవాటు కొన్ని ఈ క్రింది ఇవ్వబడినాయి.*

1. లైట్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అవసరం లేనపుడు స్విచ్ ఆఫ్ చేయడం.
2. సాధ్యమైనంత వరకు పగటి పూట సహజ వెలుతురును ఉపయోగించడం.
3. అవసరమైన ప్రదేశాలలో మాత్రమే ఎలక్ట్రిక్ లైట్లను వాడడం.
4. లైట్ల అమరిక ఎక్కువ ఎత్తులో లేకుండా అనువైన ఎత్తులో అమర్చడం ద్వారా కూడా లైట్ల సంఖ్యను తగ్గించవచ్చు.
5. లైట్ల పై దుమ్ము పేరుకొనకుండా అపుడపుడూ శుభ్రపరిస్తే మంచి వెలుతురు ఉంటుంది.
6. ఎటువంటి ఎలెక్ట్రిక్ లైట్ వాడాలి?

ఎల్ఇడి బల్బుల, సిఎఫ్ఎల్ ట్యూబ్‌లైట్లు /మామూలు బల్బులలో మామూలు బల్బుల ధరే తక్కువ. కాని ఓల్టేజి, మన్నికలను పరిగణలోకి తీసికొని లెక్కేస్తే దీర్ఘకాలం పై (4 సంవత్సరాలకు) వినియోగదారునికి అతి తక్కువ వ్యయమయేది ఎల్ఇడి బల్బులు, ఆ తరువాత ట్యూబ్‌లైట్లు. జీరోబల్బు (15వాట్స్) విషయానికి వస్తే వాటి స్థానంలో 0.50 వాట్స్ లెడ్ లైటును అమరిస్తే మనకు 3 నెలలలోపే గిట్టుబాటు అవుతుంది.



మామూలు బల్బుల స్థానంలో ఎల్ఇడీ/సిఎఫ్ఎల్ లైట్లు వాడితే విద్యుచ్ఛక్తి ఆదా అవడమే కాకుండా వినియోగదారులకు కూడా డబ్బు ఆదా అవుతుంది. కనుక మామూలు బల్బుల స్థానంలో లెడ్ బల్బులు గాని సిఎఫ్ఎల్ (ట్యూబ్‌లైట్లు) గాని అమర్చుకోవడం మంచిది. దాని వల్ల తక్కువ ఉష్ణము కూడా ఉద్గారమవుతుంది.

7. ట్యూబ్‌లైట్లుకు మామూలు చోక్‌లు వాడకుండా ఎలక్ట్రానిక్ చోక్ వాడితే సామర్థ్యం పెరుగుతుంది.
8. రిఫ్రిజిరేటర్ వాడకంలో మెళకువలు పాటించడం.

❄ ఆహార పదార్థాలను వేడి చేసే ముందు కాని ఫ్రిజ్‌లో పెట్టేముందు కాని వాటిని సాధారణ స్థాయి ఉష్ణోగ్రతకు తీసికొని రావటం చేయాలి.

❄ ఫ్రిజ్ తలుపులను సాధ్యమైనంత త్వరగా తెరవటం/మూయటం చేయాలి.

❄ సాధ్యమైనంతవరకు ఫ్రీజరు ఖాళీగా ఉండకుండా చూసుకొనాలి.

❄ ఇస్త్రీపెట్టె – ఇస్త్రీచేయవలసిన బట్టలనన్నీ ఒక్కసారి ఇస్త్రీ చేయడం మంచిది.

❄ ఏర్ కండిషనర్లను అవసరమైన మేరకే వాడడం. వాటిని అతి తక్కువ ఉష్ణోగ్రతకు సెట్ చేయకుండా సమతుల్యమైన ఉష్ణోగ్రతకే సెట్ చేయడం.

❄ వాషింగ్ మెషిన్లను ఒకటి రెండు బట్టలను ఉతకటానికి కాకుండా పూర్తిగా నింపి వాడటం

*వ్యవసాయరంగంలో వాడే పరికరాలు, మెషిన్ల విషయంలో ఈ క్రింది జాగ్రత్తలు తీసికొనాలి.*

(ఎ) తగిన సామర్థ్యముగల పంప్‌సెట్లనే రేటింగ్ చూసి వాడాలి. వాటి ధర ఎక్కువైనా అవి ఎక్కువ సామర్థ్యంతో పని చేస్తాయి, మంచి మన్నిక కూడా కలిగి ఉంటాయి. మొత్తము మీద శక్తి ఆదాకు తోడ్పడతాయి. రైతుకు కొంతకాల వ్యవధి మీద గిట్టుబాటు అవుతాయి.

(బి) వ్యవసాయ పంప్‌సెట్ల నిర్వహణ ఓ అండ్ ఎం మాన్యువల్ ప్రకారము సరిగా జరిగేట్టు చూసుకోవాలి.

(సి) బిఐఎస్ లేబేల్ కల ఫుట్ వాల్వ్‌ను వాడాలి

(డి) ఎక్కువ వ్యాసముకల పైపులను వాడాలి.

(ఇ) జిఐ పైపులకు బదులు హెచ్‌డిపిఇ పైపులు వాడితే శక్తి వినియోగం తగ్గుతుంది.

(ఎఫ్)నీటి మట్టముకంటే 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో పంపు అమర్చకూడదు.

(జి) ట్రాక్టర్ల నిర్వహణ టైము ప్రకారము ఓ అండ్ ఎం మాన్యువల్‌లోని సూచనల ప్రకారము జరిగేటట్టు చూడాలి –

(ముఖ్యంగా ఇంజిన్, టైర్లు, డీజిల్ ట్యాంక్, డీజిల్ పంపు, ఇంజెక్టర్లు డీజిల్ పైపులు విడి భాగాలు ఇంజన్ ఆయిల్, సరైనగేర్ల వాడకం పద్ధతి ఇత్యాదుల ద్వారా) లేకుంటే నిర్వహణావ్యయము పెరుగుతుంది. ఇంధన వ్యయం కూడా పెరుగుతుంది.

ఎలెక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాల విషయంలో బీఈఈ రేటింగును పరిశీలించి కొనుగోలు నిర్ణయాలు తీసికొనాలి.

## కొన్ని ఇతర రంగాలలో కూడా తీసికోదగ్గ చర్యలు

వాతావరణానికి హితకారిగా నుండి వనరుల సంరక్షణకు తోడ్పడటమే కాకుండా పరోక్షంగా శక్తి సంరక్షణకు కూడా దారి తీస్తాయి. వాటిలో కొన్ని

1. నీటి వృధా అరికట్టటం – గ్రామ పంచాయితీలు తమ గ్రామ ప్రణాళికలో భాగంగా పంచాయితీ త్రాగునీటి ప్రణాళికను సమర్ధవంతంగా తయారు చేసికొని అమలు చేసికొనటం.
2. సాధ్యమైనంత వరకు స్థానికంగా పండించిన కూరగాయలు, పండ్లనే ప్రోత్సహించాలి.
3. వ్యవసాయంలో తక్కువ నీటిని సంగ్రహించే పంటలనే సాధ్యమైనంత వరకు పండించాలి దానికి అనువైన సాంకేతిక పద్ధతుల గురించి తెలిసికొని పాటించాలి.
4. మొక్కలకు నీరు పోయటం ఉదయం సాయంత్ర వేళలలోనే చేయాలి.
5. సాధ్యమైనంత వరకు వ్యక్తిగత వాహనాలు వాడకుండా ప్రజారవాణా వాహనాల ద్వారానే ప్రయాణించాలి. కార్లు నలుగురి కి ఉపయోగపడేటట్టుగా సంస్థల్లో కార్ల సమీకరణ (పూలింగ్) చేయాలి.
6. ప్లాస్టిక్కుల వాడకం సాధ్యమైనంత వరకు విడనాడాలి. ప్రతిసారి త్రాగు నీటి కోసం ప్రతి ఒక్కరు క్రొత్త బాటిల్ వాడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసికోవాలి.






7. సౌర పరికరాల (సోలార్ లైట్లు ఇత్యాదివి) వాడకాన్ని ప్రోత్సహించాలి. అలాగే ఇతర ప్రత్యామ్నాయ శక్తి వనరుల పై గల పథకాలను వాడుకోవాలి.
8. రవాణా రంగంలో పెట్రోలు డీజిల్ వినియోగం ప్రముఖ స్థానం వహిస్తోంది. కనుక వ్యక్తిగత వాహనదారులు సంస్థలు రవాణా సంస్థలు ఈ క్రిందివాటిపై ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపిస్తే వాహనదారులకు డబ్బు ఆదా అవటమే కాకుండా వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుంది. దేశానికి విదేశీమారకపు బిల్లును కూడా తగ్గిస్తుంది.

❄ సరైన డ్రైవింగ్ పద్ధతులను పాటించడం (ముఖ్యంగా గేర్లు, స్పీడు బేక్‌లు వేయటం ఇత్యాదులలో)

❄ వాహనానికి నిర్దేశించబడిన రీతిలో, నిర్దేశించబడిన కాలవ్యవధిలో సర్వీసింగ్ లేదా మెయింటెనెన్స్ కార్యక్రమాలు జరిగేటట్లు చూడాలి.

***9. మన వంటగదిలో కూడా వారు పొందుపరచిన చిట్కాలు పాటిస్తే గ్యాస్/కిరోసిన్ ఆదాచేయవచ్చు. వీటిలో ముఖ్యమైనవి.***

❄ గిన్నె పక్కల నుంచి మంట బయటకు వస్తే శక్తి వృధా అయిపోతుంది. అడుగున
వెడల్పుగా ఉండే గిన్నెలనే వాడండి.

❄ తెరిచి ఉన్న వంట గిన్నె పైన మూత పెట్టండి, మూతలేని గిన్నెనుంచి వేడి బయటకి పోతుంది, మరింతగా ఇంధానాన్ని ఖర్చు చేస్తుంది.

❄ గ్యాస్ స్టవ్‌లోని చిన్న బర్నర్‌ని లేదా కిరోసిన్ స్టవ్‌లో తక్కువ మంటని వాడటం వల్ల తక్కువ ఇంధనం ఖర్చువుతుంది.

❄ మంచి కాంతితో, నిలకడగా, నీలంగా మంట వస్తుంటే అర్థం పటిష్టంగా మండుతోందన్న మాట. కాంతివంతమైన నీలం వచ్చేందుకు గ్యాస్ / కిరోసిన్ స్టవ్‌ని రెగ్యులర్‌గా పరిశుభ్రం చేయండి.

కనుక జాతీయాభివృద్ధితో ముడివడి ఉన్న శక్తి సంరక్షణకు మనలో ప్రతి ఒక్కరు తమతమ పరిధిలో పాటుపడదాం.

***– ఏ.నాగేశ్వర రావు,*** *సెంటర్ హెడ్,*
*సి.డబ్ల్యు.ఎస్ మరియు సి.యం.ఇ.డి., టిసిపార్డ్*



**ఏ దేశమైనా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధిని సాధించడానికి ఆ దేశంలో స్త్రీజాతిపట్ల అవలంబించే వైఖరికి ప్రత్యక్షమైన సంబంధం ఉందని చాలామంది సామాజికవేత్తలు నిర్ద్వంద్వంగా అంగీకరిస్తారు. ఏ సమాజమైన పరిఢవిల్లాలంటే అక్కడ స్త్రీజాతి అభ్యున్నతి సాధించాలి. స్త్రీలు కేవలం వంట ఇంటికి పరిమితం కారాదని, ప్రతి మహిళా ఒక రాజకీయవేత్త కావాలని మహిళా జాతిని మేల్కొలిపిన మహనీయులు, మానవతావాదులు ఎందరో స్త్రీవిముక్తిలోనే పురుషుని విముక్తి ఉందని ఎంతకాలం స్త్రీ అణగద్రొక్కబడి ఉంటుందో అంతకాలం సమాజం, దేశం, ఆఖరికి పురుషులు సైతం నిర్వీర్యులైపోతారని, అందువల్ల ఆర్థిక స్వాతంత్ర్యం కంటే స్త్రీ, స్వేచ్ఛా, సమానత్వాలు ముఖ్యమని చాటిచెప్పిన మహిళోద్ధారకులు కూడా పెక్కుమంది.**

నాగరికత పెరుగుతున్నది. టెక్నాలజీ విస్తృతం అవుతుంది. మేధవిశ్వరూపం దాల్చుతోంది. ప్రపంచమంతకు గ్రామంగా మారింది. ధరణికి తరుణి సరిసాటియని చాటుకోవాలి. మహిళలకు సమత దక్కే శుభోదయాలు రావాలి. మహిళలే దానికోసం పిడికిలి బిగించి ఉద్యమించాలి.

# మహిళా సాధికారతకు కృషి



మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు చేసినా దాడులు ఆగడం లేదు. చట్టాలు ఎంతపదునైనా అవి అమలు జరగకపోతే వ్యర్థమే! మహిళల రక్షణకు ఉన్నచట్టాలు అమలు జరపకపోవడం, ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొత్త కమిటీలు వేసి చట్టాలు మారడం అనవాయితీగా మారింది. మహిళలపై జరుగుతున్న దాడులు ఒక రాష్ట్రానికో, ప్రాంతానికో పరిమితం కావడం లేదు. ఈ దాడులు కొనసాగడానికి కారణం నిందితులకు సరైన శిక్షలు పడకపోవడమే. ఇటువంటి కేసుల విచారణ స్థానికమైన ఒత్తిళ్లు రాజకీయ జోక్యాల కారణంగా నీరుగారిపోతున్నది.

మహిళలకు రక్షణ లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించుకోవడం మానుకుని ఎవరిస్థాయిలో వారు మహిళలకు రక్షణ కల్పించే విషయంలో చిత్తశుద్ధితో కృషిచేయడం, ఉన్న చట్టాలనే పటిష్టంగా అమలు చేస్తే కొత్త చట్టాల అవసరం ఉండదు. మహిళలపై తీవ్రమవుతున్న హింసాకాండను ప్రభుత్వాలు విడివిడి ఘటనలుగా చూపుతూ సమస్య తీవ్రతకు గల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కారణాలవైపు చర్చని రానివ్వడం లేదు. తీవ్రమైన నిరసన వ్యక్తమైన సందర్భాల్లో అరెస్టు చేసి కేసులు పెట్టడం, ఒకటో రెండో శిక్షలు వేయడం ద్వారా నేరాల్ని అదుపుచేస్తామని మహిళల రక్షణ కల్పిస్తామని చెబుతున్నాయి. నేడు ఉద్యమించి కుటుంబహింసపై చట్టం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. చట్టాలు ఉన్నా, అవి అమలే కావడంలేదు. ప్రత్యక్ష న్యాయస్థానాలు మహిళా పోలీసు స్టేషన్లు, కమిషన్లు వల్ల కొంత మార్పు ఉంది. గృహహింస నిరోధక బిల్లు 2001కు సంబంధించింది. అర్జున్‌సింగ్ నేతృత్వంలోని పార్లమెంటు కమిటీ సూచనలను యధాతథంగా అమలు చేయడం వల్ల ఎంతో ఫలితం ఉంటుంది.

మహిళలు నిశబ్దాన్ని వీడాలి. అన్నింటికీ మౌనం సమాధానం కాదు అని గుర్తించాలి. స్త్రీల సమస్యల గురించి వారి వరకే చర్చ జరుగుతున్నది. పురుషులు కూడా చర్చించే పరిస్థితి రావాలి. ఉపాధి అవకాశాలు కోల్పోవడం కూడా మహిళలలో అభద్రతను పుంజుకుంది. ఆధునిక సమాజంలో విచక్షణాజ్ఞానం లేకుండా ప్రవరిస్తున్న వారి వైఖరివల్ల కొన్ని కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు పడేవేదన వర్ణనాతీతంగా ఉంది.

మహిళలపై హింస వేధింపుల నిరోధానికి చట్టాలు ఉన్నాయి. కానీ దర్యాప్తులో వేగవంతం, నిస్పక్షపాతంగా కేసులు స్వీకరణ వంటి విషయంలో ఈ దేశపోలీసు వ్యవస్థ ఏమాత్రం ఎదుగలేదు. నేరనిర్ధారణకు ఖచ్చితమైన సాక్ష్యాధారాలు లేకపోతే ఎవరిని శిక్షించలేదు. కేసులు దర్యాప్తే అతికీలకమైంది. మహిళలకు సంబంధించి వారు కోర్టుకు వచ్చి సాక్ష్యం చెబితే అల్లరి పాలవుతామనే భయము లేకపోలేదు. అందుకే వారు కోర్టుకురారు. రాలేరు. ఒకవేళ వచ్చినా కోర్టులో న్యాయవాదులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక సిగ్గుతో తలవంచుకోవాల్సిందే.

రాష్ట్రంలో మహిళల మీద నమోదైన అత్యాచారం, కిడ్నాప్, హత్యవంటి కేసులు ఎన్నో ఇప్పటికీ దర్యాప్తు దశలోనే ఉన్నాయి. ఇలాంటి వాటి విషయాల్లో ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తున్నట్లే చెప్పుకోవాలి. మహిళలపై హింస వేధింపుల విషయంలో

ఒక్కో సంఘటనలో మానవత్వం మంటగలిసిన సందర్భాలు లేకపోలేదు.

ప్రపంచీకరణ ముసుగులో ఆర్థికసంస్కరణలతో పుట్టుకొచ్చిన నయా ధనిక వర్గంకోసం ఏర్పడిన పబ్బులు, క్లబ్బులు సామాన్యులకు ఏకైక వినోద సాధనంగా ఉన్న సినిమాలు సైతం మహిళలను అంగడి వస్తువుగా వారి రంగురూపులకు కొలతలను నిర్ధారించి ఆటాడుకుంటున్నా, ద్వందార్థాల సంభాషణలు, అర్ధనగ్ననృత్యాలకు ఆడవారే పావులవుతున్నారు.

సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్‌ల దుర్వినియోగం ద్వారా ఒక వికృత సంస్కృతి కనపడుతుంది. ఇంటర్నెట్‌లో సెక్స్‌సైట్‌లను చూసేవారే ఎక్కువశాతం ఉన్నారని గూగుల్ అంచనా. స్త్రీలపై సామాజిక, శారీరక అణచివేతలు పెరుగుతున్నాయి. పనిచేసే చోట తోటి ఉద్యోగురాలైన మహిళలపై అత్యాచారాలు చేసేంతవరకు వెళ్లింది. లైంగిక అత్యాచార నిరోధకచట్టాలు ఎన్ని వున్నా, 'నిర్భయ' చట్టం అమలులోకి వచ్చినా పోలీసులు సరైనరీతిలో స్పందించకపోవడం శిక్షలు త్వరగా అమలు కాకపోవడం, దీని పెరుగుదలకు ఒక కారణం.

అత్యాచార కేసుల్లో 15 శాతం మాత్రమే నిందితులకు శిక్షలు పడుతున్నాయి. అత్యాచారాలను పెంచే విధంగా పరిస్థితులను కల్పించిన వ్యాపార, వినియోగ సంస్కృతిని పెంచిన శక్తులను మొదటగా శిక్షించాల్సిన అవసరముంది. పేద మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులకు కులపెద్దలు, గ్రామపంచాయితీలు, పోలీసుస్టేషన్ల సాక్షిగా వెలగట్టడంతో ఖరీదైన న్యాయవాదులను పట్టుకోలేకపోవడం వలన నిందితులు తప్పించుకుంటున్నారు. మనుషుల మధ్య వైరుధ్యాలకు, జెండర్ మధ్య వైరుధ్యాలకు, సమూహాల మధ్య వైరుధ్యాలకు కారణాలను శోధించకుండా అత్యాచారాలు ఎందుకు జరుగుతాయో అర్థం చేసుకోలేం. అత్యాచార సంఘటన జరిగినప్పుడే అంత ఆవేశంగా ఎందుకు స్పందిస్తారో వారిని వారే ప్రశ్నించుకోవాలి.

అత్యాచారాలు నిరోధించటానికి జస్టిస్ జె.ఎస్.వర్మ కమిటీని సిఫార్సులకు లోబడి ప్రభుత్వం 'నిర్భయ' చట్టాన్ని కూడా తీసుకొచ్చింది. నేరాలకు కారణభూతంగా ఉన్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మూలాలను అన్వేషిస్తే తప్ప ఇలాంటి దుర్గతి నుండి కాపాడలేము. అత్యాచారాలు చేసిన వారిని ఉరితీయడం వల్ల మధ్యతరగతి ఆగ్రహావేశాలను సంతృప్తిపరచవచ్చు కాని, వ్యవస్థలోని లోపాలను నిర్మూలించటం కష్టమే. మహిళను వస్తువుగా, అంగడి సరుకుగా, సెక్స్‌సింబల్‌గా, పిల్లల్నికనే యంత్రంగా చూపిస్తున్న సంస్కృతిని, పెంచిపోషిస్తున్న శక్తులకు శిక్ష విధించకుండా, దాని బారినపడిన వాద్రేకపూరిత యువకులను శిక్షించడం వల్ల సమస్యకు పరిష్కారం లభించదు.

కఠినచట్టాన్ని తీసుకొచ్చినా నిర్భయ సంఘటనలు, ఢిల్లీ నుంచి హైదరాబాద్ అటునుండి గ్రామాలకు ప్రాకడాన్ని ఎవ్వరూ అడ్డుకోలేకపోతున్నారు. స్త్రీని అణచడానికి అత్యాచారాన్ని ఒక అణచివేత సాధనంగా ఉపయోగిస్తున్న పోలీసు, అగ్రవర్ణాల శక్తులను ఎవ్వరూ ప్రశ్నించలేకపోతున్నారు. అత్యాచారాలు జరిగినపుడు రాజకీయ నాయకులు, యోగిపుంగవులు నేరస్తులను వదిలి బాధితురాళ్లదే తప్పు అని చూపించే వింతధోరణి మనం చూస్తున్నాము.స్త్రీలు ధరించే దుస్తులు రెచ్చగొట్టేవిధంగా ఉన్నాయని తెగ బాధ పడిపోయేవారు. కామాంధులు మూలనున్న ముసలమ్మలపై, పసిపిల్లలపై జరుగుతున్న లైంగికనేరాలకు వీరు ఏం సమాధానం చెప్పగలరు. సినిమాలో స్త్రీల అందాలనే పెట్టుబడిగా ఉపయోగిస్తున్న అశ్లీల సంస్కృతిని వ్యతిరేకించకుండా, తమ ఇష్టానుసారం దుస్తులు ధరిస్తున్న మహిళలని కించపర్చడం ఎంతవరకు సమంజసం.

సాంప్రదాయకబద్ధంగా ఉన్న మహిళలపై కూడా అత్యాచారాలు జరుగుతున్నాయి. పిల్లలపై కూడా. ఇదంతా మగవాడిలో నిద్రాణమైయున్న కీచక స్వభావంకాదని ఎవరు చెప్పగలరు. మద్యం మత్తులో యువత పెడదారినపడ్తున్నా, మద్యాన్ని నిషేధించే దిశగా చర్యలు మాత్రం ఉండవు. కొంతమంది మేధావులు స్త్రీలు సెల్‌ఫోన్లలో ఒకరకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకుంటే లైంగిక వేధింపులు జరిగినపుడు పోలీసు స్టేషన్లకు మెసేజ్‌లు వెళతాయని, స్త్రీలు కరాటే నేర్చుకోవాలని, కారాన్నీ, పెప్పర్‌స్ప్రేని హ్యాండ్‌బ్యాగ్‌లో చెప్తున్నారు.

స్త్రీలు తమను తామే రక్షించుకోవాలని తరచు చెబుతూనే ఉంటారు. కానీ ఇవన్నీ తాత్కాలికమే. సేఫ్టీ పిన్‌లతో వారిని వారు రక్షించుకోగలగడమన్నదదీ జరిగేపనికాదు. ఇంటినుండి బయలుదేరిన స్త్రీ స్వంత వ్యక్తిత్వాన్ని, సమానత్వాన్ని పొందాలని ఆకాంక్షించినప్పటికీ, ఆశించినంత మార్పు జరుగలేదు. తనపై అత్యాచారం జరిగినా పరువుకు భయపడి ఏ స్త్రీ తల్లిదండ్రులకు, సమాజానికి తెలియకుండా వ్యవహరించాల్సి వస్తోంది. లేకపోతే ఆ యువతి మరింత అల్లరి పడిపోతుంది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు కుటుంబవ్యవస్థ ప్రతిష్టను కాపాడటానికి న్యాయస్థానాలు, మీడియా, పోలీసువ్యవస్థ తమవంతు పాత్రగా ముందడుగు వేయలేకపోతున్నది.

అందం, మద్యం, నెట్, సెల్, సినిమా, పబ్‌లు యువతను విలాసాలకు, ఖర్చులకు వెనకాడొద్దని చెపుతున్నాయి. అమాయక మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను పట్టించుకున్న నాధుడే లేడు. పసిపిల్లల నుండి పండు ముదుసలి వరకు ఎవ్వరూ లైంగికదాడుల నుండి తప్పించుకోలేకపోతున్నారు.

దీనికితోడు వ్యవస్థ నిర్లక్ష్యం, అసమర్థత తోడవుతోంది. ప్రేమ, ఇష్టం పేరుతో స్త్రీలను పురుషులు నియంత్రించడం చూస్తూనే ఉన్నాం. చాలామంది అనుకుంటున్నట్లు లైంగికత ప్రకృతికి సంబంధించిన విషయం కాదు. జెండర్లు సామాజికంగా రూపొందించబడినవే. స్త్రీ–పురుష సంబంధాలను రాజకీయ, సామాజిక నేపథ్యంలో భాగంగా అర్థం చేసుకోవాలి.

*– ఎం. రాఘవయ్య, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్*



**నిజం చెప్పాలంటే బంజార అనేది ఒక కులం కాదు. వీరిది ఒక సామాజిక సమూహం అని చెప్పుకోవచ్చు. ఈ బంజారాలు పలు నామాంతరాలతో ప్రపంచం అంతటా వ్యాపించి ఉన్నట్లు చారిత్రకాధారాలు చెబుతున్నాయి. వీరు తమకు తాము గోర్ అని, ఇతరులను కోర్ అనిచెప్పేవారు. మొదట్లో గోర్ బంజారా జనాభా అధికంగానుండేదట. ఈ బంజారాలు 'గోర్‌వట్' క్షత్రియ సంతతికి చెందినవారుగా పిలువబడుతూ కాలక్రమంలో వీరి సంఖ్య తగ్గిపోయినట్లు చెబుతున్నారు.**

ఒక విషయం మాత్రం నిజం దేశ చరిత్రలో మతమారిడుల పుణ్యమా అంటూ బంజారాలు వేరువేరు కులాల వారి లాగా వేరువేరు మతాలను స్వీకరించడం జరిగింది. ముసల్మానుల పరిపాలనాకాలంలో కలకత్తా నుంచి కాబూ వరకూ వ్యాపించియున్న బంజారా జాతిని బయపెట్టి ఆనాడు మత మార్పిడికి పాల్పడ్డారు. బహుశా ఇప్పుడున్న కాబూలీ వారు లాహోర్ బంజారాలుగా

2001 లెక్కల ప్రకారం వీరి జనాభా పెరిగింది. నాటి లెక్కల ప్రకారం నిరభ్యంతరంగా ఇంకా ఎక్కువశాతం అయ్యుంటుదనే చెప్పాలి.

బంజారా, లంబాడ, సుగాలీల మధ్య ఏ విధమైన భేదాలు లేవని భావిస్తారు. 'థర్స్టన్' గారి అభిప్రాయం ప్రకారం బ్రింజారి, బంజారి వ్యాపారి, సుగారీ, సుకాలీ, లంబాడా మొదలైన ఎన్నో లంబాడీ

# బంజారాల జీవనశైలి–సంస్కృతీ సాంప్రదాయాలు

మరియు పాకిస్థాన్‌లోని లాహోర్‌కి చెందినవారు 'ముల్తానీ బంజారాలు'గా ప్రసిద్ధి పొందడం విశేషం.

ఇండియాలో బంజారాల పుట్టుగడ రాజస్థాన్ అయినా తీరు నేడు బహు జనసమాజం, అందువల్ల అన్ని రాష్ట్రాలలో వీరు కనిపిస్తున్నారు.ఉత్తర,దక్షిణ, పశ్చిమ భారతదేశంలో వీరు అధికంగా నివసిస్తున్నారని చెప్పుకోవాలి. అయితే వీరిని కొన్ని రాష్ట్రాలలో గిరిజనులుగా పరిగణిస్తుంటే, కొన్ని రాష్ట్రాల్లో హరిజనులని, ఇంకొన్ని రాష్ట్రాల్లో డీనోటిఫైడ్ గిరిజనులని, మరికొన్ని రాష్ట్రాల్లో బి.సిలుగా, కొన్ని రాష్ట్రాల్లో ఒ.బి.సి.లుగా గుర్తించి ఎన్నో పథకాలు వారి కోసం అమలు చెయ్యడం జరుగుతున్నది.

డా॥ కృష్ణగారు రాసిన వీరి చరిత్ర సంస్కృతి ప్రగతి పుస్తకంలో వీరి గిరిజనులు కారని, కాకపోతే గిరిజన ప్రవృత్తిని స్వీకరించిన వారే చెప్పడం విశేషం. 1991 జనాభా లెక్కలను అనుసరించి ఈ బంజారాల రాష్ట్ర జనాభా ఆంధ్ర, తెలంగాణాలైన తెలుగు ప్రాంతాల్లో జనం 6,65,08,800 మంది ఉన్నారు.

భాషావ్యవహారాల లెక్కల ప్రకారం ఉర్దూకన్నా వీరి 'గోర్‌బావి' మాట్లాడే వారే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇందులో కేవలం బంజారాలు ఒక్కజాతే 45 లక్షలు ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

సమాజానికి వర్తిస్తాయి. ఈయన లాగే రస్సేల్, ఎంతో వెన్ కూడా ఈ జాతులు గురించి పలు అభిప్రాయాలు వెలుబుచ్చారు. కాకపోతే అన్ని వీరిది ఒకే సమాజం అని, భేదాలకు తావులేదన్న విషయంతో అంతా ఏకాభిప్రాయం వెలిబుచ్చారు.

భాషాపరంగా ఈ బంజారీలు మాట్లాడే భాష 9–11 శతాబ్దాల మధ్య రాజస్థానీ, హిందీ, గుజరాతీల మూలరూపం ఏదైతే ఉందో అదే ఈనాటి వీరి భాష అని తెలుస్తోంది. చరిత్ర పరిశోధకుల అంచనాల ప్రకారం పరిశీలిస్తే 'గోర్‌బోలి' భాష బంజారాల సమాజ ఔన్నత్యాన్ని చాటి చెబుతుంది. వీరిని పరిశీలిస్తే ఈ థీంలో భిన్నత్వంలో ఏకత్వం కలిగిందనడానికి బంజారాలేని దర్శనమని అభిప్రాయపడటంలో తప్పులేదనిపిస్తుంది.

బంజారా భాషకు లిపి లేకపోయినా ఇది నిస్సందేహంగా హిం ద్వార్స భాషా కుటుంబానికి చెందినదే అనేది చారిత్రక సత్యం. ఇప్పుడీ బంజారా తాలుకు గోత్రాలు–చారిత్రక ఆధారాలను గురించి పరిశీలిద్దాం! మనదేశ రక్షణ కోసం ప్రాణాలు సహితం లెక్కచేయక తనువులర్పించిన రాజపుత్రవంశానికి బంజారాలు చెందినవారన్న చారిత్రక ఆధారాలు కొన్ని అగుపిస్తున్నాయి.

అయితే భారతదేశాన్ని ఏలిన మొగలయి చక్రవర్తుల మీద

తిరుగుబాటు జరిపిన రాణాప్రతాప్‌సింగ్‌రసపుత్రవీరుడు, ఈ మహావీరుని సంతతికి చెందిన వారే బంజారాలుగా నేడు పిలువబడుతున్నారని చెబుతారు. ఈ రాజపుత్రులలో నాలుగు ప్రధానాంశాలు ఉండటం విశేషం. రాథోడ్, చౌహాన్, పనార్, జాదవ్ ఈ వంశాల నాలుగు రాజపుత్ర సంతతికి ప్రధాన గోత్రాలున్నాయి. వీరిలో సగోత్రకులతో పెండ్లి నిషిద్ధంగా భావిస్తారు.

కొంత కాలమయ్యాక ఈ నియమాలను అతిక్రమించిన కారణంగా రాథోడ్ వంశం నుండి బాణోత్ వంశం విడిపోవడం సంభవించింది. అయితే రాథోడ్ వంశంలో సగోత్రాలున్నాయి. చౌహాన్ వంశంలో 6 సగోత్రాలున్నాయి. 'పవార్' వంశంలో 12 సగోత్రాలుంటే 'జాదవ్' వంశంలో కూడా 52 సగోత్రాలు కనిపిస్తున్నాయి. మహావీరుడైన పృథ్వీరాజ్/'చౌహాన్' వంశానికి చెందినటువంటివారు. మహారాణాప్రతాప్ సింగ్ 'రాథోడ్' వంశానికి చెందిన వ్యక్తి.

నిశితంగా పరిశీలిస్తే బంజారాల వాస్తవ జీవన చరిత్ర వారు పాడుకునే పాటలలోను మరియు చెప్పుకునే జానపద కథలలోను దాగి వున్నదని చెప్పుకోవచ్చు. వారు అనుసరిస్తున్న పద్ధతులే వారి విశిష్టమైన సంస్కృతిని తెలియజేస్తుందని మనం భావించాలి.



ఇప్పటిదాకా వారి జీవనశైలి గురించి చెప్పుకున్నాం 'ఇప్పుడు బంజారాల సంస్కృతి సాంప్రదాయాల గురించి పరిశీలిద్దాం! బంజారా స్త్రీల వేషధారణ వారి జీవనశైలికి ప్రతిబింబాలుగా భావించాలి. వారి సాంప్రదాయకమైన దుస్తులు బంజారా స్త్రీలు ధరించేందుకు ఆసక్తి చూపుతారు. ఛాంటియా, కాళీ,ఫేటయా అనే త్రివిధాలైన దుస్తులు ధరించే స్త్రీలు అనేక రకాలైన ఆభరణాలు ధరించడం కద్దు, బంజారాలు చేపట్టే వృత్తులలో స్త్రీలకు భౌతిక రక్షణ కల్పిస్తుంది.

వందలాది సంవత్సరాల నుండి వారు వస్త్రధారణను కాపాడుకుంటున్నారు. బంజారాల్లో పురుషులు సామాన్యంగా నిరాడంబరమైన దుస్తులు ధరిస్తారు. ఆడ మగ తేడా లేకుండా బంజారా సమాజంలో అంతా కాయకష్టం చేస్తుంటారు.

వీరి సమాజంలో పెండ్లితంతు ఆడంబరంగా సాగుతుంది. ఆధునిక సమాజంలో హైందవ పద్ధతులకు ప్రాధాన్యతనిస్తుంటారు. వితంతు వివాహాల పూర్వబాగంగా బంజారాలో వస్తున్నది. అందరిలాగే అతిథి సత్కారాలు చేస్తారు. వారివారి ఔన్నత్యాన్ని పాటల రూపంలో పాడుతుంటారు. పచ్చబొట్లు పొడిపించుకోవడం వీరిలో సర్వసాధారణం. శాఖాహారంతోపాటు మాంసాహారం తినడం, తాగుడు అనేది కొన్ని ప్రత్యేక సందర్భాలలో ప్రాధాన్యత ఉంటుంది.

వీరి జీవనశైలి ఒకే విధంగా ఉండి, పెండ్లి వీడ్కోలు సమయాల్లో చాలా ఏళ్ల తర్వాత కలిసినప్పుడు వీరు పాడే పాటలు బంజారా సమాజ సంస్కృతికి అద్దంపట్టేదిలా ఉంటుంది. వీరిలో అభిమానం చాలా అధికం. హిందువుల్లాగే వీటి కొన్ని పండగలు అంటే దసరా, దీపావళి, హోళి, ఉగాది, శ్రీరామనవమి, వినాయక చవితి, సంక్రాంతి మొదలైన పండుగలకు తోడు 'థజ్' అనే పండుగను వీరు జరుపుకోవడం ఒక ప్రత్యేకత. ఈ థీజ్‌నే మొక్కల పౌర్ణమి అంటారు. ఆడ దేవతలతోబాటు బాలాజీవి, గణపతి, శివుడు, ఆంజనేయుడిని, శ్రీరామచంద్ర మూర్తి మొదలైన దేవతల్ని కొలుస్తారు. వీరు నివసించే ప్రాంతాన్ని తండాలని పిలుస్తారు. ప్రతి తండాకు ఆ నాయకుని పేరు పెట్టుకుంటుంటారు.

బ్రతుకుతెరువు విషయకంగా బంజారాలు ప్రధానవృత్తి వ్యవసాయం. అదీగాకుండా పశుపోషణ ప్రాధాన్యతనిస్తారు. నేడు ఈ బంజారా జాతి వారనేకులు బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండటం అభిలాషణీయం.

ఇండియాలో వీరిని 44 పేర్లతో పిలుస్తున్నట్లు చెబుతున్నారు చరిత్రకారులు వీరి సాంఘిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకానేక పథకాలు అమలు చేసు-న్నాయి. ఈ తండాల వారికోసం రోడ్లు, రక్షిత నీటివసతులు, విద్యుత్, రవాణా సౌకర్యాలు కల్పిస్తూ ప్రాథమిక పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్ యార్డులు మొదలైనవి ఏర్పాటు చేయగలిగేందుకు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తున్నది.

ఉద్యోగాలలో, స్కాలర్‌షిప్‌లలో రాజకీయాలలో వీరికి కొన్ని వెసులుబాట్లు ఆయా ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. వారికీ మంచిరోజులొస్తున్నాయి అనడానికి హక్కులను గుర్తిస్తూ వారి సంపూర్ణాభివృద్ధి కొరకు చేపట్టిల్సిన అన్ని కార్యక్రమాలు చేపట్టడం ఇటుపై ఆయా ప్రభుత్వాలపై ఉంది.

భవిష్యత్తులో వారి చరిత్ర కూడా చక్కని సంస్కృతీ సంప్రదాయాలకు సెలవు కాగలదై ఆదర్శవంతమైనదవ్వాలని ఆశిద్దాం !

*– డా॥ మంతెన సూర్యనారాయణ రాజు*

# పది చేతుల ఆత్మీయత

**ఆత్మహత్యలు చేసుకున్న రైతుల ఇంట్లో మళ్లీ దీపం వెలిగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయంకోసం ప్రత్యేక కార్యాచరణ...**

**భవిష్యత్‌పై భరోసానిస్తున్నా.. కొద్దికాలంలోనే సమస్యలు తీరేందుకు అనేక మార్గాలు చూపిస్తున్నా, అండగా ఉంటాం.. అధైర్యపడొద్దని ధీమా కల్పిస్తున్నా.. బలహీన క్షణాల్లో బతుకు చాలిస్తున్న రైతుల కుటుంబాల ను మళ్లీ నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠమైన కార్యాచరణను అమలు చేస్తున్నది. బాధిత కుటుంబాలకు చెల్లించే పరిహారాన్ని పెంచడంతోపాటు.. ఆయా కుటుంబాల అవసరాలు తీర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని ప్రభుత్వ పథకాలను వారికి అందజేస్తున్నది.**

రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు ఉన్న ఉత్తర్వుల్లోని 'అదనపు సాయం' అనే మాటలోని అంతరార్థాన్ని, స్ఫూర్తిని నూటికి నూరుశాతం అమలు చేస్తున్నది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలనేకాకుండా అంతకుముందు మరణించిన వారి కుటుంబాల బాధ్యతను కూడా భుజాన వేసుకుంటున్నది.

ఇప్పటి వరకు 673 మంది రైతులు చనిపోయినట్లుగా రికార్డుల్లోకి రాగా, క్షేత్ర స్థాయిలో ఆర్డీవో/సబ్‌కలెక్టర్‌లు ఛైర్మన్‌గా, డీఎస్పీమెంబర్ కన్వీనర్‌గా, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ సభ్యులుగా ఉన్న కమిటీ విచారణ చేసి వాస్తవమైన కేసులుగా గుర్తించిన వాటికి వెంటనే పరిహారం ఇవ్వడంతో పాటు ఆయా కుటుంబాలను ఆదుకుంటున్నది.

ఇప్పటివరకు రైతులు మరణించిన 583 ఘటనలపై విచారణ జరిపిన కమిటీ.. 305 మంది ఆత్మహత్యలను వాస్తవమైన కేసులుగా గుర్తించింది. అందులో ఇప్పటికే 295 ఘటనల్లో పరిహారం అందించారు. మిగతా వారికీ చక చకా పరిహారం అందించే చర్యలు చేపడుతున్నారు. ఒక్క పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోకుండా ఆ కుటుంబాన్ని ఆర్థికంగా, సామాజికంగా నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను పెను విషాదం నుంచి బయటపడేసి, అవసరమైన భరోసా ఇవ్వడానికి పరిహారంతోపాటు అవసరాన్ని బట్టి అదనపు సహాయం అందజేయాలన్న సీఎం కే. చంద్రశేఖర్‌రావు ఆదేశాల్లోని స్ఫూర్తిని అర్థం చేసుకుంటున్న అధికారులు.. విస్తృత స్థాయిలో ప్రభుత్వ పథకాలను బాధిత కుటుంబాలకు వర్తింపజేస్తున్నారు. అవసరమైతే నిబంధనలు సడలించి మరీ బాధిత కుటుంబాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు.

బాధిత కుటంబాల్లో చదువులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలి ఆదేశించిన సీఎం.. అలాంటి పిల్లలను హాస్టళ్లలో చేర్పించాలని, కుటుంబానికి ఇల్లు లేకపోతే వెంటనే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, కుటుంబాల్లోని అర్హులకు పెన్షన్లు ఇవ్వాలని సూచించన సంగతి తెలిసిందే. వీటితో పాటు ప్రభుత్వం తరపున ఇతర ఆర్థిక పథకాలు కూడా ఆ కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందులో ముఖ్యంగా దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు, అంత్యోదయ, ఆహార భద్రత కార్డులు ఇవ్వాలని ఆదేశించారు.

భర్తను కోల్పోయిన మహిళలు రైతులుగా మారి, ధీమాతో వ్యవసాయం చేయడానికి వీలుగా 50 శాతం సబ్సిడీతో విత్తనాలు, స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయం చేయడానికి వీలుగా 50 శాతం సబ్సిడీతో విత్తనాలు, స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు

అందివ్వాలని నిర్ణయించారు. వారి ఇష్టాన్ని బట్టి 50% సబ్సీడీతో బర్రెలు, గొర్రెలు కూడా ఇవ్వడం ద్వారా వారి ఆర్థిక స్థిరత్వానికి నమ్మకం కల్పించాలని నిర్ణయించారు.

బాధితుల్లో ఎస్సీ, ఎస్టీలుంటే.. వారి వ్యవసాయ భూముల్లో పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో బోరు బావులు తవ్వించి, పైపులైన్లు వేసి, కరెంటు కనెక్షన్ తెచ్చి, మోటార్లు బిగించి వ్యవసాయం చేసుకునేలా అండగా నిలవాలని సీఎం ఆదేశించారు. నల్లగొండ, మెదక్‌లాంటి జిల్లాల్లో సీఎం ఆదేశాలను పూర్తి స్థాయిలో అధికారులు అమలు చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 23 కుటుంబాలకు ఇందిరా ఆవాస్ యోజన కింద పక్కా ఇండ్లు నిర్మించారు. 11 కుటుంబాలకు వ్యవసాయ భూముల్లో బోర్లు తవ్వించారు. మోటార్లు పెట్టి, కరెంటు కనెక్షన్ ఇచ్చారు.

12 మంది విద్యార్థులను హాస్టళ్లలో చేర్పించి చదివిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి కల్పనకోసం ఆటోలు కొనిచ్చి, కూరగాయల దుకాణాలు నడిపించుకునే ఏర్పాట్లు చేశారు. వారిపిల్లలకు గురుకులాల్లో అడ్మిషన్లు ఇప్పించడంతో పాటు పందిరి కూరగాయల సాగుకు లక్ష వరకు సబ్సిడీతో రుణసహాయం అందించడంలాంటి చర్యలు చేపట్టారు. ఇదే తీరుగా మాతృత్వ సహాయోజన పథకం కింద నగదు సహాయం కూడా అందిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ప్రభుత్వం 76 కుటుంబాలకు ఇటువంటి సహాయం అందించింది.

గిరిజన ప్రాంతాలలో ఐటీడీఏ పథకాల్లో వీరికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వమే పెద్ద దిక్కుగా నిలిచిందరన్న విశ్వాసం కల్పించారు. అదే సమయంలో ఆత్మహత్య చేసుకు రైతు కుటుంబాలకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ. 1.50 లక్షల నుంచి ఏకంగా రూ. 6 లక్షలకు పెంచారు. ఇందులో లక్ష రూపాయలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద అప్పులు తీర్చడానికి, మిగిలిన రూ. 5 లక్షలు ఆ కుటుంబానికి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారు.

## తొలినుంచి రైతుకు భరోసానిస్తున్న కేసీఆర్

గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోకపోవడంతో వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిన్నది. రైతులను పట్టించుకోకపోవడంతో వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిన్నది. రైతులు అప్పుల పాలయ్యారు. ఈ స్థితిని ఉద్యమ కాలంలో స్వయంగా చూసిన కేసీఆర్.. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష రూపాయల వరకు రైతులకు రుణమాఫీ చేస్తానని ప్రకటించి.. అమలు చేసి రుణమాఫీ కింద రెండవ ఏడాది వాయిదాలు కూడా బ్యాంకులకు వెళ్లాయి. ఇక్కడితో సంతృప్తి చెందని సీఎం.. ఆ వెంటనే పంటల భీమాను యూనిట్‌గా కాకుండా రైతు వారీగా చేయాలని తీర్మారం చేసి.. కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. వ్యవసాయానికి ఏడు గంటలపాటు సమయంవారీగా విద్యుత్ సరఫరా చేశారు.

ఒక దశలో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన విద్యుత్‌ను అవశేష ఆంధ్రప్రదేశ్ ఇవ్వకపోయినా బయటినుంచి అధిక ధరకు కొనుగోలు చేసి మరీ ఇబ్బంది లేకుండా చూశారు, అలాగే 2016 ఏప్రిల్ నుంచి రైతులకు పగటిపూట ఏకంగా 9 గంటల విద్యుత్ ఇవ్వడానికి పటిష్ఠ కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు ట్రాన్స్‌మిషన్ లైన్స్, డిస్ట్రిబ్యూషన్ లైన్స్ అప్‌గ్రేడ్ చేసే పని వేగంగా జరుగుతున్నది. అలాగే సబ్ పంటలకు శాస్త్రీయ సహకారం

తెలంగాణ జిల్లాల్లో ప్రాంతానికో తీరుగా వాతావరణ పరిస్థితుల ఎన్నాయి. భూమి రకాల్లోనూ తేడాలున్నాయి. వీటన్నింటిని పరిశీలించి, భూసార పరీక్షలు నిర్వహించి, మార్కెట్ స్థితిగతులను పరిశీలించి పంటలు వేయిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది.

రాష్ట్రంలో కూరగాయల అవసరం ఎంత ఉన్నది? బయటి ప్రాంతాల నుంచి ఏయే ఆహార ధాన్యాలు తెచ్చుకుంటున్నాము? అనేది పరిశీలించి ఇక్కడ ప్రజలకు సరిపోయేంత ఆహార ధాన్యాలు పండించేందుకు ప్రభుత్వ శాస్త్రీయమైన ప్రోత్సాహం ఇస్తున్నది.

ఇందులో భాగంగానే వేయి మంది వ్యవసాయ విస్తరణ అధికారుల ను నియమించడానిరి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రైతులు ఏ పంటలు వేయాలి? వాటిని ఎలా కాపాడుకోవాలి? అధిక దిగుబడి వచ్చేందుకు ఏం చేయాలి? అనే అంశాలపై రైతుకు లాభసాటిగా మార్చుతారు. క్రమంలోనే అగ్రికల్చర్ ప్లాన్ తయారు చేస్తున్నారు.

గతంలో ఎప్పుడు చూసినా విత్తనాలకోసం, ఎరువులకోసం కిలోమీటర్ల కొద్దీ రైతుల క్యూలు కనిపించేవి. ఇప్పుడా పరిస్థితి పోయింది. విత్తనాలు, ఎరువులకు కొరత లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

◆

# యువతకు వివేకానంద సందేశం



## వివేకానంద జీవితము

**భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మిక వేత్తలలో స్వామి వివేకానంద ఒకరు. మన భారతదేశంలో వివేకనందుని పేరు తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు.**

స్వామి వివేకనంద అసలుపేరు నరేంద్రనాథ్‌దత్తా ఈయన 1863, జనవరి 12న కలకత్తా నగరంలో విశ్వనాథ్ దత్తా, భువనేశ్వరి దేవి దంపతులకు జన్మించాడు. నరేంద్రుడు చిన్నతనం నుండి చదువుల్లో, రామయణ మహభారతాలలో తన తల్లి ప్రోత్సాహంతో నిష్ణాతుడైనాడు.

రామకృష్ణ పరమహంస పరిచయంతో నరేంద్రనాథ్ ఆధ్యాత్మిక ప్రపంచంలో లీనమైపోయాడు. రామకృష్ణ పరమహంస మరణం తరువాత నరేంద్రుడు "తనను తానుగా" "స్వామి వివేకనందా" గా ప్రకటించుకొని గొప్ప ఆధ్యాత్మికవేత్తగా ఎదిగాడు.

1893 లో చికాగో నగరంలో జరిగిన సర్వమత మహాసభలో "నా అమెరికా దేశ సోదర సోదరిమణులరా" అంటూ అమెరికా దేశ ప్రజలను మంత్ర ముగ్ధులను చేసిన ఘనత వివేకనందాకే దక్కుతుంది.

అతి తక్కువ వయస్సులోనే దేశ యువతలో ప్రజలలో ఆత్మవిశ్వసాన్ని, దృఢమైన సంకల్పా నింపి అతి తక్కువ వయస్సులో 57 సవంత్సరాల కే 1920 లో మరణించాడు.

## "యువతా మేలుకో"

ఓ నా దీరవత్సలారా! మీరందరూ మహత్కర్యాలు సాధించడానికి జన్మించామని విశ్వసించండి. కుక్క పిల్లల అరుపులు (ఇతరులు చేసే నిందలు) మిమ్మల్ని భయపెట్టుకుండుగాక! అంతేకాదు. ఆకాశం నుండి పిడుగులు పడినా మీరు చలించరుగాక!

లే॥ లేచి నిలబడు ధైర్యంగా బలిష్టంగా ఉండు. మొత్తం బాధ్యతనంతా నీ భుజస్కందాల పైన వేసుకో, నీ భవిష్యత్‌కు నీవే బాధ్యుడువని తెలుసుకో నీకు కావాల్సిన బలం, శక్తి... అన్ని నీలోనే దాగి ఉన్నాయి.

ఇప్పటితరం యువతపైన నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది వారి

---

**జనవరి 12 వివేకనంద 153వ జయంతి మరియు జాతీయ యువజనోత్సవం**

---

## వివేకనందా సూక్తులు

- మనిషికి వెలుగునిచ్చి మనోవికాసానికి తోడ్పడేది విద్య
- అపజయాలను లక్ష్య పెట్టకండి అవి వాటిల్లడం సహజం. అవి జీవితానికి అందం చేకూరుస్తాయి.
- ఏది స్వార్థపరమో అదే అవినీతి స్వార్థరహితమైనదేదో అదే నీతి
- పవిత్రంగా వుంటూ ఇతరులకు మేలు చేయడమే పూజల న్నింటి సారం.
- అసత్యం కన్నా సత్యం అనంత రెట్లు బరువైంది. మంచితనం కూడ అంతే.
- సత్యానికై దేనినైనా త్యజించవచ్చు కాని దేని కొరకైనా సత్యాన్ని త్యజించకూడదు.
- ధీరులు సత్యమార్గాన్ని ఎప్పుడు తప్పరు
- ముందు స్వచ్ఛంగా వుండు అప్పుడు అధికారం వస్తుంది
- అనుభవాల క్రమమే జీవితం అనుభవమే గురువు
- ఆత్మవిశ్వాసం సడలితే ఓటమి ప్రారంభం అయినట్లే.
- ఈ లోకాన్ని ఏ ఇద్దరు ఒకే మాదిరిగా చూడరు
- స్వర్గంలో జీవించడానికి ఈ ప్రపంచంలో జీవించడానికి తేడా లేదు.
- నీవు ఏ పరిస్థితులో ఉన్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవల్సిన పనులు అవే జరుగుతాయి.
- నిరుపేదల కష్టాలను చూసి ద్రవించే హృదయం కలవాడే మహాత్ముడు.

నుండే నా కార్యనిర్వహకులు రాగలరు. సింహం వలె వారు నా సమస్యనంతటిని పరిష్కరిస్తారు. నేను ఒక ఆదర్శాన్ని నిర్మించుకొని దానికై నా జీవితం అంకితం చేశాను.

మొదట మన యువకులు బలిష్టులు కావాలి! ముఖ్యంగా నా యువ సోదరులకు చేసే విజ్ఞప్తి ఇదే. మనకు కావాల్సింది బలం, ఆత్మవిశ్వాసం కాబట్టి మీ నరాలను దృఢతరం చేసుకొండి. మనకు కావల్సింది ఇనుప కండలు, ఉక్కు నరాలు కావాలి. ముందు బలిష్టులు కండి! బలహీనులై ఉన్నప్పుడు భగవద్గీత పారాయణం కన్నా "పుట్‌బాల్" ఆటనే మిమ్మల్ని త్వరగా మోక్ష మార్గానికి తీసుకొని వెళుతుంది. మనం చాలా విలపించాం. విలపించింది చాలు. మీ కాళ్లపై మీరు నిలబడి మనుష్యులుగా ఎదగండి.

విమర్శించడం విడిచిపెట్టండి. ఎదుటివారు చేసే పని మంచిదైతే మీకు చేతనైనా సహాయం చేయండి వారు తప్పుద్రోవ పడుతున్నారనిపిస్తే వారి తప్పులను సున్నితంగా తెలియజేయండి. ఒకరినొకరు తప్పు పట్టుకోవడమే అన్ని అనార్థాలకు మూలం.

అపజయాలను లక్ష్యపెట్టకు. అవి వాటిల్లడం సహజం ఈ అపజయాలు జీవితానికి అలంకారప్రాయాలు. ఇవి లేని జీవితం ఒక జీవితమేనా? పోరాటానికి సంసిద్ధం చేసేవి ఈ అపజయాలే కదా! ఇవే జీవిత సౌరభాలు! కాబట్టి ఈ పొరపాట్లను ఈ పోరాటాల ను లక్షించవద్దు. ఆవు అసత్యమాడదు నిజమే కాని అది ఎప్పటికి అవి! మనుషి కాలేదు. కాబట్టి అపజయాలచే నిరుత్సాహపడకండి. లక్ష్య సిద్ధికై వెయ్యిసార్లు ఓటమి వాటిల్లినా, ఇంకొక సారి మళ్లి ప్రయత్నించండి.

విద్య మనిషి జీవితానికి వెలుగునిస్తుంది. అతని వికాసానికి నడవడికకు అది ఎంతో తోడ్పడుతుంది మనుషులను తేజోమయం చేస్తుంది.

*– దొడ్డి కుమార్, జూకల్, శంషాబాద్, రంగారెడ్డి*

*'నిరంతరం వెలిగే సూర్యున్ని చూసి చీకటి భయపడుతుంది నిరంతరం శ్రమించే వాడిని చూసి ఓటమి భయపడుతుంది"*

– స్వామి వివేకానంద

# వాతావరణ మార్పులు - ప్రజల విధానం

"ప్రతి దేశానికి పల్లెసీమలే పట్టుకొమ్మలాంటివి - పల్లెలు వృద్ధి చెందితేనే దేశం వృద్ధి చెందుతుంది"

*- మహాత్మాగాంధీ*

**ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న పలు పర్యావరణ సమస్యల్ని ఆయన దశాబ్దాల క్రితమే ఊహించారు. 'భౌతిక సదుపాయాలు కొంత వరకు అవసరమే. ఒక స్థాయి దాటితే మాత్రం అవి సహాయకారిగా కాకుండా అవరోధాలుగా పరిణమిస్తాయి. అంతులేని కోరికల్ని తీర్చుకోగలమన్నది కేవలం భ్రమే కాదు, అది ఉచ్చులో చిక్కు చూసి, ఎంతపని చేశామని బాధపడే రోజు వస్తుంది అని ఆయన ఏనాడో హెచ్చరించారు. ఆయన ఆనాడు హెచ్చరించిన విధంగానే వాతావరణ మార్పు నేడు తీవ్ర దుష్ప్రభావం ప్రసరిస్తోంది.**

శాంతిపథగామిగానే ప్రపంచానికి తెలిసిన బాపూజీలో ఒక పర్యావరణ శాస్త్రవేత్త దాగున్న సత్యాన్ని ఆయన రచనలు, ఉపన్యాసాలు చాటిచెబుతున్నాయి. ప్రపంచం నెత్తిమీద కత్తిలా ఉత్పాతం వేలాడుతున్న వాస్తవాన్ని ఏడో దశకం ఆరంభంలోనే స్మాల్ ఈజ్ బ్యూటిఫుల్ (షుమాకర్ -1973), లిమిట్స్ టు గ్రోత్ (మిడోస్ -ఎట్ ఆల్ - 1972) లాంటి పుస్తకాలు కళ్లకు కట్టినప్పటికీ ముఖ్యంగా సంపన్న దేశాల మస్తకాలకు అలాంటి వాస్తవాలు ఎక్కలేదు. మేలైన దిద్దుబాటు చర్యలకు వీలు చిక్కలేదు. పర్యవసానమే నేటి దుర్భర దురవస్థ.

మహాత్మా గాంధీ ఊహించినట్లుగా ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్న భూతాపం వల్ల మన భారతదేశానికి పట్టుకొమ్మలాంటి పల్లెసీమలు ఇప్పుడు ఈ భూతాపం (భూమి వేడెక్కడం) వల్ల బలి అయ్యే స్థితికి వచ్చాయి. భూతాపానికి ముఖ్య కారణం మానవుని కార్యకలాపాలే అని ఆనాటి కాలంలోనే మహాత్మాగాంధీ తెలియజేశారు. ఈ భూతాపం పల్లెలపై చూపే ప్రభావాల గురించి మనం ఇప్పుడు క్లుప్తంగా తెలుసుకుందాం.



## భూతాపానికి 120 ఏళ్ళ చరిత్ర

- 1896లో గ్లోబల్ వార్మింగ్ గురించి ప్రపంచానికి తొలిసారిగా తెలియజేసిన శాస్త్రవేత్త స్వీడన్‌కు చెందిన స్వాంటే అర్హేనియస్ (1859-1927). వాతావరణంలోని సీఓ2 మోతాదుకు వాతావరణ ఉష్ణోగ్రతకు సంబంధం ఉంటుందని ఆయన వెల్లడించారు.
- 1995లో గిల్బర్ట్ ప్లాస్ అనే శాస్త్రవేత్త వాతావరణంలో సీఓ2 మోతాదు ఎంతగా పెరుగుతూ ూఉంటే పరారుణ రేడియో ధార్మికతను వాతావరణం అంత ఎక్కువగా గ్రహిస్తుందని, తద్వారా ఉష్ణోగ్రత పెరుగుతుందని ఈయన పరారుణ స్పెక్ట్రోస్కోపీ అనే కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో వెల్లడించారు.
- 1950ల చివరన, 1960ల మొదట్లో చార్లెస్ కీలింగ్ అనే శాస్త్రవేత్త, నాడు అందుబాటులో వున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అంటార్కిటికా, మౌనాలోవాల్లోని (హవాయి ద్వీపం) కార్బన్‌డయాక్సైడ్ ఎలా పేరుకుపోతుందో వీటి ద్వారా స్పష్టమైంది.

## భూతాపోన్నతి అంటే ఏమిటి?

సూర్యరశ్మితో నేల వేడెక్కుతుందన్నది మనకు తెలిసిన విషయమే. మరి భూమి వేడెక్కాలంటే భూమిపై పడే మొత్తం సూర్యరశ్మి అవసరమవుతుందా! ఊహూ! కొంత మొత్తం సరి పోతుంది. మిగిలిన వేడి వాతావరణం గుండా ప్రయాణించి తిరిగి అంతరిక్షంలోకి వెళ్లిపోతుంది. సాధారణంగా జరిగే ఈ ప్రక్రియను గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ అంటారు. అయితే సుమారు 200 ఏళ్ల నుంచి ఇంకోలా చెప్పాలంటే పారిశ్రామిక విప్లవం మొదలైనప్పటి నుంచి అంతరిక్షంలోకి వెళ్లిపోవాల్సిన వేడిలో కొంత వాతావరణంలోనే ూండిపోతోంది. కార్బన్‌డైయాక్సైడ్ మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి విషవాయువులు దీనికి కారణమవుతున్నాయి.

పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల విచ్చలవిడి వాడకం, పారిశ్రామిక కాలుష్యం, అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం ద్వారా ఇవి వాతావరణంలోకి చేరుతున్నాయని అంచనా. కాల క్రమంలో వాతావరణంలో వీటి మోతాదు ఎక్కువవుతూ ూండటంతో భూ వాతావరణం సగటు ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. దీన్నే మనం భూతాపోన్నతి అని పిలుస్తున్నాం! ఈ విష వాయువులన్నింటిని

కార్బనడైయాక్సైడ్‌ను ప్రామాణికంగా తీసుకుని లెక్కిస్తున్నారు. మిగిలిన గ్రీనౌస్ వాయువులను కూడా వాటి మోతాదు, అవి వాతావరణంలో వుండే సమయాలను కార్బన్‌డైయాక్సైడ్‌తో సరిపోల్చి లెక్కగడతారన్నమాట!

| | |
|---|---|
| ప్రస్తుతం వాతావరణంలో ఉన్న సిఓ2 మోతాదు ప్రతి పది లక్షల కణాలకు 400 కణాల సిఓ 2 ఉందని అర్థం | 400 పిపిఎమ్ (పార్ట్స్ ఫర్ మిలియన్) |
| పాతికేళ్ల తర్వాత వాతావరణంలోని సిఓ2 మోతాదు | 450 పిపిఎమ్ |
| ఏటా వాతావరణంలో అదనంగా చేరుతున్న సిఓ2 మోతాదు | 2.1 |
| సిఓ2 మోతాదులను గణనీయంగా తగ్గించేందుకు ప్రయత్నాలు జరగకపోతే 2040 నాటికి పెరిగే ఉష్ణోగ్రత | 2 డిగ్రీలు |

## ప్రమాద ఘంటికలు.....

భూమి వేడెక్కుతోంది. వాతావరణం విపరీత మార్పులకు లోనవుతోందని తరచూ వింటున్నాం. అంతేకాదు ఆ ప్రకృతి బీభత్సాన్ని అనుభవిస్తున్నాం. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ఏడాది డిసెంబర్లోనూ మాడు పగిలే ఎండలు ఒకవైపు ఇబ్బంది పెడుతుంటే. మరోవైపు వర్షాలు నగరాలను ముంచెత్తుతున్నాయి. ఇదే ఆ విపరీత మార్పుకు నిదర్శనం. అయితే ఈ పరిస్థితులు మన దగ్గరే వున్నాయా? లేక ప్రపంచమంతా ఇలాగే ముంచుకొస్తున్న ప్రమాదాన్ని శాస్త్రవేత్తలు ఎలా గుర్తిస్తున్నారు! అనే ఆసక్తికరమైన ఈ ప్రశ్నలకు సమాధానాలు

## వేసవి మంటల రికార్డుల మోత

వేసవి వచ్చిందంటే చాలు ఏడాదికేడాది కొత్త వుష్ణోగ్రతలతో రికార్డులు బద్దలవుతున్నాయి. ఈ ఏడాది చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరంగా రికార్డు సృష్టించింది. గతేడాది పరిస్థితి కూడా దాదాపుగా ఇలాగే ఉంది. గత 13 ఏళ్లలో అత్యధిక ఉష్ణోగ్రతల రికార్డు పదిసార్లు బద్దలైందంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది భారత్‌లోనే దాదాపు 2500 మంది వడగాడ్పులతో మృత్యువాత పడ్డారు. అంతర్జాతీయ వాతావరణ విభాగం అంచనాల ప్రకారం గత ఐదేళ్ల కాలంలో కూడా అత్యధిక వుష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచుయుగం తర్వాత సగటు ఉష్ణోగ్రతలు 13 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు చేరేందుకు 12500 సంవత్సరాలు పట్టింది. 2100 సంవత్సరంకల్లా గ్లోబల్ వుష్ణోగ్రతలో వృద్ధి 1.1-6.4 డిగ్రీలుగా ఉంటుంది.

## కరిగిపోతున్న హిమనదాలు

ఉపగ్రహాల ద్వారా తీసిన ఛాయా చిత్రాల ప్రకారం మంచుఖండం ఆర్కిటిక్ ప్రాంతంలో మంచువిస్తీర్ణం ఏటికేటికీ తగ్గిపోతుంది. ఈ ప్రాంతంలో నౌకాయానం పెరగటం, ముడిచమురు నిక్షేపాల తవ్వకాలతో ఈ ప్రాంత పర్యావరణం ప్రమాదంలో పడింది. ఫలితంగా ధ్రువపు ఎలుగుబంట్లు, సీల్ల వంటి సముద్రపుజీవుల మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. కెనడ, ఆలస్కా ప్రాంతాల్లో జరిపిన అధ్యయనాల ద్వారా అక్కడి దాదాపు 118 హిమనదాలు వేగంగా కరిగిపోతున్నట్లు స్పష్టమైంది. 1991-2013 మధ్యకాలంలో 7,500 టన్నుల మంచు కరిగిపోయిందని అంచనా.

## సముద్రాల్లో వేడి

సముద్రాల్లో అరమైలు లోతు వరకూ ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. వేల సంఖ్యలో ఏర్పాటుచేసి తేలియాడే సెన్సర్లు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సముద్రపు జలాల వుష్ణోగ్రతలు ఎక్కువ కావడం పగడపు దిబ్బల (కోరల్ రీఫ్స్)కు నష్టం కలిగిస్తాయి. సముద్రపు వుపరితలంపై వీచే గాలుల ఉష్ణోగ్రతలు కూడా పెరగటంతో, తీర ప్రాంతాల్లో ఆర్ధత (హ్యుమిడిటీ) పెరిగిపోతోంది. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో ఆకస్మాత్తుగా కుంభవృష్టి కురుస్తోంది. వెచ్చటి ఉపరితల జలాలు తుఫాన్లకు కారణమవుతున్నాయి.

## సముద్ర మట్టం పెరుగుతోంది

సముద్ర మట్టం కూడా పెరుగుతున్నట్లు వుపగ్రహ ఛాయా చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్కిటిక్ ప్రాంతపు మంచు వేగంగా కరిగిపోవడం మొదలైతే ఇది మరింత ఎక్కువవుతుందని అంచనా. ఫలితంగా తీర ప్రాంతాల్లోని మహానగరాల అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కరిగి నీరవుతున్న హిమాలయాలు

బొగ్గు తదితర శిలాజ ఇంధనాలను విద్యుదుత్పత్తి వంటి అవసరాలకు భారీఎత్తున ఉపయోగిస్తుండటంతో వాతావరణంలో గత 60 ఏళ్లలో ఉద్గారాలు పెరిగాయి. ఫలితంగా భూమి ఉష్ణోగ్రతలు అధికమయ్యాయి. దీంట్లో భాగంగానే భారత ఉపఖండం సగటు ఉష్ణోగ్రతలు కూడా అంతకుముందుకంటే పెరిగాయి. ఈ మార్పు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. హిమాలయాల్లోని మంచుకొండలు కరిగి నీరవుతున్నాయి. వుత్తరాదిన పంటలసాగుపై ముఖ్యంగా గోధుమపై పెరిగిన వుష్ణోగ్రతల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. గత కొన్నేళ్లుగా పెరిగిన వేడిని గోధుమ రకాలు తట్టుకుంటూ నిలుస్తున్నప్పటికీ, వాటి గరిష్ట పరిమితికి పరిస్థితులు చేరుకున్నాయని. ఇంకా ఉష్ణోగ్రత పెరిగితే గోధుమ సాగు సాధ్యం కాకపోవచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

## కరువు వరద

వాతావరణ సమతుల్యత లోపించటం, రుతుపవనాల క్రమం దెబ్బతినడంతో వర్షపాతంల్లో స్థిరత్వం ఉండటం లేదు. దీర్ఘకాలంపాటు వర్షాలే లేకపోవటం. ఆకస్మాత్తుగా కుంభవృష్టి పడి నదులు పొంగిపొర్లి

జనజీవనం అతలాకుతలం కావటం, ఈ విధంగా అయితే కరువు, లేదంటే వరదలు అన్న పరిస్థితి తరచూ ఎదురవుతోంది. భూమి ఉష్ణోగ్రత మరింత పెరిగితే వాతావరణంలో ఈ అనిశ్చితి మరింత అధికమవుతుంది. భూమిసారం కోల్పోతుంది. దీనిని నివారించాలంటే ప్రభుత్వస్థాయిలో పలుచర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ మార్పులను అధ్యయనం చేయటానికి ప్రభుత్వం అందుబాటులో వున్న అత్యాధునిక సాంకేతికతను వుపయోగించుకోవటం. తద్వారా కరువు, వరదల వంటి పరిస్థితుల ను ఎదుర్కోవటానికి ముందస్తుగానే సిద్ధమవటం. కర్బన ఉద్గారాలను తగ్గించే చర్యలను చేపట్టటం, వర్షపు నీరు వృధాకాకుండా చెరువులు, కుంటలకు నీటిని మళ్లించటం. తద్వారా వర్షాభావ సమయాల్లో సాగు, తాగునీటికి కొరత లేకుండా చూడటం వంటివి ప్రభుత్వస్థాయిలో జరగాల్సిన పనులని నిపుణులు పేర్కొంటున్నారు.

## సాగుకు కీలకం వర్షాలే

మనదేశంలోని 125 కోట్ల జనాభాలో దాదాపు 72 కోట్ల మంది జనం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇందులో పల్లెలలో నివసిస్తున్న ప్రజలందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. దేశవ్యాప్తంగా సాగయ్యే పంటపొలాల్లో మూడింట రెండొంతులు వర్షపాతంపైనే ఆధారపడుతున్నాయి. మూడోవంతు పొలాలకు మాత్రమే కాల్వాల వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాగునీరు అందుతోంది.

*వాతావరణ మార్పులు ప్రజల జీవన విధానంపై చూపే ప్రభావాలు:*

- ☆ మన దేశంలో గ్రామాలలోని ప్రజల భూమిని నమ్ముకొని జీవిస్తున్న వారు వర్షాలు లేక వీరి జీవితాలు చెప్పలేని స్థితికి మారిపోతాయి
- ☆ త్రాగునీటి సమస్య ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తుంది
- ☆ పంటలు పండక, వేసిన పంటలు చేతికి రాక, చేసిన అప్పులు తీర్చ లేక ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు
- ☆ కరువు కాటకాలు రావడంతో గ్రామాలలోని ప్రజలు పట్టణాలకు వలస వెళ్ళడం జరుగుతుంది.
- ☆ అర్థం కాని వ్యాధులతో గ్రామీణప్రాంతాలలోని ప్రజలు పురుగుల మాదిరి ఎక్కడికి అక్కడ రాలిపోతారు
- ☆ భూమి మీద జీవరాశుల మనుగడకు తీవ్ర ముప్పు వాటిల్లుతుంది
- ☆ భూమి వేడెక్కడం వలన మంచు పర్వతాలు కరిగి సముద్ర మట్టాలు పెరగడంతో సముద్రానికి దగ్గరగా వున్న గ్రామాలు సముద్రంలో మునిగి కొట్టుకుపోతాయి. దీంతో సముద్రం దగ్గరలోని గ్రామాల పరిస్థితి చాలా అగమ్యగోచరంగా వుంటుంది.
- ☆ అకాల వర్షాలు, తుఫాన్‌లు, వరదలతో పంట నష్టం, ఆహార కొరత ఏర్పడి మానవాళికి తీరని ముప్పును కలిగిస్తుంది
- ☆ ఉష్ణోగ్రతలు ఇదే స్థాయిలో పెరుగుతూ పోతే భూమిపై మనిషి మనుగడ మరింత కష్టమవుతుంది. వాతావరణ మార్పుల కారణంగా చాలా ప్రాంతాల్లో విపరీతమైన నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. తరుచూ పలకరించే కరువులు, వడగాడ్పులు, ఆకస్మిక కుంభవర్షాలతో విపరీతమైన ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగుతాయి. నీటి కొరత, వాతావరణ మార్పుల ప్రభావంతో వరి, గోధుమ వంటి పంటల దిగుబడులు దాదాపు 30 శాతం వరకూ తగ్గవచ్చునని అంచనా.

*వాతావరణ మార్పులు వలన మానవ ఆరోగ్యంపై చూపే ప్రభావాలు:*

- ☆ భూతాపోన్నతితో వచ్చే వాతావరణ మార్పులు మన ఆరోగ్యంపై కూడా తీవ్ర చూపుతాయి. కొన్ని చోట్ల స్వైన్‌ఫ్లూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు విజృంభిస్తే.. మరికొన్ని చోట్ల తరుచూ వీచే వడగాల ్పులతో ప్రాణాలు హరిమంటాయి!
- ☆ ప్రతి ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుదలకు మరణాల రేటు 2 నుంచి 5 శాతం వరకు పెరుగుతుందని అంచనా.
- ☆ ఆకాశహర్మ్యాల కారణంగా గాలి ద్వారా వేడిమి ఒక చోటి నుంచి మరోచోటికి వెళ్లె అవకాశాలు తగ్గుతాయి.
- ☆ 2050 నాటికి ప్రతి నాలుగైదేళ్ళకు విపరీతమైన వేసవి ఉష్ణోగ్రతలు తద్వారా వడగాడ్పులు వీస్తాయి. ప్రస్తుతం 20 ఏళ్లకు ఒకసారిగాని ఇలాంటి సంఘటనలు జరగడం లేదు.
- ☆ మహానగరాల్లో పరిస్థితి మరీ దారుణమయ్యే అవకాశముంది. అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్‌తో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీల వరకూ ఎక్కువ అవుతుంది
- ☆ అతినీలలోహిత కిరణాల రేడియోధార్మికత వ్యాధి నిరోధక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది.
- ☆ పెరిగే ఉష్ణోగ్రతలతో చిక్కు ఒకవైపు పొంచి ఉంటే.. కరువు కాటకాలు.. పెరిగే అంటువ్యాధులు మరోవైపు నుంచి కాటేస్తాయి.
- ☆ అనావృష్టి సూచి పెరిగినకొద్దీ పురుషుల ఆత్మహత్య రేటు 15 శాతం ఎక్కువ అవుతోందని తాజాగా ఆస్ట్రేలియన్ సర్వేలో తేలింది.
- ☆ ఆహార లభ్యత తగ్గడంతో పౌష్టికాహార లోపంతో ఇబ్బందిపడతారు. సులువుగా వ్యాధుల బారిన పడతారు
- ☆ వ్యాధి కారక క్రిమికీటకాలు కొత్త కొత్తప్రాంతాలకు చేరతాయి. ఉష్ణోగ్రతలు అనుకూలంగా ఉండటం వల్ల దోమల సంతతి పెరిగిపోతుంది.
- ☆ గాలి కాలుష్యం పెరిగిపోవడం వల్ల అలర్జీలూ ఎక్కువవుతాయి.
- ☆ పెరిగే సముద్ర మట్టాల కారణంగా తీర ప్రాంతాల్లో కుషిత నీటి సంబంధిత వ్యాధులు మరింత ప్రబలతాయి.
- ☆ ఊపిరితిత్తుల సమస్యలు సర్వసాధారణం అవుతాయి. రసాయనాలతో కాలుష్యం పెరిగి గాలిలో పుప్పొడి పెరగొచ్చు. శ్వాసించడం కష్టం.

☆ **భూతాపంతో ప్రాణవాయువూ కరువే**

తాజా అధ్యయనంలో వెల్లడించిన శాస్త్రవేత్తలు భూతాపం కారణంగా భూవాతావరణంలో ఆక్సిజన్ లభ్యత భారీగా పడిపోతుందని బ్రిటన్లోని లీ సెస్టర్ విశ్వవిద్యాలయం పరిశోధకులు చేసిన అధ్యయనం వెల్లడించింది. భూవాతావరణంలో ఆక్సిజన్ శాతం పడిపోవడం వల్ల జీవుల మనుగడకు తీవ్రమైన ముప్పు కలుగుతుందని వరదలు వంటి విపత్తుల వల్ల కలిగే ముప్పు కంటే ఇది ఎక్కువని పేర్కొన్నారు. భూతాపం వల్ల సముద్ర జలాల ఉష్ణోగ్రతలూ పెరుగుతున్నాయని 2100 సంవత్సరం నాటికి మహాసముద్రాల్లోని నీటి ఉష్ణోగ్రతలు 6 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర పెరుగుతాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే సముద్రాల్లోని మొక్కల ప్లవకాల(ఫిటో షాంక్టన్) కిరణజన్య సంయోగక్రియకు అంతరాయ మేర్పడి ఆమ్లజని విడుదల తగ్గిపోతుందని చెబుతున్నారు.

భూతాపం మరింత పెరిగితే అంటార్కిటిక్లోని మంచు కరిగి సముద్ర మట్టాలు పెరుగుతాయని వరదలు వచ్చి జీవరాశి రానికి ప్రమాదమేర్పడుతుందని ఇప్పటివరకు అంతా భావిస్తుండగా ఆమ్లజని ఉత్పత్తి తగ్గి అంతకుమించిన ముప్ప ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతుండడం మరింత ఆందోళనకర పరిణామం.

☆ **మూడింట రెండొంతుల ఆమ్లజని మహాసముద్రాల నుంచే**

భూవాతావరణంలోని ఆమ్లజనిలో మూడింట రెండొంతులు మహాసముద్రాల్లోని మొక్కల ప్లవకాల వల్లే ఉత్పత్తి అవుతోందని వాటి నుంచి ఉత్పత్తి నిలిచిపోతే జంతువులు, మనుషుల సామూహిక మరణాలకు దారి తీస్తుందని లీసెస్టర్ విశ్వవిద్యాలయ గణిత విభాగ ఆచార్యుడు సేర్గీ పెట్రోవ్స్కీ తెలిపారు ఈ భూతాపానికి సంబంధించిన ప్రధాన పరిశోధనలన్నీ కార్బన్ డై ఆక్సైడ్ చుట్టూ తిరుగుతుండగా లీ సెస్టర్ శాస్త్రవేత్తల బృందం ఆమ్లజని రాత్పత్తిపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేసింది.

భూతాపోన్నతిని తగ్గించడానికి మనం పాటించవలసిన విషయాల గురించి మనం తెలుసుకుందాం:

***దీనికి కంటే ముందు మనం నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు పారిస్లో జరిగిన ప్రపంచ పర్యావరణ సదస్సు గురించి తెలుసుకుందాం.***

## ఇవీ గత ఒప్పందాలు

భూపోన్నతి, వాతావరణ మార్పుల నియంత్రణకు ప్రపంచ దేశాలు చర్యలు మొదలుపెట్టింది రియో డి జెనీరోలో(1992) జరిగిన ఎర్త్ సమ్మిట్లోనే. ఈ సమావేశం ఫలితంగా 1987లో క్యోటో ప్రోటోకాల్ అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందానికి 8 దేశాలు మాత్రమే అంగీకారం తెలిపాయి. అమెరికా సహా కొన్ని పారిశ్రామిక దేశాలు ఒప్పందంపై సంతకాలు చేయలేదు. దీని ప్రకారం పారిశ్రామిక దేశాలు తమ కర్బన ఉద్గారాలను నాటి స్థాయి కంటే కనీసం 5 శాతం తక్కువ చేయాలి. ఈ ఒప్పందం అమల్లో కొన్ని దేశాలు విఫలమైనా మొత్తమ్మీద ఉద్గారాలు లక్ష్యం కంటే రెండు రెట్ల ఎక్కువ మోతాదులో తగ్గడం విశేషం. అయితే ఇదే సమయంలో 38 దేశాలు తగ్గించుకున్న ఉద్గారాల కంటే ఎక్కువ మోతాదులో చైనా వంటి దేశాలు ఉద్గారాలను విపరీతంగా పెంచేయడంతో మొత్తమ్మీద క్యోటో ప్రోటోకాల్ తాలూకూ ఫలితం కనిపించకుండా పోయింది.

2009 కోపెనెగెన్ సదస్సులో తొలిసారి అన్నిదేశాలు తమ తమ కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలన్న రామ్మిడి నిర్ణయానికి వచ్చాయి. అయితే ఇందుకు చట్టబద్ధమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవడం మాత్రం కుదరలేదు.

2012 దోహాలో జరిగిన సమావేశంలో క్యోటో ప్రోటోకాల్ ఒప్పంద కాలాన్ని 2020 వరకూ పొడిగించారు. ప్యారిస్ సదస్సుల్లో కుదిరే ఒప్పందం 2020 నుంచి 2030 వరకూ అమల్లో ఉంటుంది.

## కాప్ – 21 అంటే?

కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ను క్లుప్తంగా కాప్ అని పిలుస్తారు. ప్రస్తుతం ప్యారిస్లో జరుగుతున్నది 21వ సదస్సు. దాదాపు 190 దేశాల ప్రతినిధులు పాల్గొనే ఈ సదస్సులో (ఒక్కో దేశం ఒక్కో పార్టీ అన్నమాట) భూతాపోన్నతి ప్రభావంతో వాతావరణ మార్పుల రూపంలో ముంచుకొస్తున్న ప్రమాదాన్ని నివారించే చర్యలపై అంతర్జాతీయ స్థాయిలో ఓ ఒప్పందం జరిగింది.

## ఎందుకు ఇంత ప్రాముఖ్యత

ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా అకాల వర్షాలు, వరదలు ఎక్కువవుతున్న విషయం తెలిసిందే. భవిష్యత్తులోనూ ఈ సమస్యలు మరింత తీవ్రంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చాలాకాలంగా హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండేళ్లకోసారి కాప్ సదస్సు నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పటివరకూ జరిగిన సదస్సులు ఒక ఎత్తైతే. ఫ్రాన్స్లో జరిగిన కాప్ చాలా ప్రత్యేకం.

ఎందుకంటే ఈ సదస్సులో 2100 నాటికి భూమి సగటు ఉష్ణోగ్రత రెండు డిగ్రీల కంటే ఎక్కువగా పెరగకుండా ఉండేందుకు ఏం చేయాలనే దానిపై 190 దేశాల ప్రతినిధుల మధ్య కీలకమైన ఒప్పందం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగనున్న ఈ రెండు డిగ్రీల ఉష్ణోగ్రత కూడా చాలా ప్రమాదకరమే. చాలా దేశాలు, పెద్ద దేశాల్లోనూ తీర ప్రాంతాల్లోని కీలక పట్టణాలు కనుమరుగయ్యేందుకు ఇది కారణం కానుంది. ఇది తమను తీవ్రంగా నష్టపరుస్తుందని, దేశాలకు దేశాలు సముద్రంలో కలిసిపోయే ప్రమాదం రాందని కొన్ని చిన్న ద్వీప దేశాల అధినేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఏ లక్ష్యానికి కట్టబడతాయి? అగ్రరాజ్యాలు కొత్త ఒప్పందం సక్రమంగా అమలయ్యేందుకు ఎంత మేరకు ఆర్థిక సహకారం

అందిస్తాయన్నది ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

భూమిపై మనిషి మనుగడను ప్రశ్నార్థకం చేసే భూతాపోన్నతిని 2 డిగ్రీల కంటే తక్కువ స్థాయికి పరిమితం చేస్తామని దాదాపు 196 దేశాలు అంగీకరించడం మానవ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయంగా పేర్కొనడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్న భూతాపానికి కళ్ళెం వేసేందుకు ప్రపంచ దేశాలు కీలక ముందడుగా వేశాయి. అంతర్జాతీయ వాతావరణ సదస్సు (కాప్-21) ఈ అద్భుత ఘట్టానికి వేదికైంది. ప్రస్తుతం పారిస్‌లో జరిగినది కాప్ 21వ సదస్సు. కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్‌ను క్లుప్తంగా కాప్ అని పిలుస్తారు. ఈ సదస్సులో దాదాపుగా 196 పాల్గొన్నాయి.

పారిస్ సదస్సు నవంబర్ 30 నుండి డిసెంబర్ 12 వరకు రెండు వారాలుగా వాతావరణ నియంత్రణపై తీవ్ర చర్చోపచర్చలు తర్జన భర్జనలు జరిగిన అనంతరం ఈ సదస్సులో ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి లారెంట్ ఫేబియస్ ప్రవేశపెట్టిన 31 పేజీల తుది ముసాయిదాను ప్రవేశపెట్టాడు.

పారిస్ సదస్సు చివరి క్షణాలల్లో ఐక్యరాజ్య సమితి అధ్యక్షుడు బాన్ కీ మూన్ "మనల్ని కాపాడుతున్న ఈ భూమిని రక్షించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది" అని స్పష్టంగా ప్రకటించారు.

అనంతరం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఫ్రాకోయిస్ హోలాండే "భూమి భవితను నిర్ణయించే ఒప్పందం మన ముందుంది. ఈ తొలి వాతావరణ ఒప్పందాన్ని ప్రపంచ దేశాలన్ని ఆమోదించాలి" అని అభ్యర్థించాడు. అనంతరం భారత్, చైనా, అమెరికా సహా 196 దేశాల ప్రతినిధులు పర్యావరణాన్ని పరిరక్షించే ఒప్పందానికి ఆమోదం తెలిపారు.

### ఒప్పందంలోని ప్రధానాంశాలు

- ★ భూతాపాన్ని 2 డిగ్రీల సెల్సియస్ కన్నా 'బాగా తక్కువ' కు పరిమితం చేయాలి, 1.5 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గించడానికి ప్రయత్నించాలి.
- ★ మానవ చర్యల వల్ల వెలువడుతున్న గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణాన్ని చెట్లు, నేల, సముద్రాలు సహజంగా గ్రహించుకునే స్థాయికి పరిమితం చేయాలి. ఈ ప్రక్రియ 2050,2100 సంవత్సరాల మధ్య ప్రారంభమయ్యేలా ఉండాలి.
- ★ ఉద్గారాల తగ్గింపులో ప్రతి దేశం చేస్తున్న కృషిని ఐదేళ్లకోసారి సమీక్షించాలి. ఫలితంగా ఆయా దేశాలు తమ కృషిని మరింత తీవ్రం చేయగల్గుతాయి.
- ★ పేద దేశాలు పునరుత్పాదక ఇంధనానికి మారడానికి, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి సంపన్న దేశాలు 'వాతావరణ ఆర్థికసాయం' అందించాలి.

## కార్బన్ బడ్జెట్ అంటే ఏమిటి?

పారిస్ సదస్సు సందర్భంగా తరచూ ఒక మాట వినిపిస్తోంది. అది కార్బన్ బడ్జెట్ ఏమిటిది? అన్న సందేహం మీకూ వచ్చే ఉంటుంది. సమాధానం ఇదిగో. 2100 నాటికి భూమి ఉష్ణోగ్రతలను నిర్దిష్ట స్థాయికి పరిమితం చేసేందుకు ఎంత మేరకు గ్రీన్‌హౌస్ వాయువుల ను విడుదల చేసే అవకాశం ఉందో దాన్ని కార్బన్ బడ్జెట్ అని పిలుస్తున్నాడు. ఒక అంచనా ప్రకారం. పారిశ్రామిక విప్లవం మొదలైనప్పటి నుంచి 2100 వరకూ దాదాపు లక్ష కోట్ల టన్నుల కార్బన్‌డైయాక్సైడ్‌ను విడుదల చేసినా భూమి ఉష్ణోగ్రత రెండు డిగ్రీల సెల్సియస్‌కు మించి పెరగదు. అయితే ఈ లక్ష కోట్ల టన్నుల కార్బన్‌బడ్జెట్లో 2011 నాటికల్లా మనం 52 శాతం వాడేశాము. అంటే ఇప్పటికే దాదాపు 0.85 డిగ్రీ సెల్సియస్ పెరిగింది. మిగిలిన 85 ఏళ్లలో కేవలం 48 వేల కోట్ల టన్నుల మాత్రమే విడుదల చేసేందుకు అవకాశముంది.

## ఎవరెవరు ఎంతెంత?

వాతావరణంలో కార్బన్‌డైయాక్సైడ్ మోతాదు పెరిగిపోవడం భూతాపోన్నతికి కారణమని తెలుసుకున్నాం కదా. మరి ఈ విషవాయువులు ఎవరు ఎంత మోతాదులో విడుదల చేస్తున్నారో తెలుసా?

పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన దేశాలు చైనా, అమెరికాలు దాదాపు 33 శాతం ఉద్గారాలకు కారణమవుతున్నాయి. యూరోపియన్ యూనియన్ మరో 3 శాతం, భారత్, బ్రెజిల్ మరో ఆరు శాతం చొప్పున గ్రీనౌస్ వాయువులను వాతావరణంలోకి విడుదల చేస్తున్నాయిచ రష్యా 5, జపాన్(8), కెనెడా(2), ఇండోనేషియా (1.5), కాంగో (1.5) తరువాతి స్థానాలల్లో ఉన్నాయి.

## పెరుగుదల ఎంత ఉండొచ్చు?

ఈ శతాబ్దం చివరి నాటికి భూమి ఉష్ణోగ్రతలు ఎంత మేరకు పెరగవచ్చు అన్న అంశం కర్బన ఉద్గారాల తగ్గింపునకు తీసుకునే చర్యలపై ఆధారపడి ఉంటాయి. ప్రపంచ దేశాలన్నీ ఏ చర్య తీసుకోకుండా ఉద్గారాలను ఇలాగే కొనసాగిస్తే, పెరుగుదల 46 డిగ్రీ సెల్సియస్ వరకూ ఉండవచ్చు. ప్రభుత్వాలు ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాలను ఇలాగే కొనసాగిస్తే ఇది 88 డిగ్రీ సెల్సియస్, పారిస్ సదస్సులో తీసుకున్న విధాన నిర్ణయాలకు కట్టుబడితే 2.7 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితమవుతుందని అంచనా.

## ఒప్పందంలో.. భారత అభిప్రాయాలకు చోటు

వాతావరణ మార్పుపై కావ్21 సదస్సు ఆమోదం తెలిపిన ఒప్పందంతో భారత్ వెల్లడించిన అభిప్రాయాలకు చోటు దక్కిందని పరిశీలకులు వెల్లడించారు. సుస్థిర జీవన వినియోగ విధానాలు,



వాతావరణ న్యాయం అంశాలను ఒప్పంద పీఠికతో పొందుపరిచారు. వాతావరణ మార్పుపై పోరాటంతో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల బాధ్యత ఎవరెవరిది ఎంత అనేది. అన్ని అంశాల్లోనూ తప్పక పాటించాలనే భారత్ అభిప్రాయాన్ని ఇందులో పొందుపరిచారు.

వాతావరణ మార్పుకు సంబంధించి అన్ని అంశాలపై దృష్టిసారించి తయారుచేసిన ఒప్పందం. సమతుల్యమైనదని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి లారెంట్ ఫేబియస్ పారిస్‌లో అన్నారు. సభ్యత్వ దేశాల మధ్య మరింత విశ్వాసాన్ని పెంచేదిలా ఒప్పందం తయారుచేశామన్నారు. ఆయా దేశాల్లో అమల్లో ఉన్న వ్యవస్థలను దృష్టిలో ఉంచుకుని అత్యుత్తమైన, సమర్థవంతమైన, పారదర్శకమైన విధివిధానాలను రూపొందించామన్నారు. కాగా, భారత్, చైనా, సౌదీ అరేబియా సహా సభ్యత్వ దేశాల్లోని 134 అభివృద్ధి చెందుతున్న దేశాలు ఒప్పందాన్ని స్వాగతించాయి. తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డజనుకుపైగా దేశాలు ఉన్న లైక్ మైండెడ్ డెవలపింగ్ కంట్రీస్ (ఎల్ఎండీసీ) గ్రూప్ అధికార ప్రతినిధి గురుదయాళ్ సింగా నజార్ ప్రకటించారు.

## మనకు కావాల్సింది 650,00,00,00,00,000

వాతావరణ మార్పులను తట్టుకోవడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. దాదాపు అన్ని రంగాల్లోనూ కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాల్సి ఉంటుంది. కొత్త టెక్నాలజీతోపాటు మానవ వనరుల అభివృద్ధి పరిశోధనల కోసం కొత్తకొత్త సంస్థల ఏర్పాటు తదితర చర్యలు చేపట్టాల్సి వాంటుంది. ఇందుకోసం ఒక్క భారతదేశానికి మాత్రమే ఎంత మొత్తం అవసరమవుతుందో తెలుసా? దాదాపు లక్ష కోట్ల డాలర్లు! రూపాయల్లో చెప్పాలంటే.. 65 లక్షల కోట్లు! దేశంలోనే పేరెన్నికగన్న మూడు సంస్థలు సంయుక్తంగా తయారుచేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది.

“క్లైమెట్ చేంజ్ అండ్ ఇండియా అడాప్టేషన్ గ్యాప్ (2015). ఏ ప్రిలిమినరీ అసెస్‌మెంట్” పేరుతో ఐఐటీ, ఐఐఎం (గాంధీనగర్, అహ్మద్‌బాద్)లతో పాటు కౌన్సిల్ ఆన్ ఎనర్జీ ఎన్విరాన్మెంట్ అండ్ వాటర్లు ఈ నివేదికను సిద్ధం చేశాయి. గత 14 ఏళ్లలో దేశంలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాల (వరదలు, తుపానులు, వడగాడ్పులు, చలిగాలులు, కరువు కాటకాలు) వల్ల జరిగిన నష్టం ఆధారంగా ఈ మొత్తాన్ని లెక్కించారు. ఈ కాలంలో 131 సందర్భాల్లో వరదలు, 51 తుఫానులు సంభవించగా, 26 సార్లు చలిగాలులు, వడగాడ్పులతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వీటన్నింటి వల్ల జరిగిన నష్టం దాదాపు రూ.3 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా భవిష్యత్తులోనూ ఇలాంటివి మరిన్ని ఎక్కువ చోటు చేసుకునే అవకాశం వాన్న నేపథ్యంలో భారీస్థాయిలో నష్టాలు నమోదవుతాయి. అందుకే వీటిని తట్టుకునేందుకు, ఆస్తి ప్రాణ నష్టాలను తగ్గించేందుకు అనేక చర్యలు చేపట్టాల్సి వాంటుంది. వీటన్నింటికీ అయ్యే ఖర్చును పరిగణనలోకి తీసుకుంటే అది దాదాపు 65 లక్షల కోట్ల రూపాయల వరకూ ఉంటుంది.

## గొప్ప ముందడుగు

పారిస్ భూతాపోన్నతిని రెండు డిగ్రీల లోపునకు పరిమితం చేసేందుకు కుదుర్చుకున్న వాతావరణ ఒప్పందం గొప్ప ముందడుగు అని ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా సహా వివిధ దేశాధినేతలు పేర్కొన్నారు. ఈ ఒప్పందం దిశగా వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. అయితే పర్యావరణవేత్తల నుంచి మాత్రం భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పారిస్‌లో జరిగిన వాతావరణ సదస్సులో అంతర్జాతీయంగా చట్టబద్ధమైన ఒప్పందం కుదరడం తెలిసిందే. “దేశాలన్నీ కలిసి ముందుకెళితే ఏం సాధించగలమో ఈ ఒప్పందం రుజువు చేస్తోంది భూమిని రక్షించుకునేందుకు వాన్న మంచి అవకాశం ఇది ప్రపంచానికి ఇదో గొప్ప మలుపు అని వైట్‌హౌస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఒబామా పేర్కొన్నారు.

## పర్యావరణమే విజేత

పారిస్ ఒప్పందాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. “ఇది హరిత భవిత దిశగా కుదిరిన ఒప్పందం. ఇందులో విజేతలు. పరాజితులు లేరు పర్యావరణ న్యాయమే విజేత” అని అభివర్ణించారు. వాతావరణ సవాలును ప్రతీ దేశం స్వీకరించిన విధానాన్ని కొనియాడారు. ప్రపంచ దేశాల నేతల సమీకృత దార్శనికతను పారిస్ చర్చలు ప్రతిఫలించాయని ట్విటర్లో ప్రశంసించారు. ఒప్పంద తుది ముసాయిదా సిద్ధం కాగానే, ఫ్రాన్స్ అధ్యక్షుడు హోలాండ్.. మోదీకి ఫోన్ చేసి ముఖ్యాంశాలను చెప్పారని ప్రధాని కార్యాలయం తెలిపింది. హోలాండ్ వ్యవహరించిన తీరును ప్రధాని కొనియాడారు.

*– డి. జ్యోత్స్న దేవి, పరిశోధనా విద్యార్థి*

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. Telangana, Published at TSIPARD, Rajendranagar, Hyderabad-500 030 **Editor : Anita Ramachandran**